జనవరి
2025

225

సంపుటి : 20 సంచిక : 8 వెల రు. 15 /-

## ఈ సంచికలో........

సంపన్న వర్గాలు - భారత రాజకీయాలు
బిజెపితో కార్పొరేట్ రంగం మిలాఖత్
అమ్మకపు వస్తువుగా మారిపోయిన ఆధ్యాత్మికత
మధ్య యుగాల్లో ప్రజల జీవన పరిస్థితులు - సమాజం
ఆధునిక యుగంలో సైన్సు
కార్పొరేట్ దోపిడికి ఆటంకాలను తొలగించటానికే జమిలి ఎన్నికలు
నిధుల్లేక కునారిల్లుతున్న స్థానిక సంస్థలు-2
రాబందు సంస్కృతి
అస్సాం పౌరసత్వ సంక్షోభం
బుర్రకథ పితామహుడు షేక్ నాజర్

స్ఫూర్తి

# బుర్రకథ పితామహుడు షేక్ నాజర్

పిబి చారి

తెలుగుజాతి ప్రాచీన సంగీత కళా రూపం బుర్రకథ. ఈ జానపద ప్రక్రియను జనాకర్షణగా మలిచిన అరుణ కిరణం నాజర్. ఒకనాడు మత ప్రబోధాలకు, ఉదర పోషణకు మాత్రమే పరిమితమైన బుర్రకథను తాడిత పీడిత బాధిత జనం మెదళ్లకు పదును పెట్టే పనిముట్టుగా మలిచిన కళా స్రష్ట నాజర్. బుర్రకథతో ఆయన ఒక తుఫాను రేపాడు, ఒక తరాన్ని ఊపాడు. బుర్రకథల ద్వారా ప్రజల్లో అభ్యుదయ, విప్లవ బీజాలు నాటాడు. బుర్రకథను పదహారు అణాల ప్రజా కళగా తీర్చిదిద్దిన గొప్ప వాగ్గేయకారుడు ఆయన. కమ్యూనిస్టు పార్టీకి అంకితమై, ప్రజలలో చైతన్యం కొరకు అహర్నిశలు అత్యంత ప్రతిభతో నిబద్ధతగా పనిచేసిన కళాకారుడు నాజర్.

ప్రజలకు వినోదంతో పాటు విజ్ఞానం, చైతన్యం కలిగించే మహత్తర మాధ్యమం బుర్రకథ. అందునా ప్రజానాట్యమండలి ప్రచార సాధనాలలో అత్యుత్తమ ప్రదర్శన కళారూపమే బుర్రకథ. అంతేకాకుండా సులభంగా ముగ్గురు వ్యక్తులతో మధ్యలో ప్రధాన కథకుడు ఇద్దరు వంతగాళ్ళతో ప్రదర్శింప వీలయ్యే జానపద కళారూపం అది. చెవికింపు గొలిపే సంగీతం, కంటికి వినోదం ఒనర్చే నృత్యాభినయం, మనసును మురిపించే చమత్కారమైన మాటలు, పాటలు, పద్యాలు, హాస్యం, వంతల వినోదం తో కూడిన బుర్రకథ పండిత పామర జనాన్ని సమానంగా ఆకర్షించే వినోద విజ్ఞాన సాధనం. జంగం కథలు ఈ బుర్రకథలకు పూర్వ రూపాలు. జంగం కథల లక్షణాలే దాదాపు బుర్రకథల లక్షణాలు అనటంలో సందేహం లేదు. ఒకప్పుడు జంగం కథగా ప్రసిద్ధి చెందిన ఈ కళారూపం తర్వాతి కాలంలో తాంబుర్ర కథగా, తందాన కథగా, గుమ్మెట్ల కథగా అనేక ప్రాంతీయ భేదాలతో ప్రసిద్ధమైంది. కృష్ణా, గుంటూరు, విజయ నగరం జిల్లాలలో ఇది బుర్రకథగా ప్రసిద్ధమైనది.

ఇలాంటి ఈ ప్రక్రియను సాధనంగా చేసుకుని బుర్రకథలో వస్తు, శిల్పాలతో ఎప్పటికప్పుడు నవ్యతను, నాణ్యతను జోడించి రాగ రంజిత ప్రతిభతో వేలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా



నిలిచిపోయిన మేరు నగధీర కళాకారుడు పద్మశ్రీ నాజర్. బుర్రకథ పితామహుడుగా గణతికెక్కాడు. నాజర్ బుర్రకథలను వినటానికి, చూడటానికి సుదూర ప్రాంతాల నుండి ప్రజలు బండ్లు కొట్టుకొని తండోపతండాలుగా తరలివచ్చే వారంటే ఆయన చెప్పే బుర్రకథకు, ప్రదర్శించే తీరుకు అంతటి ఆకర్షణ ఉండేది. అట్టడుగు వర్గం నుండి పుట్టి అనేక సాధక బాధలు అనుభవించిన నాజర్, అదే అట్టడుగు వర్గపు ప్రజా సాహిత్యానికి పట్టం కట్టాడు. జానపద కళాకారులలో పద్మశ్రీ అవార్డు అందుకున్న తొలి వ్యక్తిగా నాజర్ చరిత్ర సృష్టించాడు. అది తెలుగు వారికి ఎంతో గర్వకారణం.

అహర్నిశలు శ్రమించినా, కడుపు నిండని కూలిగా బయులుదేరి మానవ హృదయాలలోని అగాధ బాధలను, ఉన్నత భావాలను ప్రతిబింబించే రసజ్ఞ కళాకారుడుగా జీవితాన్ని నిర్మించుకున్న వ్యక్తి నాజర్. కష్టాల కొలిమిలో కాగి కాగి కాకలు తీరిన జీవితం ఆయనది. దుర్భర పేదరికం అనుభవించాడు. సంగీతం నేర్చుకోవడానికి యాచనకైనా వెనకాడలేదు. కళ కళ కోసం కాదు, కాసుల కోసం కాదు, ప్రజల కోసం. కళ ప్రజలది, ప్రజల నుండి ప్రజలకు అన్న సూక్తిని జీవితాంతం మనసా వాచా కర్మణా ఆచరించిన వ్యక్తి నాజర్. ఆయన గొప్ప నటుడు, గాయకుడు, రచయిత, కలం పట్టింది మొదలు కన్నుమూసే వరకు అనేక పాటలు, పద్యాలు, నాటకాలు, బుర్రకథలను రచించి ప్రదర్శించాడు. ఆయన జనం మెచ్చిన కళాకారుడు. జనం భాషలో పాడాడు, జనం కోసం రాశాడు, జనం కోసం పాడాడు, ఆడాడు. ఆనాడు తెలుగు నాట విశేష ప్రచారంలో ఉన్న భజన పాటలు, కోలాటాలు, బిచ్చగాళ్ళ పాటలు, వీధి భాగవతుల గాన శైలి, జక్కుల వరసలు పరిశీలించి కొత్త మార్గం ఏర్పరిచి పాటలు పద్యాలు రచించి పాడేవాడు. హరికథ అనగానే ఆదిభట్ల నారాయణదాసు గుర్తుకొచ్చినట్లు, జముకుల పాట అనగానే సుబ్బారావు పాణిగ్రహి గుర్తుకు వచ్చినట్లు, బుర్రకథ అనగానే తెలుగువారికి ఎప్పటికీ మదిలో ఉండిపోయే మహనీయ కళాకారుడు నాజర్.

నాజర్ ఫిబ్రవరి 5, 1920లో గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఒక నిరుపేద దూదేకుల సాయిబుల కుటుంబంలో జన్మించారు. తండ్రి షేక్ మస్తాన్, తల్లి బి బాబి. నాజర్ పూర్తి పేరు "షేక్ నాజర్ వలి". నాజర్ తండ్రి షేక్ మస్తాన్ చెక్క భజనలో ప్రసిద్ధుడు. ఏరోజు కారోజు కూలికి వెళితే గాని జరుగుబాటు లేని జీవితాలు వారివి. నాజర్ వీధి బడిలో ఐదో తరగతి వరకు మాత్రమే చదివాడు. హై స్కూల్ ముఖం ఎలా ఉంటుందో కూడా ఆయనకు తెలియదు. కానీ నాజర్ చిన్ననాటి నుండే సంగీతం అన్నా, పాటలు అన్నా చాలా ఇష్టపడుతూ పాడేవారు. వాళ్ల నాన్నగారు పొద్దుట కూలికి వెళ్లి మధ్యాహ్ననికి ఏవో జొన్న కంకులు కొన్ని

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...


1. బుర్రకథ పితామహుడు షేక్ నాజర్

పిబి చారి..........2

2. సంపన్న వర్గాలు - భారత రాజకీయాలు

సబా నక్వీ.......4

3. బిజెపితో కార్పొరేట్ రంగం మిలాఖత్

మిథాలీ ముఖర్జీ.......4

4. అమ్మకపు వస్తువుగా మారిపోయిన ఆధ్యాత్మికత

జావెద్ అఖ్తర్........ 8

5. మధ్య యుగాల్లో ప్రజల జీవన పరిస్థితులు - సమాజం

ఎంవిఎస్ శర్మ........13

6. ఆధునిక యుగంలో సైన్సు

ఎస్ వెంకట్రావు........17

7. కార్పొరేట్ దోపిడికి ఆటంకాలను తొలగించటానికే జమిలి ఎన్నికలు

ఎ కోటి రెడ్డి............ 23

8. నిధుల్లేక కునారిల్లుతున్న స్థానిక సంస్థలు-2

డా॥ బి గంగారావు........26

9. రాబందు సంస్కృతి

సీతారామ్ ఏచూరి..... ....28

10. అస్సాం పౌరసత్వ సంక్షోభం

సుశాంత్ తాలూక్‌దార్.... ..30



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# అమిత్ షా వ్యాఖ్యలు

**భా**రత రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా పార్లమెంటులో జరిగిన చర్చలో కేంద్ర హోమ్ శాఖ మంత్రి, బిజెపి ప్రభుత్వంలో నెంబర్ 2 గా ఉన్న అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు అంబేద్కర్‌పై సంఘ పరివారానికీ, దాని రాజకీయ పార్టీ అయిన బిజెపికీ ఉన్న ద్వేషభావాన్నే కాదు, భారత రాజ్యాంగం పట్ల వారికున్న విముఖతను కూడా తెలియజేస్తున్నాయి. "అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అనడం ఫ్యాషన్ అయిపోయింది. దేవుని పేరు ఇన్ని సార్లు జపించి ఉంటే వాళ్లకు స్వర్గప్రాప్తి జరిగి ఉండేది" అని ఆయన నిండుకొలువులో వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యల పట్ల దేశ వ్యాపితంగా తీవ్ర నిరసన వ్యక్తం అయింది. వామపక్షాలు, కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలు అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన తెలియజేయడమే కాదు, రాజ్యాంగ నిర్మాత పట్ల అటువంటి దుర్వ్యాఖ్యలు చేసిన ఆయన హోమ్ మంత్రి పదవికి అనర్హుడనీ అందువల్ల తక్షణం ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. వామపక్షాల అధ్వర్యంలో డిసెంబర్ 30వ తేదీన అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రదర్శనలు, ఆందోళనా కార్యక్రమాలు జరిగాయి. దేశ వ్యాపితంగా వ్యక్తమైన నిరసనతో ఖంగుతిన్న బిజెపి తప్పును కప్పిపుచ్చుకునే నాటకాలకు తెరతీసింది. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటులోకి ప్రవేశించడానికి చేసిన ప్రయత్నాన్ని బిజెపి ఎంపీలు అడ్డుకున్నారు. దాంతో రెండు పక్షాల మధ్య జరిగిన తోపులాటలో కాంగ్రెస్ నేత మల్లిఖార్జున ఖర్గేకి, ఇద్దరు బిజెపి ఎంపీలకు స్వల్ప గాయాలయ్యాయి. దీన్ని అడ్డం పెట్టుకుని సమస్యను పక్కదోవపట్టించేందుకు బిజెపి నేతలు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి.

ఏమైనా అమిత్ షా వ్యాఖ్యలను కేవలం నోటిమాటలుగా మాత్రమే తీసుకోడానికి లేదు. అంబేద్కర్ పట్ల, ఆయన రూపొందించిన రాజ్యాంగపట్ల, ఈ దేశంలోని మొత్తం దళితుల పట్ల బిజెపి-ఆర్ఎస్ఎస్ వైఖరికి అద్దం పట్టే వ్యాఖ్యలు ఇవి. భారత రాజ్యాంగం అన్నా, అందులోని లౌకక, ప్రజాతంత్ర విలువలన్నా ఆర్ఎస్ఎస్-బిజెపి పరివారానికి గిట్టదన్న విషయాన్ని అవి అడుగడుగునా నిరూపించుకుంటూనే ఉన్నాయి. వాటికన్నా మనుస్మృతి వాటి హృదయానికి దగ్గరగా ఉంది. భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెట్టడానికి బిజెపి అనేక విధాలుగా ప్రయత్నిస్తోంది. ఇటీవలి కాలంలో సనాతన ధర్మం పేరుతో దేశ వ్యాపితంగా అది లేవనెత్తిన చర్చ వెనుకనున్న ఉద్దేశ్యం కూడా అదే. దళితులనూ, స్త్రీలనూ ఏహ్యభావంతో చూస్తూ వారికి ఎటువంటి హక్కులూ ఇవ్వ నిరాకరించే మనుస్మృతిని అంబేద్కర్ తుదకంటా వ్యతిరేకించారు. లౌకికతత్వం, సామాజిక న్యాయాలకు పెద్దపీట వేస్తూ ఆయన రాజ్యాంగాన్ని రచించారు. సరిగ్గా ఈ కారణం చేతనే బిజెపి-ఆర్ఎస్ఎస్ అంబేద్కర్‌ను ద్వేషిస్తున్నాయి. అందువల్ల అమిత్ షా వ్యాఖ్యలను కేవలం అంబేద్కర్ మీద చేసిన ద్వేషపూరిత వ్యాఖ్యలుగానే చూడకూడదు, ఏ ప్రజాతంత్ర, లౌకిక, సామాజిక న్యాయ విలువల కోసం అంబేద్కర్ జీవితాంతం కృషి చేశారో ఆ విలువలకు వ్యతిరేకంగా చేసిన దుర్వ్యాఖ్యలుగా చూడాలి.

అంబేద్కరంటేనే కాదు దళితులన్నా బిజెపికి వ్యతిరేకతే. వారికి రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్లకు కూడా అది వ్యతిరేకమే. మోడీ అధికార పీఠం అధిరోహించిన పదేళ్ల కాలంలో దళితులపై నిరంతరం భౌతిక దాడులు, వారి హక్కులపట్ల చట్టపరమైన దాడులు జరుగుతూనే ఉన్నాయి. 2018లో ఎస్సీ, ఎస్టీ చట్టానికి సవరణలు చేసినప్పుడు దేశ వ్యాపితంగా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ఆ సందర్భంగా అనేక చోట్ల బంద్ జరిగింది. పదిమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దాంతో మోడీ ప్రభుత్వం దిగివచ్చి చట్టం తొలి రూపాన్ని పునరుద్ధరించింది. 2016లో గుజరాత్‌లోని ఉనాలో దళిత యువకులను కొరడాలతో కొట్టడం, 2018లో భీమా కొరెగాంవ్ హింసాకాండ, 2016లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల ఆత్మహత్యతో బాటు దళితులపై ఈ కాలంలో అనేక దాడులు జరిగాయి.

అందువల్ల అమిత్ షా వ్యాఖ్యలను కేవలం సందర్భ వశాత్తూ చేసిన కువ్యాఖ్యలుగా మనం తీసుకోరాదు. బిజెపి-ఆర్ఎస్ఎస్ దళిత వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ధోరణి, అందులో భాగంగా రాజ్యాంగాన్ని మార్చడానికి జరుగుతున్న కుట్రల నేపధ్యంలో వీటిని చూడాలి. అమిత్ షా రాజీనామా డిమాండ్ వెనుక దళితులనే కాక, ప్రజాతంత్ర, లౌకిక విలువలకు కట్టుబడి ఉండే వారందరినీ సమీకరించి పరివార్ కుట్రలను తిప్పికొట్టాలి.

# సంపన్న వర్గాలు - భారత రాజకీయాలు

సభా నక్వీ



రచయిత ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న జర్నలిస్టు. రాజకీయాలు, అస్థిత్వ ఉద్యమాల మీద ఇప్పటివరకు నాలుగు పుస్తకాలు వెలువరించారు

ప్రపంచ కుబేరుడయిన ఎలాన్‌మస్క్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయిన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో భాగం కానున్నాడు. డొనాల్డ్‌ట్రంప్ స్వయానా బడా రియల్‌ఎస్టేట్ వ్యాపారవేత్త. మస్క్ వ్యాపార ప్రయోజనాలు అమెరికా ప్రయోజనాలు ఒకటి కావు. అయినా ప్రస్థుతానికి మస్క్ తన వ్యాపార ప్రయోజ నాలకు ఏకంగా ప్రభుత్వాన్నే పనిముట్టుగా వాడుకునే అవకాశం దక్కించుకున్నాడు. రాజకీ యాలు అంటే బడా పెట్టుబడికి పర్యాయ పదంగా మారిపోవడం నైతికంగా తీవ్రమైన ఆందోళనపరిచే అంశం. కానీ ప్రపంచవ్యా ప్తంగా మనదేశం సహా అనేక దేశాల్లో బడా వ్యాపారవేత్తలు రాజకీయాల్లోకి వస్తున్నారు. వాళ్ళమీద ఉన్న అవినీతి ఆరోపణలు, పన్నుల ఎగవేత వంటి సమస్యల నుండి తప్పించుకో వడానికి, తమవ్యాపార ప్రయోజనాలకు అనుగుణమైన చట్టాల రూపకల్పన కోసం వీళు ్ళ రాజకీయాల్లో చేరుతున్నారు. ఇది నైతికంగా, సామాజికంగా పెద్ద తప్పు, అయినా జరుగు తున్నది. తాజాగా మహారాష్ట్ర రాజకీయాలు ఇందుకు ఒక ఉదాహరణ.

మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా ముంబైలో చేసిన స్వల్పకాలిక పర్యటన ఎన్నికల ప్రచారసరళి మీద మాకు విహంగ వీక్షణ అవగాహన కల్పించింది. ఈ మహా నగరంలోని ప్రజలు తమ అభ్యర్థులకు ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారాల గురించో, లేక ఆ వ్యాపారులతో ఉన్న సంబంధాల గురించో చర్చించుకోవడం కనబడింది. ఫలానా రియల్ ఎస్టేట్-కమ్-రాజకీయవేత్త అయిన x ని అతని ప్రత్యర్థి y కాల్చి పారేసే అవకాశం ఉ ందనో, లేదూ ఫలానా y, z అభ్యర్థులకు వింత బలమైన రియల్ ఎస్టేట్ లాబీ వెన్నూ దన్నూ ఉందనో మాట్లాడు కుంటున్నారు. అన్నిటికీ మించి ఎక్కువ మంది అదానీ గురించి చర్చించుకుంటున్నారు. ఎందుకంటే ప్రపంచంలోనె అత్యంత సంపన్నమైన రియల్‌ఎస్టేట్ సామ్రాజ్యాన్ని ఆనుకుని ఉన్న ఆసియాఖండంలోనే అతి పెద్ద మురికివాడ అయిన ధారవి భూమి యావత్తూ అదానీ పరం కానున్నది కాబట్టి, ధారవి అభివృద్ధి

# బిజెపితో కార్పొరేట్ రంగం మిలాఖత్

మిథాలీ ముఖర్జీ



రచయిత ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలోని రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో జర్నలిజం కోర్సు డైరెక్టరు. (ప్రింట్, డిజిటల్, టీవీ జర్నలిజంలో రెండు దశాబ్దాల అనుభవం గల రాజకీయ, ఆర్థిక విశ్లేషకురాలు)

దక్షిణ ఢిల్లీ ప్రాంతంలోని బహుళ అంతస్థుల సంపన్న గృహాలు తాజాగా ఒక ఆనవాయితీ పాటిస్తు న్నాయి. ఇంటి గుమ్మాలముందు ఎండ వేడిమికి ముడుచుకుపోయిన కాషాయ జండాలు కనిపిస్తుం టాయి. హౌసింగ్ సొసైటీలలోని ఇళ్ళ బాల్కనీల్లో మొక్కలతోపాటు ఈ జెండాలు రెపరేపలాడుతూ ఉంటాయి. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ జ్ఞాపకంగా సాధారణ ఎన్నికలకు ముందుగా జై శ్రీరాం అన్న అక్షరాలు ముద్రించిన కాషాయ జండాలను హిందూత్వ శక్తులు ఇంటింటా పంచాయి.

ఈ జెండాలు ఇంటి గుమ్మాలకో, బాల్కనీల్లోనో తగిలించడం గర్వకారణంగా, సామాజిక హోదాగా మారింది. సంపన్న వ్యాపారస్థుల, కార్పొరేట్ సంస్థల రాజకీయ వైఖరిని ప్రకటిస్తున్నాయి.

### సంపన్నవర్గాలు - రామమందిరం

ఈ మధ్యకాలంలో చోటు చేసుకున్న రెండు ప్రధాన ఘట్టాలు కార్పొరేట్ సంస్థాధిపతుల వైఖరికి అద్దం పడుతున్నాయి. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ సంబరం మొదటిది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారా ల్లో తిలకించిన వారందరికీ భారత కార్పొరేట్ సంస్థాధిపతులు అందరినీ ఒకచోట చూసే అవకాశం దక్కింది. రిలయన్స్ సంస్థల అధిపతి అంబానీ నుండి ఉక్కు పరిశ్రమాధిపతి లక్ష్మీ మిట్టల్ వరకూ అందరూ హాజరు వేయించు

పేరిట అదానీ దక్కించుకోనున్న ఈ భూమి అతనికి ఎంతటి సిరులు పండిస్తుందో తెలుసుకుంటే ఎవరికైనా కళ్ళు చెదిరిపోతాయి, మతులు పోతాయి. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీ ఎలాన్ మస్క్‌లా ప్రభుత్వంలో భాగం కాకపోవచ్చు కానీ నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం ప్రతి రాజకీయ గదిలో చొరబడగల గజరాజు వంటివాడు అదానీ.

**“ అందుకే మహారాష్ట్రలో డబ్బు విచ్చల విడిగా చలామణి అవుతుంటుంది. ప్రజల హక్కుల కోసం పోరాడడం అనేది ఇక్కడ కేవలం అలంకార ప్రాయం. భారతీయ ప్రజాస్వామ్యం డబ్బు బలిసిన బడాబాబుల ప్రయోజనాలలో బందీగా మారింది. రాజకీయ ప్రత్యర్థుల మీద ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దాడులు, డబ్బు ప్రవాహం, భారీ అవినీతి - ఇవన్నీ మూకు మ్మడిగా పార్టీలు మారడానికి, పార్టీలను చీల్చడానికి సాధనంగా మారాయి. ”**

**అసెంబ్లీ ఎన్నికలా, ఆస్తి యుద్ధాలా?**

పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతానికి సింహ ద్వారంగా చెప్పుకునే పూనెలో రాజకీయ కథ నాలు రియల్టర్‌ల యుద్ధాలకు బదులు ప్రత్యర్థి సంపన్న వర్గాల వారసుల మధ్యన నెలకొన్న ప్రతీకారేచ్ఛలో లేదా రాజకీయ వారసత్వ కుటుంబాల మధ్యన నెలకొన్న శతృత్వాల మీదకి మళ్ళుతుంది. అంతిమంగా ఇక్కడ రాజకీయా లు అంటే కోపరేటివ్ సంస్థలు, చక్కెర మిల్లులు, భూములు తదాది ఆస్థులమీద పట్టుకోసం సాగే పెనుగులాటలుగా మారాయి. ప్రజాతీర్పు అంతిమంగా దారి తీసేది ఇక్కడికే. అందుకే ఎన్నికలలో ఎంత డబ్బయినా పెట్టుబడి పెడ తారు. గెలిస్తే ఇంతకు రెండింతల రాబడి ఉంటుంది. అలాగే కొన్ని వ్యాపారాలు, షాపులు, రియల్ఎస్టేట్ కేటాయిం పులు చేసే అధికారం, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే సత్తా ఒనగూడుతాయి. ఇక్కడ రాజకీయాలు అంటే ఇచ్చిపుచ్చుకోవడం, లోపాయకారీ ఒప్పందాలు చేసుకోవడం, పట్టపగలే అవినీతికి పాల్పడడం. ఎన్నికల రాజకీయాలలో ఎంతకైనా సిగ్గుపడ కుండా దిగజారడం. ఇంక ప్రజల సంగతి అంటారా – ఒక సారి ఓటు వెయ్యడంతో వాళ్ళ పవిత్ర కర్తవ్యం ముగిసిపోయినట్లే.

అందుకే మహారాష్ట్రలో – దుర్భర దారిద్ర్యం అనుభవించే ప్రజలు ఉన్న ప్రాంతాల సహా – డబ్బు విచ్చల విడిగా చలామణి అవుతుంటుంది. ప్రజల హక్కుల కోసం పోరాడడం అనేది ఇక్కడ కేవలం అలంకార ప్రాయం. భారతీయ ప్రజాస్వామ్యం డబ్బు బలిసిన బడాబాబుల ప్రయోజనాలలో బందీగా మారింది. రాజకీయ ప్రత్యర్థుల మీద ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దాడులు, డబ్బు ప్రవాహం, భారీ అవినీతి – ఇవన్నీ మూకు మ్మడిగా పార్టీలు మారడానికి, పార్టీలను చీల్చడానికి సాధనంగా మారాయి. పార్టీ సిద్ధాంతాలకు పాతర వేసేసారు. నిజమైన సంక్షేమ పథకాలను పక్కనపెట్టి ఎన్నికలు జరగడానికి ముందుగా పచ్చి అవకాశవాదంతో జనాల చేతికి ఉచితంగా డబ్బువచ్చిపడే పథకాలు రంగం మీదకి వచ్చాయి. అక్షరాలా ఇది ఓటుకు నోటు పథకాలు, ఇది నైతికంగా, రాజకీయంగా తప్పనే భావన రాజకీయ నాయకత్వంలో ఏకోశానా లేదు.

2024లో జమ్ము–కాశ్మీర్, జార్ఖండ్, హర్యానా, మహారాష్ట్రల శాసనసభలకు ఎన్ని కలు జరిగాయి. ఈ ఎన్నికలలో మహారాష్ట్ర శాసనసభకు పోటీ చేసిన అభ్యర్థులు అత్యధిక ఆస్తులు కలిగి ఉన్నవారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్ (ADR) పరిశీలనలో తేలింది. ఆ తర్వాత వరసలో హర్యానా ఎన్నికలలో పాల్గొన్న అభ్యర్థులు ఉన్నారు. ఈ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందినవి కావడం, దేశరాజధాని ప్రాంతానికి సమీపంగా ఉండడం మూలాన రియల్ఎస్టేట్ విలువ భారీగా ఉండడమే ఇందుకు కారణం. అయితే మహారాష్ట్రకు, హర్యానాకూ పోలికే

కున్నారు. టెలికాం సంస్థల చక్రవర్తి సునీల్ భారతి మిట్టల్ అయితే 'ఈరోజు అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి హాజరు కావ డం అంటే ఆ జగదభిరాముడి ఆశీర్వాదం నాకు దక్కినట్లే భావిస్తాను' అని చెప్పాడు. ఈ అమృత ఘడియల కోసమే దేశం ఎన్నేళ్ళగా ఎదురు చూస్తోంది అని భక్తి పారవశ్యంతో అన్నాడు.

ఆదిత్య బిర్లా గ్రూప్ అధిపతి కుమార మంగళం బిర్లా తన కుమార్తె, తన వ్యాపార సామ్రాజ్యానికి కాబోయే వారసురాలయిన అనన్య బిర్లాతో ఈ ఉత్సవానికి హాజరయ్యాడు. 'ఇది కేవలం భారత దేశానికే కాదు. యావత్ ప్రపంచానికి పండగ రోజులాంటిది' అని అభివర్ణిస్తూ ప్రతి భారతీయుడూ విధిగా ఈ ఆలయాన్ని సందర్శించాలని పిలుపునిచ్చాడు. ఎస్సార్ గ్రూప్ అధిపతి ప్రశాంత్ రుయా, రియల్ ఎస్టేట్ టైకూన్ నిరంజన్ హీరానందిని, నవతరం వ్యాపారవేత్తలు ఈజ్ మై ట్రిప్ సి.ఇ.ఓ. నిషాంత్ పిట్టి, ఓయో వ్యవస్థాపకుడు, సి.ఇ.ఓ. రితేష్ అగర్వాల్ వంటి హేమా హేమీలు ఎందరో మందిర ప్రారంభోత్సవ సంబరంలో పాల్గొన్నట్లు సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసారు.

ఇక మహీంద్రా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ఆనంద్ మహీంద్ర అయితే 'రామ మందిర ప్రారంభోత్సవం ఆదర్శనీయమైన సుపరిపాలనకు సూచిక, మతానికి అతీతంగా రామనామస్మరణకు ప్రపంచం యావత్తు పరితపిస్తున్న తరుణం' అంటూ సామాజిక మాధ్యమం X (ట్విట్టర్)లో పోస్ట్ చేసాడు. తద్వారా ఈ గుడి చుట్టూ అలుముకుని ఉన్న వివాదాన్ని, హింసాత్మక ఉన్మాద విధ్వంసకర చరిత్రను, మతాన్ని, రాజకీయాలను, వ్యాపారా లను వేర్వేరుగా చూడాలని నిర్దేశించే మన లౌకిక, ప్రజాస్వామిక సామ్యవాద రాజ్యాంగ విలువలను ఒక్క కలం పోటుతో పక్కకి నెట్టేసాడు.

ఇప్పటివరకూ మనదేశంలో మతం, వ్యాపారం ఇంత పారదర్శకంగా పెనవేసుకు పోయి జోడీ కట్టిన చరిత్రేలేదు. కార్పొరేట్ సంస్థాధీశులు ఇహ మీదట మెజారిటీ మత విశ్వాసాల ఆధారంగా ప్రభుత్వం నడవాలని కోరుకుంటున్నారా? లేదూ కార్పొరేట్ రంగం ఎప్పుడూ అనూహ్యమైన, నిలకడలేని విధాన పరమైన వాతావరణంలో వ్యాపారాలు సాగిం చడానికి అధికార నడవాల నుండి, వ్యాపారా ధీశుల నుండి అదనపు అర్హతలు ఆశిస్తు న్నదా? ఏరకంగా చూసినా కార్పొరేట్ వ్యాపార, పారిశ్రామిక రంగం గతంలో కన్నా ప్రభావశీలమైనది. ప్రభుత్వంతో ఎలా వ్యవహ రించాలో నిర్దేశించగలిగే శక్తి కలది. దేశంలో వాణిజ్య సామ్రాజ్యంలో నెగ్గుకురావాలంటే ఏ మార్గం అనుసరించాలో పారిశ్రామిక వేత్త లకు కొత్తగా మార్గ నిర్దేశనం చేస్తా ఉన్నట్లుంది.

**బిజెపితో బంధం**

ఇక రెండవ ఘటన ఎలక్టోరల్ బాండ్స్.

> **"2014లో దేశ రాజధాని పీఠాన్ని మోడీ అధిరో హించడం వెనుక కార్పొరేట్-హిందూత్వ శక్తుల మధ్య అంకురించిన గాఢమైన బంధం పనిచేసిందని మనకు తెలుసు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం పోటీకి రానంత స్థాయిలో బిజెపి 2014 ఎన్నికల సందర్భంగా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసింది."**

లేదని చెప్పుకోవాలి. మహారాష్ట్ర అనేక ఉప ప్రాంతాలుగాను మరింత నాటకీయమైన సామా జిక శ్రేణుల విభజనతోనూ పరివేష్ఠితమై ఉన్నది.

మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో పాల్గొన్న అభ్యర్థులలో అత్యంత ధనవంతులుగా లెక్కతేలిన మొదటి మొగ్గురూ బిజెపి పార్టీకి చెందిన వారని ఎడిఆర్ బహిర్గతం చేసింది. ముంబైలోని ఘట్ కోపర్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుండి బిజెపి టికెట్టుపై పోటీచేసిన పరాగ్‌షా ఆస్తులు 3,383 కోట్ల రూపాయలు. రాయ్‌గడ్ లోని పన్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి ప్రశాంత్ రాంసేట్ ఠాకూర్ ఆస్థులు 475 కోట్ల రూపాయలు. అలాగే ముంబైలోని మలబార్ హిల్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి మంగళ్ ప్రభాత్ లోథా ఆస్తుల విలువ 447 కోట్ల రూపాయలు. వందల, వేలకోట్ల ఆస్తిపరులు శాసనసభ ఎన్నికలలో పోటీపడడం ఆశ్చర్యం గా అనిపించవచ్చు కానీ అసలు ఈ అపరకుబేరులు ఎన్నికల రాజకీయాల్లోకి ఎందుకు వస్తున్నారన్న ప్రశ్నకదా మనకి తట్టాల్సింది.

**చిన్న వ్యాపారుల పార్టీ - బడా వ్యాపారాల దోస్తు**

అంతేకాదు ప్రపంచ వ్యాప్తంగానే, సమానత్వం, సామాజిక న్యాయం అన్న పదాల పొడగిట్టని పచ్చిమితవాద రాజకీయ పార్టీలు అపరకుబేరులకు, వారి రాజకీయ ప్రయోజనాలకు సహజనెలవుగా ఎందుకు మారాయి అన్న ప్రశ్న కూడా మనకు ఎదురవ్వాలి. 2014లో దేశ రాజధాని పీఠాన్ని మోడీ అధిరోహించడం వెనుక కార్పొరేట్-హిందూత్వ శక్తుల మధ్య అంకురించిన గాఢమైన బంధం పనిచేసిందని మనకు తెలుసు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం పోటీకి రానంత స్థాయిలో బిజెపి 2014 ఎన్నికల సందర్భంగా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసింది. స్వాతంత్ర్యానంతర భారతదేశం లో బహుశా 2014 పార్లమెంటు ఎన్నికలే అత్యంత ఖర్చుతో కూడుకున్నవి కావడం వింతకాదు.

బ్రాహ్మణ, బనియా కులస్థుల సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ ఆ ఎన్నికలలో బిజెపికి పూర్తి అండదండలు అందించింది. బిజెపి అధికారంలోకి రావడానికి ముందు అది ప్రధానంగా చిరు వ్యాపారస్థుల చందాలమీద అధారపడేది. అటల్‌బిహారీ వాజ్‌పాయ్ శకంలో ముంబై రాజకీయవేత్త ప్రమోద్ మహాజన్ భారీనిధుల సమీకర్తగా వ్యవహరించాడు. 1998లో వాజ్‌పాయ్ నాయకత్వంలో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడ్డాక బిజెపికి

ఏ వ్యక్తి అయినా కంపెనీ అయినా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి వచ్చిన బాండ్లు కొని, నచ్చిన రాజకీయ పార్టీకి అనామక పద్ధతులలో విరాళంగా ఇవ్వడానికి వెసులుబాటు కల్పించే పథకం ఇది. గేమింగ్ పరిశ్రమ నుండి మైనింగ్ పరిశ్రమల వరకు తమ వ్యాపార ప్రయోజనాల రీత్యా అత్యధిక మొత్తంలో ఈ బాండ్ల రూపంలో బిజెపికి విరాళాలు అందించాయి. అధికార పార్టీకి ఎంత పెచ్చు మొత్తంలో విరాళాలు అందిస్తే అందుకు ప్రతిగా అంతకు రెండింతలు, మూడింతలు, నాలుగింతలు లబ్ధి కలిగే కాంట్రాక్టులు ఆయా కంపెనీలకు దక్కాయి. ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో సాగిన ఈ లావాదేవీల మీద కూలంకషంగా విచారణ సాగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ పరిపాలనా శైలితో మన పారిశ్రామికాధిపతులు ఇంతలా ఎలా మమేకం కాగలిగారు?

ప్రభుత్వం ఎంత బలంగా (నాయకుడు ఎంత బలీయంగా) ఉంటే ఆర్థిక స్థిరత్వానికి అంత మంచిది అనేది ఒక వాదన. కానీ ఇది పేలవమైన తర్కం. ఈ లెక్కన నియంతలు పాలించిన అనేక దేశాలు ఈ పాటికి ఆర్థికాభివృద్ధి సాధించి ధగాధగా వెలిగిపోతా ఉండాలి. అలాంటి దేశం పేరు ఒక్కటైనా ఉదహరించగలరా ఈ వాదన చేసే వాళ్ళు. కానీ ఇందుకు భిన్నమైన వాస్తవాన్ని జర్నలిస్టు మార్టిన్ వోల్ఫ్ ఒక కీలకమైన విశ్లేషణ వెలువరించాడు. ప్రజాస్వామ్యం ఆర్థికాభివృద్ధికి ఎలా దోహదం చేసిందో సాధికారిక గణాంకాలతో వివరించాడు. 'తలసరి జాతీయోత్పత్తి పెరుగుదలకు ప్రజాస్వామ్యం ఎంతగానో దోహదం చేసిందని, ప్రజాస్వామ్యబద్ధ పాలన మొదలయిన 25 ఏళ్ళలో 20 నుండి 25 శాతం వరకు తలసరి జాతీయోత్పత్తి పెరిగిందని' సోదాహరణంగా స్పష్టం చేశాడు.

ప్రజాస్వామిక వ్యవస్థ మూలంగా విద్య, వైద్య సౌకర్యాలు మెరుగయ్యాయని, పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని, సామాజిక అశాంతి తగ్గుముఖం పట్టిందని, సంస్కరణల ద్వారా ఆర్థిక స్థిరత్వం ఏర్పడిందని మార్టిన్ వోల్ఫ్ తన అధ్యయనంలో వెల్లడించాడు. ప్రజాస్వామ్యం ఎవడికి కావాలి? నాలుక గీసుకోను పనికిరాదు. ఆర్థికాభివృద్ధి కావాలి అని వాదన చేసేవాళ్ళు గుర్తించాల్సిన విషయం ఏమిటంటే 2019లో మోడీ అధికారం చేపట్టాక దేశస్థుల జాతీయోత్పత్తి 3.9 శాతంగా నమోదయ్యింది. 1992 తరువాత అత్యల్పస్థాయి స్థూల జాతీయోత్పత్తి.

అయినా కానీ ప్రజాస్వామ్యాన్ని బలపరచడానికి, వికేంద్రీకృత నాయకత్వానికి భారత్ కార్పొరేట్ రంగం విముఖత ప్రదర్శిస్తుంది. అధికార పక్షంతో అంటకాగడం ద్వారా మతపరంగా, సామాజికపరంగా ఆయాచిత లబ్ధి పొందే అవకాశాలు ఉండడమే కార్పొరేట్ రంగ వైఖరికి మూలకారణం. 2014-15, 2022-23 మధ్యకాలంలో సంపద కేంద్రీకరణ విషయంలో అసమానతలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. సంపన్నులు మరింత సంపన్నులు కావడమే దీనికి కారణం. 2022-23 నాటికి దేశంలో అత్యంత సంపన్నులుగా ఉన్న ఒక్కశాతం మంది సంపద 22.6 శాతం నుండి 40 శాతానికి చేరుకున్నది. చారిత్రకంగా ఇది అత్యధిక పెరుగుదల. దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికా దేశాలలో సంపన్నుల సంపద వృద్ధికన్నా అధికశాతం వృద్ధి నమోదు అయ్యింది మనదేశంలోనే. బ్రిటీష్ వలస పాలన కాలం నాటికన్నా మోడీ పరిపాలనా కాలంలో ఆర్థిక అసమానతలు

కార్పొరేట్ సంస్థలనుండి చందాల రూపంలో నిధుల ప్రవాహం మొదలయ్యింది.

ఇక మోడీ హయాంలో బిజెపికి కార్పొరేట్ నిధుల ప్రవాహం వరదలా పారింది. దేశంలోనే అత్యంత ధనిక పార్టీగా బిజెపి అవతరించింది. ఎన్నికల కమీషన్‌కు, ఆదాయపన్ను శాఖలకు సమర్పించిన వివరాల ప్రకారం దేశంలో అన్ని రాజకీయ పార్టీల నిధులు కలిపినా బిజెపి దగ్గర ఉన్న నిధులకు సమీపంగా కూడాలేవు. అపారమైన నిధులు పోగేసుకున్న బిజెపి ఇతర రాజకీయ పార్టీల మీద ఇ.డి., ఇన్‌కంటాక్స్, సి.బి.ఐ లను ఉసిగొల్పి వాటికి నిధులు అందకుండా చేసి ఎండగట్టింది.

కార్పొరేట్ సంస్థల నుండి బిజెపికి అందుతున్న నిధులు ఏటికేడాదికి పైపైకి ఎగబాకుతుంటే కాంగ్రెస్ గ్రాఫ్ నేలచూపులు చూసిందని ఎడిఆర్ విశ్లేషించింది. అలాగే మోడీ శకంలో దేశంలో అపరకుబేరుల సంఖ్య ఏటికేడాదికి పెరుగుతూ వచ్చింది. ఆవిధంగా మనం సంపన్నులు అతిసంపన్నులుగా మారేశకంలోకి అడుగుపెట్టాం.

వ్యాపారవేత్తల, రాజకీయవేత్తల అపవిత్ర కూటమి పేదప్రజలకు ఏం ఒరగబెడుతుంది? మహారాష్ట్ర నుండి జార్ఖండ్ వరకు ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లిపో యాయి. వ్యవసాయం సంక్షోభంలో పడింది. ఆర్థికవ్యవ స్థకు నూతనంగా ఉపాధి అవకాశాలు కల్పించే శక్తిలేదు. అందుకే రాష్ట్రాలు పేదలకు డబ్బులు నజరానాగా చెల్లిస్తున్నాయి, ముఖ్యంగా మహిళలకు. మహారాష్ట్రలో లడ్కీ బహెన్ యోజనా పేరిట మహిళలకు నగదు బదిలీ పథకాలు ప్రవేశపెట్టారు. అధికారపార్టీలే కాదు, ప్రతిపక్ష పార్టీలు కూడా మేం అధికారంలోకి వస్తే ఉచిత నగదు బదిలీ పథకాలు అమలుచేస్తాం అనే ప్రకటించాయి తప్ప ధరలు తగ్గిస్తాం, ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తాం, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం అని మాత్రం హామీలు ఇవ్వలేదు. జ్యోతిబాఫులే, అంబేద్కర్ వంటి మహనీయులు నడయాడిన నేల అయిన మహారాష్ట్రలో కులం, జాతి, డబ్బు ఈ మూడే ఈ ఎన్నికలను ప్రభావితం చేసాయి.

> **“కార్పొరేట్ సంస్థల నుండి బిజెపికి అందుతున్న నిధులు ఏటికేడాదికి పైపైకి ఎగబాకుతుంటే కాంగ్రెస్ గ్రాఫ్ నేలచూపులు చూసిందని ఎడిఆర్ విశ్లేషించింది. అలాగే మోడీ శకంలో దేశంలో అపరకుబేరుల సంఖ్య ఏటికేడాదికి పెరుగుతూ వచ్చింది. ఆవిధంగా మనం సంపన్నులు అతిసంపన్నులుగా మారేశకంలోకి అడుగుపెట్టాం.”**

గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ రాజకీయ తత్వశాస్త్రంలో ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలో గుప్పెడు మంది అపర సంపన్నులు ఉండి, పేదజనం లక్షలాదిగా ఉంటే ఆ పేదలు సంపన్నుల ఆస్తులను లాక్కునే ప్రజాస్వామిక హక్కును కలిగి ఉంటారు అని వివరించాడు, కానీ ఈ దేశంలో పేదలు ఇంకా తమ ప్రజాస్వామిక హక్కును వాడుకోలేదు.

**(అనువాదం - కె. సత్యరంజన్)**

విపరీతంగా పెరిగిపోయాయని ఒక అధ్యయనం వివరించింది. నేల చూపులు చూస్తున్న వినిమయ వస్తు పరిశ్రమ, తలసరి రుణాల పెరుగుదల, పొదుపు రేటు తగ్గిపోవడం తదితర సూచికలు ఈ వాస్తవాన్ని బలపరుస్తున్నాయి.

బలమైన ప్రభుత్వం, బలీయమైన నాయకుడు ఉన్న వ్యవస్థతో ప్రమాదంపొంచి ఉన్నప్పటికీ ఈ వ్యవస్థ మూలంగా బనగూడే కళ్ళు చెదిరే లాభాలు కార్పొరేట్ రంగానికి సోయ లేకుండా చేస్తున్నాయి. రిజర్వ్‌బ్యాంక్ మాజీ డిప్యూటీ గవర్నర్ విరళ్‌ఆచార్య ఐదంటే ఐదు పరిశ్రమల గుత్తాధిపత్యానికి ద్రవ్యోల్బణం పెరుగుదలకి మధ్య ఉన్న అంతఃసంబంధం గురించి ఎత్తి చూపారు. రిలయన్స్ గ్రూప్, టాటాగ్రూప్, అదిత్యబిర్లా గ్రూప్, ఆదానీ గ్రూప్, భారతీ ఎయిర్‌టెల్ ఈ ఐదు కార్పొరేట్ సంస్థలు పోర్టులు, రక్షణ రంగం మొదలు చమురు, టెలికాం వరకూ అన్ని రంగాలపై గుత్తాధిపత్యం సాధించి మార్కెట్లో ఇతర పోటీదార్లకన్నా ఎక్కువ ధరలకు సరుకులు, సేవలు అమ్మడం మూలంగానే ద్రవ్యోల్బణం పెరిగిపోతా ఉందని, ఈ ఐదు పారిశ్రామిక గ్రూప్‌లకు ప్రభుత్వం దగ్గర ఉన్న పలుకుబడి కారణంగా అవి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తా ఉన్నాయని విరళ్ ఆచార్య వివరించారు.

2011 తరువాత ఈ ఐదు పారిశ్రామిక గ్రూపులు చేపట్టిన వ్యాపార విలీనాలు, టేకోవర్లు రెట్టింపు అయ్యాయి. దాంతో సమీప వ్యాపార ప్రత్యర్థుల మార్కెట్ వాటా కృశించి పోతున్నది. ఈ ఐదు పారిశ్రామిక గ్రూప్‌లు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని ఇంతలా విస్తరింప చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వ అండదండలు పుష్కలంగా వున్నాయి. 2018-2022 మధ్య కాలంలో ఈ కంపెనీలు తమ ప్రాజెక్టుల నిర్మాణం కోసం చేపట్టిన అడవుల నరికివేత తదితర పర్యావరణ విఘాత చర్యలు 20 రెట్లు పెరిగాయని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేసారు. 2018లో అటవీ, వన్యమృగ సంరక్షణ, కోస్తా తీర రక్షణ ప్రాంతాలలో ప్రాజెక్టుల నిర్మాణానికి 577 అనుమతులు ఇస్తే 2022 నాటికి ఈ అనుమతుల సంఖ్య అనూహ్యంగా 12,496 పెరిగాయి.

రాజకీయ నిర్ణయాధికారాలను తమకు అనుకూలంగా మలుచుకోవడంలోనే తమ వ్యాపార ప్రయోజనాలు ఇమిడి వున్నాయని ఈ ఐదు అతిపెద్ద కార్పొరేట్ సంస్థలూ ఒక నిర్ణయానికి వచ్చేసాయి. ఆ తర్వాతి వరుసలో ఉన్న కార్పొరేట్ సంస్థలు పోటీ నిచ్చెనలో క్రిందకి దిగజారకుండా ఉండడానికి, తమ కాళ్ళ క్రింద పునాదులు కదలబారి పోకుండా ఉండడానికి చూసుకోవడానికి తంటాలు పడుతూ ప్రభుత్వం ఎలా ఆడమంటే అలా ఆడడానికి సిద్ధపడిపోయాయి. ఇంక దారికి రాని వాళ్లు ఎవరైనా ఉంటే వాళ్ళని దారికి తెచ్చుకోవడానికి ప్రభుత్వం చేతిలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మెరుపు వేగంతో దేశంలో ఏమూల దాడి చెయ్యడానికయినా సదా సిద్ధంగా ఉండనే ఉన్నది.

ప్రస్తుతం మనదేశం అనుసరిస్తున్న జగడాలమారి విదేశాంగ విధానాన్ని ఎవరైనా విమర్శిస్తే ఇంతకు ముందు ఏం జేసారూ అంటూ దబాయింపులకు దిగుతున్నట్లే వ్యాపారాధీశులు కూడా అదే పల్లవిని అందుకున్నారు. ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థల బలహీనతలు, లోపభూయిష్టమైన సెంట్రల్ బ్యాంక్ విధానాలు, పెరిగిపోతున్న అప్పులు, దిగజారిపోతున్న దేశ ప్రతిష్టల గురించి వేలెత్తి చూపవచ్చు గానీ అవే ప్రశ్నలు ఇక్కడ వెయ్యడం నిషిద్ధం. క్రీడాకారులు, పతకాలు గెలిచిన వాళ్ళ ప్రతిభా సామర్థ్యాలను అభినం దించడానికి బదులు ప్రధాని నాయకత్వంపై సామాజిక

(మిగతా 12వ పేజీలో)

# అమ్మకపు వస్తువుగా మారిపోయిన ఆధ్యాత్మికత



రచయిత ప్రముఖ నాటక రచయిత, హిందీ సినిమాలకు వేల పాటలను, మాటలను అందించాడు. బహు భాషా నటి షబానా ఆజ్మీ భర్త, షబానా ఆజ్మీ ప్రముఖ ఉర్దూ కవి కైఫీ ఆజ్మీ కూతురు.

**జావెద్ అఖ్తర్**

(ఇండియా టుడే పత్రిక ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సులో "ఆధ్యాత్మికత " అనే అంశంపై ప్రఖ్యాత హిందీ, ఉర్దూ కవి జావెద్ అఖ్తర్ చేసిన ప్రసంగాన్ని మార్పిస్తు పాఠకులకు అందిస్తున్నాం...సంపాదకుడు)

మహానుభావులు ఎందరో ఉన్న ఈ సభలో నేను ఉన్న స్థానంలోకి రావాలని ఎవరూ కోరుకోరనుకుంటాను. ఎందుకంటే శ్రీశ్రీ రవిశంకర్ లాంటి జనాకర్షణగల శక్తిమంతులైన ఆధ్యాత్మిక గురువు మాట్లాడిన తర్వాత మాట్లాడబోవడం, సచిన్ టెండూల్కర్ అద్భుతంగా సెంచరీ చేసిన తర్వాత ఆడడానికి నాలాంటి వాడు రావడం లాంటిది. కానీ, ఏదో ఒక బలహీన క్షణంలో నేనేనిక్కడ మాట్లాడడానికి ఒప్పుకున్నాను.

మొట్టమొదట నేను స్పష్టం చేయవలసిన కొన్ని విషయాలు ఉన్నాయి. జావెద్ అఖ్తర్ అనే నా పేరుతో మైమరచిపోకండి. నేనిక్కడ ఏ రహస్యం విప్పబోవడం లేదు. రచనలోనో, టెలివిజన్ మీదనో బహిరంగంగా నేను అనేకసార్లు చెప్పిన విషయమే మళ్ళీ చెపుతున్నాను. నేను నాస్తికుడిని. నాకు ఏ మతంలోనూ విశ్వాసం లేదు. అందువల్ల ఎటువంటి రకం ఆధ్యాత్మికతలోనూ నమ్మకం లేదు. ఎటువంటిదైనా సరే.

ఇంకో విషయం కూడా చెప్పాలి. నేనిక్కడ కూచున్న పెద్ద మనిషిని విమర్శించడానికో, విశ్లేషించడానికో, విరుచుకుపడడానికో కూడా నిలబడలేదు. ఆయనకు, నాకూ మధ్య ఆహ్లాదకరమైన, మర్యాదపూర్వకమైన సంబంధం ఉంది. ఆయన ఇతరులతో ఎంత సాదరంగా ఉంటారో చాలా సార్లు గమనించాను. కానీ, నేను మాట్లాడదల్చుకున్నది ఒక భావం గురించి. ఒక వైఖరి గురించి. ఒక మానసిక స్థితి గురించి మాత్రమే. ఒక మనిషి గురించి కాదు.

ఈ సమావేశం ప్రారంభమైనప్పుడు నేనేమన్న పొరపాటు స్థలానికి వచ్చానా అని నాకు ఒక క్షణం అనుమానం వచ్చింది. ఎందుకంటే మనం కృష్ణుడో, గౌతముడో, కబీరో, వివేకనందుడో చెప్పిన తత్వ శాస్త్రం గురించి చర్చించడానికి ఇక్కడకి వచ్చినట్టయితే, నాకు మాట్లాడవలసింది ఏమీలేదు. నేనిప్పటికిప్పుడు కూచోవచ్చు. భారతీయులలో ప్రతి ఒక్కరూ గర్వంగా భావించే ఉజ్వల గతం గురించి చర్చించడానికి నేనిక్కడికి రాలేదు. నేనిక్కడికి మన విషపూరితమైన వర్తమానం గురించి మాట్లాడడానికి వచ్చాను.

నన్నిక్కడ ఆధ్యాత్మికత గురించి మాట్లాడడానికి ఆహ్వానించారు. అయితే ఈ ఆధ్యాత్మికత అనే మాటతో మనం గందరగోళానికి గురికావద్దు. ఎందుకంటే, ఒకే పేరు గల ఇద్దరు మనుషులూ ఉండవచ్చు. ఆ ఇద్దరూ పూర్తిగా భిన్నమైన మనుషులూ కావచ్చు. రామచరిత మానస్ అనే గ్రంథాన్ని తులసిదాస్ రాశాడు. రామాయణం ఆధారంగా రామానందసాగర్ ఒక టెలివిజన్ చిత్రం తయారు చేశాడు. రెండిటికీ రామాయణమే మూలం. కానీ, తులసిదాస్‌నూ, రామానంద సాగర్‌నూ సమానంగా చూడడం అంత ఉచితమని నేను అనుకోను. రామచరిత మానస్ రాసినప్పుడు తులసిదాస్ పై సాంఘిక బహిష్కరణ విధించారు. అంత పవిత్రమైన గ్రంథాన్ని అవధీ లాంటి మామూలు ప్రజల భాషలో రాసి అవమానిస్తాడా అని ఆయన మీద విరుచుకుపడ్డారు. మతఛాందస వాదులు ఏ మాటలు మాట్లాడినా, ఏ రంగులో ఉన్నా, ఏ మతానికి చెందినా, ఏ సమూహానికి చెందినా అంతా ఒక్కలాగే ఉండడం చూసి నాకు ఆశ్చర్యం కలుగుతుంది.

1789లో షా అబ్దుల్ ఖాదర్ అనే ఒక పెద్ద మనిషి ఈ నగరం (ఢిల్లీ) లోనే మొట్టమొదటి సారి ఖురాన్‌ను ఉర్దూలోకి అనువాదం చేశాడు.

ఆ కాలంలో అధికారం చెలాయిస్తున్న ఉలేమాలందరూ ఆయన మీద ఫత్వా విడుదల చేశారు. పవిత్ర గ్రంథాన్ని అలగా జనం భాషలోకి అనువాదం చేయడం దైవ ద్రోహం అన్నారు. రామచరిత మానస్ రాసి బహిష్కరణకు గురైన తర్వాత తులసీదాస్ నాలుగు పాదాల పద్యం ఒకటి రాశాడు.

"ధుత్ కహెూ అవధుత్ కహెూ రాజ్ పుత్ కహెూ కి జులావా కహు కోహూకి బేటీ సే బేటా నా బియాహబ్ కోహూకి జాత్ బిగాడ్ నా చాహు మాంగ్ కే ఖైబో మహజిద్ మే రైబో లేబేకో ఏక్ నా దేబే కా దోహు"

మరొక వైపు రామాయణ టెలివిజన్ సీరియల్ తయారు చేసి రామానంద్ సాగర్ కోట్ల రూపాయలు ఆర్జించాడు. నేనేమీ ఆయనను చిన్నబుచ్చడం లేదు. కానీ, ఈ మొత్తంలో ఆయన అట్టడుగు స్థాయిలో ఉన్నాడని మాత్రం చెప్పక తప్పదు.

మరొక ఉదాహరణ చెప్తాను. బహుశా అది మరింత ప్రత్యక్షమైనదీ, మరింత ఉచితమైనదీ కావచ్చు. గౌతముడు రాజాంతపురాన్ని వదిలి అడవిలోకి వెళ్ళింది సత్యాన్ని అన్వేషించడానికి. కానీ ఇవాల్టి రోజుల్లో మీరు చూస్తే ఈ ఆధునిక కాలపు గురువులు అడవుల్లో నుంచి బయటకు వచ్చి రాజప్రాసాదలలో చేరిపోతున్నారు. వీళ్ళు పూర్తిగా ప్రతికూల దిశలో నడుస్తున్నారు. కనుక గౌతముడు గురించీ, వీళ్ళ గురించీ ఒకేలాగా మాట్లాడలేం. అందువల్ల భారతీయులందరికీ

ప్రియమైన, గౌరవనీయమైన పేర్ల వెనుక దాక్కొన విషయాలు మాట్లాడాలి.

నన్నిక్కడ మాట్లాడమని ఆహ్వానించినపుడు నేను నాస్తికుణ్ని కదా, ఎటువంటి పరిస్థితుల్లోనైనా హేతుబద్ధంగా ఉండడానికి ప్రయత్నిస్తాను కదా, అందుకే నన్నిక్కడకు పిలిచారా అనుకున్నాను. కానీ హఠాత్తుగా నాకు ఇంకో విషయం తట్టింది. ఆధునిక కాలపు గురువులకూ, నాకూ ఒక సమాన గుణం ఉంది. నేను సినిమాల్లో పనిచేస్తాను. వాళ్ళకూ నాకూ ఉమ్మడి అంశం ఏమిటంటే మేమిద్దరమూ కూడా కలలు అమ్ముతాం. ఇద్దరమూ కూడా భ్రమలను సృష్టిస్తాం. ఇద్దరమూ విగ్రహాలను తయారు చేస్తాం. ఒక చిన్న తేడా మాత్రం ఉంది. మూడు గంటలు గడవగానే మా కలలు అమ్మకం ఆపేసి శుభం అని కార్డు వేసి వాస్తవికతలోకి వెళ్ళిపోండి అని జనాన్ని పంపించేస్తాం. ఈ గురువులు మాత్రం అలా ఎప్పటికీ పంపరు.

కనుక ఇక్కడ ఇవాళ ప్రపంచపు సూపర్ మార్కెట్లో ఒక అమ్మకపు వస్తువుగా మారి పోయిన ఆధ్యాత్మికత గురించి మాట్లాడడానికే నేనిక్కడ నిలబడ్డానని స్పష్టం చేయదలిచాను. ఇవాళ ప్రపంచంలో మూడు పెద్ద భారీ వ్యాపార వస్తువులు ఉన్నాయి. యుద్ధ ఆయుధాలు, మాదక ద్రవ్యాలు, ఆధ్యాత్మికత. అయితే ఆయుధాలలోనూ, మాదకద్రవ్యాల లోనూ మీరు ఎంతో కొంత చేయాలి. ఏదో ఒకటి ఇవ్వాలి. తేడా ఏమంటే ఆధ్యాత్మికతలో మాత్రం మీరేమీ ఇవ్వనక్కరలేదు.

> **“ ఇవాళ ప్రపంచపు సూపర్ మార్కెట్లో ఒక అమ్మకపు వస్తువుగా మారి పోయిన ఆధ్యాత్మికత గురించి మాట్లాడడానికే నేనిక్కడ నిలబడ్డానని స్పష్టం చేయదలిచాను. ఇవాళ ప్రపంచంలో మూడు పెద్ద భారీ వ్యాపార వస్తువులు ఉన్నాయి. యుద్ధ ఆయుధాలు, మాదక ద్రవ్యాలు, ఆధ్యాత్మికత. అయితే ఆయుధాలలోనూ, మాదకద్రవ్యాల లోనూ మీరు ఎంతో కొంత చేయాలి. ఏదో ఒకటి ఇవ్వాలి. తేడా ఏమంటే ఆధ్యాత్మికతలో మాత్రం మీరేమీ ఇవ్వనక్కరలేదు. ”**

ఈ సూపర్ మార్కెట్‌లో మీకు అడిగిన వెంటనే నిర్వాణం దొరుకుతుంది. మెయిల్‌లో మీకు మోక్షం చేరుతుంది. ఆత్మ సాక్షాత్కారంలో క్రాష్ కోర్సు ఉంటుంది. నాలుగు సులభ పాఠాలలో విశ్వచైతన్యం అందుతుంది. ఈ సూపర్ మార్కెట్‌కు ప్రపంచ వ్యాప్తంగా గొలుసు దుకాణాలు ఉన్నాయి. ఆ దుకాణాలలో అశాంతి నిండిన ఉన్నత వర్గాలూ, సంపన్న వర్గాలూ ఆధ్యాత్మికత ఫాస్ట్ ఫుడ్ కొనుక్కుని తింటూనే ఉంటాయి. నేనిప్పుడు ఈ ఆధ్యాత్మికత గురించి మాట్లాడదలిచాను.

ప్లేటో సంభాషణల్లో ఆయన చాలా విలువైన విషయాలు ఎన్నో చెప్పాడు. వాటిలో ఒకటి ఏమంటే, 'మీరు ఏదైనా చర్చ ప్రారంభించే ముందు మీరు వాడుతున్న పదాలు అర్థం ఏమిటో నిర్ణయించుకోండి' అని. మరి మనం కూడా ఇప్పుడు ఈ ఆధ్యాత్మికత అనే పదం అర్థం ఏమిటో నిర్ణయించుకుందాం. ఆ పదానికి అన్ని మతాలనూ, కులాలనూ, మతాలనూ, జాతులనూ అధిగమించి సంపూర్ణంగా మానవజాతి పట్ల ప్రేమ అనే అర్థం ఉంటుందా? అలా ఉంటే నాకేమీ సమస్య లేదు. కాకపోతే, దాన్ని నేను ఆధ్యాత్మికతా అనే బదులు మానవత అంటాను.

లేదా, దానికి అర్థం మొక్కలనూ, చెట్లనూ, కొండలనూ, సముద్రాలనూ, నదులనూ, జంతువులనూ ప్రేమగా చూడడం అనా? అంటే, మానవేతర ప్రపంచం పట్ల దయ కలిగి ఉండడమనా? ఒకవేళ అదయినా నాకేమీ అభ్యంతరం లేదు. కాకపోతే దాన్ని నేను ఆధ్యాత్మికత అనను. పర్యావరణ స్పృహ అంటాను. లేదా, వివాహం, మాతృత్వం, పితృత్వం, లలిత కళలు, న్యాయవ్యవస్థ, భావప్రకటనా స్వేచ్ఛ వంటి సామాజిక సంస్థలను హృదయపూర్వకంగా గౌరవించడమే ఆధ్యాత్మికత అనే మాటకు అర్థమా? అయ్యా, అప్పుడు కూడా నాకేమీ సమస్య లేదు. అసలు నాకు అనంగీకారం తెలిపే అవకాశమే లేదు. కానీ, నేను దాన్ని పౌర బాధ్యత అంటాను. లేదూ ఆధ్యాత్మికత అంటే మీ లోకంలోకి మీరు వెళ్ళిపోయి, మీ సొంత జీవితపు అర్థం ఏమిటో అన్వేషించే ప్రయత్నం చేయడమా? దానికి ఎవరు అడ్డు చెపుతారు? కానీ దాన్ని నేను ఆత్మపరిశీలన, ఆత్మ పరీక్ష అనుకుంటాను, లేదూ ఆధ్యాత్మికత అంటే యోగం అని అర్థం చెపుతున్నారా? గౌరవనీయుడైన పతంజలి యోగ శాస్త్రానికి మనం కృతజ్ఞతలు చెప్పాలి. ఆయన యోగం, యమ, యతమ, ఆసన, ప్రాణాయామ వంటి వివరాలు ఎన్నో మనకందించాడు. వాటికి మనం ఇవ్వాళ ఏ పేరైన పెట్టుకోవచ్చు. కానీ ప్రాణాయామం చేస్తే చాలా బాగుంటుంది. దాన్ని నేను ఆరోగ్య పరిరక్షణ, శారీరక దృఢత్వం అంటాను.

ఇదంతా పదాల గారడీగా కనిపిస్తుందా? ఒకవేళ ఇదే ఆధ్యాత్మికత అయితే ఇక చర్చకు అవకాశమేముంది? నేను వాడిన పదలూ, అర్థాలూ అన్నీ కూడా సంపూర్ణంగా గౌరవించదగినవి. ఆమోదించదగినవి. వాటిలో అమూర్తమైనదేదీ లేదు. మన చూపులకు అందనిదేదీ లేదు. మరి ఆధ్యాత్మికత అనే మాట పట్టుకుని ఎందుకంతగా వేళ్ళాడుతున్నారు? నేను చెప్పిన మాటలలో వ్యక్తం కాని ఏ భావాన్ని ఈ ఆధ్యాత్మికత అనే మాట సూచిస్తోంది? నేను చెప్పినవి కాకుండా ఇంకా ఏమైనా ఉందా? ఉన్నట్టయితే అది ఏమిటి?

ఆ మాట వాడినంత మాత్రాన నీకు వచ్చిన సమస్య ఏమిటి అని ఎవరైనా నన్ను ఎదురు ప్రశ్నించవచ్చు. ఆ మాటను మార్చమనీ, ఒదిలేయమనీ, పారెయ్యమనీ, దానికి కాలం చెల్లిందనీ అంటున్నాను. ఎందుకు? నా అభ్యంతరం ఏమిటో చెపుతాను. ఆధ్యాత్మికత అంటే అర్థాలు నేను చెప్పినవే అయితే చర్చకు అవకాశమే లేదు. కానీ నన్ను ఇబ్బంది పెట్టే అంశం మరొకటి ఉంది. ఏ నిఘంటువు అయినా తెరిచి చూడండి. ఆధ్యాత్మికత అనే మాట ఆత్మ అనే మాట నుంచి పుట్టింది. మానవజాతికి ఈ భూగోళం గుండ్రంగా ఉందా, బల్లపరుపుగా ఉందా తెలియనప్పుడు మనుషులు తమను తాము రెండు అంశాల సమ్మేళనంగా ఊహించుకున్నారు. ఒకటి శరీరం మరొకటి ఆత్మ. శరీరం అనేది తాత్కాలికమనీ, అది మరణిస్తుందనీ, కానీ ఆత్మ అనేది ఎన్నటికీ నాశనం లేనిదని ఊహించుకున్నారు. మీ శరీరం లోపల మీకొక కాలేయం ఉంది. ఒక గుండె ఉంది. పేగుల చుట్ట ఉంది. ఒక మెదడు ఉంది. ఈ మెదడు అనేది శరీరంలో భాగం కనుక, మనస్సు అనేది మెదడు వల్ల తయారవుతున్నది కనుక, ఇవన్నీ తక్కువ జాతివే అని వాళ్ళనుకున్నారు. శరీరంతో పాటు చివరికి మెదడు కూడా చచ్చిపోతుందని వాళ్ళు తెలుసుకున్నారు. కానీ, భయం లేదు. మీరు ఎప్పటికీ చచ్చిపోరు. ఎందుకంటే, మీరంటే మీ ఆత్మ. ఆ ఆత్మ ఒక అత్యున్నత చైతన్యంతో ఎల్లకాలానికి నిలిచి ఉంటుంది. మీకు వచ్చే సమస్యలన్నీ మీ మనస్సు చెప్పే మాటలు వినడం

“ సాంప్రదాయక మతాన్ని నమ్మేవారు, ఆధ్యాత్మికతను నమ్మేవారు పూర్తిగా వేరు వేరు. ఒకసారి ప్రపంచ పటాన్ని తీసుకోండి. అతి ఎక్కువగా మతం ప్రభావం ఉన్న ప్రాంతాలు గుర్తిస్తూ పోండి. భారతదేశంలో గానీ, భారతదేశానికి బయట గానీ ఆసియాలో, లాటిన్ అమెరికాలో, యూరప్‌లో ఎక్కడైనా...ఎక్కడెక్కడ అయితే మత ప్రభావం ఎక్కువ ఉందో, అక్కడల్లా మానవ హక్కులు కొరవడుతున్నాయని మీరు గుర్తించగలరు. అక్కడంతా అణచివేత ఉంది. ”

వల్ల వస్తున్నాయి. మనస్సు చెప్పే మాటలను వినడం మానెయ్యండి. ఆత్మ చెప్పే మాటలు వినండి. ఆ అత్యున్నత చైతన్యానికి విశ్వ సత్యం అవగాహనలో ఉంటుంది. ఇదీ కథ.

సరే, పూనాలో ఒక ఆశ్రమం ఉంది. నేను అక్కడికి వెళుతూ ఉండేవాణ్ణి. ఎందుకంటే, అక్కడ మాట్లాడేవాళ్ళు మంచి వక్తలు. ఆ సమావేశ మందిరం ద్వారం దగ్గర ఒక హెచ్చరిక రాసి ఉండేది. “మీ చెప్పులూ, మనస్సూ ఇక్కడ వదిలేసి వెళ్లండి”. అయితే ఇటీవల కొందరు గురువులు మీరు చెప్పులతో వచ్చినా అంగీకరిస్తున్నారు. కానీ, మనస్సులతో రావడానికి మాత్రం ఎంతమాత్రం వీల్లేదు!

మరి, మీరు మనస్సును వదిలేస్తే ఏం చేస్తారన్నమాట? అప్పుడిక చైతన్యంలో మరొక అడుగు ముందుకు వేయడానికి మీకొక గురువు అవసరం అవుతాడు. ఆ చైతన్యపు మరొక మెట్టు ఆత్మలో దాగి ఉంటుంది. ఈ గురువుగారు ఉన్నత చైతన్యం సాధించారు. ఆయనకు అత్యున్నత సత్యం తెలుసును. కానీ, మీకాయన ఊరికే ఇచ్చేస్తారా? లేదండి. ఆయన అది మీకు వెంటనే చెప్పలేరు. పోనీ మీ అంతట మీరు ఆ మెట్టు ఎక్కి అది అందుకోగలరా? లేదండి. ఆ పని చేయడానికి మీకు గురువు సహాయం అవసరం అవుతుంది. మీకు ఆయన కావలసిందే. అయినా మీరు అంతిమ సత్యాన్ని అందుకోగలరని ఆయన హామీ ఇవ్వలేడు....సరే, ఇంతకీ ఆ అంతిమ సత్యం అనేది ఏమిటి? విశ్వ సత్యం అనేది ఏమిటి? అది విశ్వం గురించిన సత్యమా? నాకు అదేమీ అంతుపట్టదు. సౌర మండలం నుంచి ఒక అడుగు బయట పెడితే మొట్టమొదట మనకు కనబడే నక్షత్రం పేరు ఆల్ఫా సెంటారై. అది మనకు నాలుగు కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దానికీ నాకూ సంబంధం ఎలా ఏర్పడుతుంది? ఏర్పడకపోతే నేను ఏం చేయను?

అసలు విషయం ఏమంటే, ఈ గురువు గారు పెద్ద మనుషులకు మాత్రమే కనబడే దుస్తులు ధరించారు. అంతేకాదు గురువుగారు రోజురోజుకు బలిసిపోతున్నారు. ఆయన వంటిమీద లేని దుస్తులను ఉన్నట్టుగా పొగిడే పెద్ద మనుషుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది.

మతాధిపతులకు రెండో రక్షణ కవచంగానే ఈ ఆధ్యాత్మికత అనేది పనికొస్తుం దని నేను అనుకుంటూ ఉండేవాణ్ణి. సాంప్రదాయక మతంలో విషయాలను వివరించలేక వాళ్ళు నిరాశపడుతున్నప్పుడు, ఆ మతానికి సమర్థ ఆకర్షణ లేనప్పుడు వాళ్ళకు ఈ విశ్వం, అధిచైతన్యం లాంటి పొగల గాలుల వెనుక దాగవలసిన అవసరం వస్తుందని అనుకునేవాణ్ని. కానీ అది పూర్తిగా సత్యం కాదు. ఎందుకంటే, సాంప్రదాయక మతాన్ని నమ్మేవారు, ఆధ్యాత్మికతను నమ్మేవారు పూర్తిగా వేరు వేరు. ఒకసారి ప్రపంచ పటాన్ని తీసుకోండి. అతి ఎక్కువగా మతం ప్రభావం ఉన్న ప్రాంతాలు గుర్తిస్తూ పోండి. భారతదేశంలో గానీ, భారతదేశానికి బయట గానీ ఆసియాలో, లాటిన్ అమెరికాలో, యూరప్‌లో ఎక్కడైనా...ఎక్కడెక్కడ అయితే మత ప్రభావం ఎక్కువ ఉందో, అక్కడల్లా మానవ హక్కులు కొరవడుతున్నాయని మీరు గుర్తించగలరు. అక్కడంతా అణచివేత ఉంది. ఎక్కడైనా సరే. మతం అంటే పేద ప్రజల పాలిట మత్తు మందూ అనీ, అణగారిన ప్రజల నిట్టూర్పు అనీ మన మార్క్సిస్టు సన్నిహితులు అంటూ ఉండేవాళ్ళు. నేనిప్పుడు ఆ చర్చలోకి వెళ్లను గానీ, ఇవాళ మాత్రం ఆధ్యాత్మికత అనేది తప్పనిసరిగా ధనికులు వినియోగిస్తున్న ఒక మాదక పదార్థం.

ఎక్కడ చూసినా ఆధ్యాత్మికతను నమ్మే సమూహం అంతా ఒక సంపన్నవర్గం మాత్రమే. అంటే, గురువుగారికి అధికారం వస్తుంది, చాలా గౌరవం దక్కుతుంది, హోదా పెరుగుతుంది, సంపద పెరుగుతుంది (అది ముఖ్యం కాదని వాళ్ళంటారనుకోండి) మొత్తం మీద అధికారమూ, సంపద దక్కుతాయి. మరి శిష్యుడికి ఏం దొరుకుతుంది? చాలా మంది శిష్యులను నేను జాగ్రత్తగా గమనించాను. ఈ శిష్యులలో వేరు వేరు రకాల వారున్నారు. అందరూ ఒక్కలాంటి వాళ్ళు కారు. విభిన్న మైన సమూహాల అనుయాయులు ఉన్నారు. విభిన్న తరహాల శిష్యులు ఉన్నారు. ఒక శిష్యుడు ధనవంతుడు. ఎన్నో విజయాలు సాధించినవాడు. జీవితంలో చాలా పైకి వచ్చినవాడు. విపరీతంగా ధనం సంపాది స్తున్నవాడు. ఆస్తి పోగేస్తున్నవాడు. ఆయనకు అన్నీ ఉన్నాయి కనుక ఇక ముక్తి కావాలి. అందువల్ల గురువుగారు ఏం చెపుతారంటే, నువ్వు ఏం చేస్తున్నా నరే అదంతా నిష్కామకర్మ. నువ్వు కేవలం నీ పాత్ర పోషిస్తున్నావు. ఇదంతా మాయ. నువ్వు రోజు రోజూ పోగుచేసుకుంటున్న డబ్బు, నువ్వు కూడబెడుతున్న ఆస్తి ఇదంతా మాయ. దీనంతటితోనూ నీకు ఉద్వేగపూరితమైన సంబంధమేమి లేదు. నువ్వు కేవలం నిమిత్తమాత్రుడివి. నువ్వు నా దగ్గరికి ఎందుకొచ్చావో తెలుసునా? నువ్వు ఇక శాశ్వత సత్యపు అన్వేషణలో ఉన్నావు. నీ చేతి నిండా మురికి ఉంటే ఉండవచ్చు. కానీ, నీ ఆత్మ, అంతరాత్మ పరిశుద్ధమైనది... ఈ మాటలతో ఈ శిష్యుడు తన గురించి తాను పొంగిపోతూ ఉంటాడు. అద్భుతమైన మనిషిని అనుకుం టాడు. వరుసగా ఏడు రోజుల పాటు ప్రపంచాన్ని దోపిడీ చేసి, ఏడో రోజు చివరన వెళ్లి గురువు పాదాల దగ్గర కూచుని ‘అబ్బా, నేనెంత సున్నితమైన వ్యక్తిని’ అని అనుభూతి పొందుతాడు.

ఇంకొక రకం ఉన్నారు. వీళ్ళు కూడా సంపన్నవర్గం నుంచే వస్తారు. కానీ, వీళ్ళు మొదటిరకం లాగా విజయసాధకులు కారు. విజయం సాధించడమైనా, వైఫల్యం చెందడమైనా సాపేక్షికమని మీకు తెలుసు. రోడ్డు పక్క పేవ్ మెంట్ జూదం ఆడే రిక్షావాలా వంద రూపాయలు సంపాదిస్తే మహా విజయం సాధించానని అనుకుంటాడు. ఒక కార్పొరేట్ సంపన్నుడు ముప్పై కోట్ల డాలర్లు సంపాదిం చాక, అతని సోదరుడు వంద కోట్లు సంపాదించాడని, అందువల్ల తాను పనికి మాలిన వాడినవి అనుకుంటాడు. ఇలా తనకు తాను పనికిమాలిన వాడినవి అనుకున్న ధనికుడు ఏం చేస్తాడు? అతనికి తక్షణమే ఒక గురువు కావాలి. ఆ గురువు హితబోధ చేస్తాడు. నువ్వు విఫలం అయ్యావని

ఎవరన్నారు? నీకు వేరే లోకాలు ఉన్నాయి. నీకు వేరే దృష్టి ఉంది. నీ సోదరుడికి లేని ఊహలు నీకు ఉన్నాయి. నీ సోదరుడు విజయం సాధించాడని అనుకుంటున్నావేమో. తప్పు. ఈ ప్రపంచం క్రూరమైనది. నీకు తెలుసు. ఈ ప్రపంచం నిజాయితీగా నీకు చెపుతుంది. అయ్యా, పది సంపాదించవలసి ఉండగా మీరు మూడే సంపాదించారు. మరొక వ్యక్తి పదింట ఏడు సంపాదించాడు. లోకం నిన్ను అలా చూస్తుంది. నీకు తెలిసిన వాళ్ళందరూ నిన్ను అట్లాగే చూస్తారు... ఇటువంటి హితబోధలతో ఈ శిష్యుడు సానుభూతి పొందుతాడు. తాను ఆడేది వేరే ఆట, అందరూ ఆడే ఆట లాంటిది కాదు అని అనుకుంటాడు.

ఇంకొక రకం ఉన్నారు. నేను వీళ్ళ గురించి వ్యతిరేకతతో, లేదా చిన్నచూపుతో, లేదా కరకుగా మాట్లాడడం లేదు. వాళ్ళ పట్ల పూర్తి సానుభూతితోనే మాట్లాడుతున్నాను. ఈ ఆధునిక కాలపు ఆధ్యాత్మిక గురువులకు వీరు అతిపెద్ద విశ్వాసనీయమైన సమూహం. వాళ్ళే అసంతృప్త జీవులైన సంపన్నుల భార్యలు.

ఆమె ఒక సంపూర్ణ వ్యక్తి. ఆమె తన వ్యక్తిత్వాన్నీ, కలలనూ, కోరికలనూ, తన సమస్త జీవితాన్నీ వివాహం అనే వేదిక మీద బలిపెట్టింది. అందుకు ప్రతిఫలంగా ఆమెకు దక్కినది ఆమెను ఎంత మాత్రం పట్టించుకోని భర్త. ఆ భర్త ఆమెకు ఎక్కువలో ఎక్కువ ఇద్దరు ముగ్గురు పిల్లలను ఇస్తాడు. అంతే. ఆయనకు ఆయన వ్యాపారాలలో, లేదా ఇతర స్త్రీలతో గడపడంలో క్షణం తీరిక ఉండదు. ఈ స్త్రీకి తలవాల్చి ఏడవడానికి ఒక భుజం కావాలి. తన మనుగడ అంతా ఒక నిష్ప్రయోజక అస్తిత్వమని భావిస్తూ ఉంటుంది. ఆమెకు ఎటు చూసినా వెలుగు లేదు. ఆమె జీవితం ఒక శూన్యం నిండిన ఖాళీ. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ఆ జీవితానికి అర్థం లేదు. ఇదంతా విషాదకరం. కానీ, అక్షరాలా వాస్తవం.

మరొక రకం శిష్యులు ఉన్నారు. వాళ్ళకు హఠాత్తుగా ఏదో విపత్తు వస్తుంది. అనూహ్యంగా కన్న బిడ్డ చనిపోతాడు. భార్య మరణిస్తుంది. భర్త మరణిస్తాడు. లేదా వాళ్ళు ఆస్తి కోల్పోతారు. వ్యాపారంలో విపరీతంగా నష్టం వస్తుంది. ఏదో ఒకటి జరిగి వాళ్ళ జీవితాలు కుదుపుకు గురవుతాయి. వాళ్ళ ముందర ఒకే ఒక ప్రశ్న లేచి నిలబడుతుంది. ఇది మాకే ఎందుకు జరగాలి? ఈ ప్రశ్నను వారు ఎవరికి వేయాలి? వారు వెంటనే గురువు దగ్గరకు వెళతారు. ఇదంతా కర్మ ఫలితం నాయనా అని చెపుతారు గురువుగారు. కానీ

> “ మాదకద్రవ్యాలు, మద్యం కూడా మానసిక శాంతినీ, ఉపశమనాన్ని ఇస్తాయని చెపుతారు. కానీ అటువంటి శాంతిని, అటువంటి ఉపశమనాన్ని కోరడం మంచిదేనా? ఎవరికైనా అది మనం సిఫారసు చేస్తామా? కచ్చితంగా చేయం. హేతుబద్ధమైన ఆలోచనలలో నుంచి పుట్టి పెరగని మానసిక శాంతి ఏదైనా ఆత్మవంచన తప్ప మరోటి కాదు. ”



దేశంలో అతి ఖరీదైన ఆద్యాత్మక గురువు, పండిట్ రవిశంకర్

నా వెంట నడువు. నీకు మరో లోకం ఉంది అని విశ్వాసం ఇస్తారు. ఆ లోకంలో బాధ లేదు, వేదన లేదు, మరణం లేదు. అక్కడకు చేరావంటే అది అమరలోకం. అక్కడ ఆనందం మాత్రమే ఉంది... దుఃఖం నిండిన ఈ మనుషులకు గురువు గారు ఈ మాటలు చెప్పి ఓదారుస్తారు. నన్ను అనుసరించండి. నేను మిమ్మల్ని స్వర్గానికి, కైవల్యానికి, బాధ లేని చోటికి తీసుకుపోతాను అని చెపుతారు. అయ్యా, నన్ను క్షమించండి. ఇది విచారకరమే. కానీ వాస్తవం ఏమంటే అటువంటి స్వర్గం ఎక్కడా లేదు. జీవితంలో తప్పనిసరిగా, ఎంతో కొంత నిష్పత్తిలో దుఃఖం ఉంది. వేదన ఉంది. అపజయాల అవకాశం ఉంది. కానీ గురువు గారి మాటలతో వాళ్ళకు ఎంతో కొంత సంతృప్తి దొరుకుతుంది.

మరి, వాళ్ళకు అలా మెరుగైన మనస్థితి కలిగినప్పుడు, శాంతి దొరుకుతున్నప్పుడు నీ అభ్యంతరం ఏమిటి అని ఎవరైనా నన్ను అడగొచ్చు. నేనెప్పుడో చదివిన ఒక కథ నాకిక్కడ గుర్తొస్తుంది. అది చాలా పాత భారత కథ. ఒక ముని ఆ కథ చెప్పాడు. ఆకలిగొన్న ఒక కుక్కకు ఒక ఎండిపోయిన ఎముక దొరికిందట. అది దాన్ని కొరకడానికి ప్రయత్నిస్తే, ఆ ఎముక నుంచి ఏమీ రాలేదు. కానీ దాని నాలుకనే అది కొరుక్కుందట. ఆ నాలిక నుంచి నెత్తురు బయటికి ప్రవహిస్తుంటే ఆ కుక్క మాత్రం అబ్బా, ఎముకలో సరిపోయే తిండి దొరికింది కదా అనుకుందట.

నాకు విచారం కలుగుతుంది. వేదనలో ఉన్న ఈ పెద్దలు ఇలా ప్రవర్తించకపోతే బాగుండునని అనిపిస్తుంది. వారి పట్ల గౌరవం ఉంది. మాదకద్రవ్యాలు, మద్యం కూడా మానసిక శాంతినీ, ఉపశమనాన్ని ఇస్తాయని చెపుతారు. కానీ అటువంటి శాంతిని, అటువంటి ఉపశమనాన్ని కోరడం మంచిదేనా? ఎవరికైనా అది మనం సిఫారసు చేస్తామా? కచ్చితంగా చేయం. హేతుబద్ధమైన ఆలోచనలలో నుంచి పుట్టి పెరగని మానసిక శాంతి ఏదైనా ఆత్మవంచన తప్ప మరోటి కాదు. సత్యం నుంచి దూరం తీసుకుపోయే ఉపశమనం ఏదైనా ఒక భ్రమ మాత్రమే. ఎండమావి మాత్రమే. ఇటువంటి ఉపశమనంలో ఒక భద్రత ఉందని నాకు తెలుసు. కానీ ఈ భద్రత ఒక మూడు చక్రాల సైకిల్‌ను నడిపితే మీరు సురక్షితంగా ఉంటారు. పడిపోరు. కానీ, కాళ్ళూ, చేతులూ సక్రమంగా ఉన్న పెద్దలు మూడు చక్రాల సైకిల్ నడపరు. వాళ్ళు రెండు చక్రాల సైకిల్ నడుపుతారు. అలా నడపడంలో పడిపోవచ్చు. కానీ, అది జీవితంలో భాగం.

ఇంకొక రకం కూడా ఉన్నారు. వీళ్ళు ఎటువంటి వాళ్ళు అంటే, గోల్ఫ్ క్లబ్ సభ్యులైన వారందరికీ గోల్ఫ్ మీద పెద్ద ఆసక్తి లేనట్టుగానే ఆశ్రమంలో కనబడే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక వ్యక్తి కానక్కర్లేదు. నాకు తెలిసిన ఒక సినిమా నిర్మాత ఉన్నారు. ఒక గురువు గారికి కరుడుగట్టిన అనుయాయి. ఆ గురువు గారి ఆశ్రమం ఢిల్లీకి రెండు గంటల దూరంలో ఉంది. ఆ నిర్మాత నన్ను ఒకసారి వాళ్ళ గురువు దగ్గరకు వెళ్ళమని అడిగారు. ఆశ్రమానికి వెళ్ళావంటే ఢిల్లీలోని ప్రముఖులందరూ నీకక్కడే కనబడతారు. నీకు తెలుసా మా గురూజీ

“మతానికి చెందిన మనుషుల పట్ల ఇటువంటి భావాలు ఉన్నప్పుడు నాకు కాబీర్ మీదనో, గౌతముడి మీదనో అంత గౌరవం ఎలా ఉందని మీరు అడగవచ్చు. వాళ్ళను నేనెందుకు గౌరవిస్తానో చెపుతాను. వాళ్ళందరూ మానవ నాగరికతా చరిత్రలో గొప్ప దోహదం చేసినవాళ్ళు. చరిత్రలో వేరు వేరు కాలాల్లో, వేరు వేరు పరిస్థితులలో వాళ్ళు జీవించారు. వాళ్ళందరి మధ్య ఒకే ఉమ్మడి సూత్రం ఉంది. వాళ్ళు అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. వాళ్ళు అట్టడుగు ప్రజల కోసం పోరాడారు.”

కాబోయే చంద్రస్వామి. చూస్తూండు. అన్నాడాయన. అంటే, ఇవాళ ఆధునిక గురువుల ఆధ్యాత్మిక ఆశ్రమాలు పైరవీలకూ, పనులకు పరిచయ స్థానాలు అయ్యాయి.

నిజం చెప్పాలంటే ఆధ్యాత్మిక దృష్టి ఉన్న, మత దృష్టి ఉన్న ప్రజల పట్ల నాకు చాలా గౌరవం ఉంది. నేనిప్పుడు చెప్పిన కారణాలన్నీ ఉన్నప్పటికీ వాళ్ళు మంచి వాళ్ళు. ఒక కారణం కూడా చెప్పాలి. ప్రతి ఉద్వేగానికీ, ప్రతి అనుభూతికీ ఉన్నట్టుగానే దీనికి కూడా ఒక పరిమితి ఉంది.

ఎవరైనా ఒక అంశం చూడగలరు. ఆ తర్వాత చూడలేరు. ఒక అంశం వరకు వినగలరు. ఆ తర్వాత ఏ శబ్దాన్నీ గ్రహించలేరు. ఒకానొక సమయం వరకు దుఃఖించగలరు. క్రమంగా ఆ దుఃఖాన్ని అధిగమిస్తారు. ఒకానొక స్థితి వరకే సంతోషాన్ని అనుభవించగలరు. ఆ తర్వాత సంతోషం కూడా అయిపోతుంది. సరిగ్గా అట్లాగే, ఎవరికైనా మంచితనానికి కూడా ఒక నిర్మితమైన శక్తే ఉంటుంది. మీరు ఒక స్థాయి వరకే మంచివాళ్ళుగా ఉండగలరు. మనిషిలో ఈ మంచితనపు సామర్థ్యం సగటున పది యూనిట్లు ఉంటుందనుకుంటే ఆ మంచితనపు సామర్థ్యం మొత్తాన్ని అటు మసీదుకు వెళ్ళి రోజుకు ఐదు సార్లు ప్రార్థనలు చేసే వారైనా, ఇటు గుడికి వెళ్ళే, లేదా గురువు పాదాల దగ్గరో కూచునే వాళ్లయినా పూర్తిగా ఖర్చు పెట్టేస్తున్నారని నాకనిపిస్తుంది. అదంతా కూడా అనుత్పాదమైన పద్ధతిలో ఖర్చు పెడుతున్నారనిపిస్తుంది. నేనెక్కడా ప్రార్థనలు చేయను. నేను ఏ గురువు దగ్గరకీ వెళ్లను. మసీదుకో, గుడికో, చర్చికో వెళ్లను. అప్పుడు నా మంచితనపు సామర్థ్యాన్ని నేను ఏం చేస్తాను? బహుశా ఆ మంచితనపు సామర్థ్యంతో నేను మరొకరికి సాయపడతాను. మరొకరికి తిండి పెడతాను. మరొకరికి ఆశ్రయం ఇస్తాను. మనుషులు తమలో ఉన్న మంచితనపు సామర్థ్యాన్ని పూజలలో, ప్రార్థనలో, మత విగ్రహాలను ఆరాధించడంలో ఆధ్యాత్మిక గురువులను కొలవడంలో ఖర్చు పెట్టే బదులు, ఆ మంచితనాన్ని మిగుల్చుకుని దాన్ని మరొకందుకు వాడితే వాళ్ళకు నా అభినందనలు.

మతానికి చెందిన మనుషుల పట్ల ఇటువంటి భావాలు ఉన్నప్పుడు నాకు కాబీర్ మీదనో, గౌతముడి మీదనో అంత గౌరవం ఎలా ఉందని మీరు అడగవచ్చు. వాళ్ళను నేనెందుకు గౌరవిస్తానో చెపుతాను. వాళ్ళందరూ మానవ నాగరికతా చరిత్రలో గొప్ప దోహదం చేసినవాళ్ళు. చరిత్రలో వేరు వేరు కాలాల్లో, వేరు వేరు పరిస్థితులలో వాళ్ళు జీవించారు. వాళ్ళందరి మధ్య ఒకే ఉమ్మడి సూత్రం ఉంది. వాళ్ళు అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. వాళ్ళు అట్టడుగు ప్రజల కోసం పోరాడారు. పాలకులు ఎవరైనా వారు చక్రవర్తులైనా, సామ్రాజ్యవాదులైనా వ్యతిరేకంగా పోరాడారు. కబీర్ ఫిరోజ్ తుగ్లక్ మతోన్మాద రాజ్య ఆధిపత్యాన్ని ఎదుర్కొని పోరాడాడు. నాకు ఆశ్చర్యం కలిగించేదీ, నా అనుమానాలను నిజం చేసేది ఏమంటే ఇవాళ మాత్రం తమను తాము మతాధిపతులమని చెప్పుకునే వాళ్ళు, విశ్వసత్యం తమకు మాత్రమే గ్రహింపుకు వచ్చిందని అనేవాళ్ళు ఒక్కరు కూడా అధికారానికి వ్యతిరేకంగా నిలబడడం లేదు. పాలకవర్గాలకూ, సంపన్న వర్గాలకూ వ్యతిరేకంగా వీళ్లలో ఒక్కరు కూడా గొంతెత్తడం లేదు. వీళ్ళు ధర్మం చెబుతారు. నిజమే. కానీ, అధిపత్య వ్యవస్థా, అధికారంలో ఉన్నవారు అంగీకరించినంత వరకే ఆ ధర్మం సాగుతుంది.

ఇవాల్టికి దళితులకు ప్రవేశం లేని దేవాలయాలలోకి వారిని నడిపించుకు వెళ్ళగలిగిన ఆధ్యాత్మిక గురువులు ఎవరైనా ఉన్నారా అని నా ప్రశ్న. దురాక్రమణదారులకూ, బడా కాంట్రాక్టర్లకూ వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసుల హక్కుల కొరకు నిలబడే ఆధ్యాత్మిక గురువులు ఎవరైనా ఉన్నారా అని నా ప్రశ్న. గుజరాత్ మారణకాండకు బలి అయిన వారి కోసం మాట్లాడిన, బాధితుల సహాయ శిబిరానికి వెళ్ళిన గురువు ఎవరైనా ఉన్నారా అని నా ప్రశ్న.

ధనికులకు ఉచ్చనీచాలు బోధించినంత మాత్రాన సరిపోదు. అవి కేవలం సంపన్నుల వినోద క్రీడ. ఇది కుటిలవాదుల మేలి ముసుగు. ఇది దుర్మార్గమైన వంచన. ఈ దుర్మార్గమైన వంచనను మీరు ఏ నిఘంటువులో చూసినా ఆధ్యాత్మికత అని పిలవలేరు. దానికి ఉన్నది ఒకే ఒక్క మాట బూటకం.

**(వ్యాసం సేకరణ: మలసాని శ్రీనివాస్, కాకినాడ)**

# బిజెపితో కార్పొరేట్ రంగం మిలాఖత్

**(7వ పేజీ తరువాయి)**

మాధ్యమాల్లో పొగడ్తల వర్షం కురిపించడం, విదేశీ పత్రికలు మన ప్రభుత్వం పై చిన్నపాటి విమర్శ చేసినా 'మా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు మీకు ఎక్కడిది' అని దబాయింపుగా ప్రశ్నించడం కార్పొరేట్ అధిపతులకు అలవాటుగా మారిపోయింది.

వాస్తవానికి ఒక పౌరుడిగా మనకి ఉన్నట్లే వాళ్ళకీ ఒక ఓటు హక్కు మాత్రమే ఉన్నది. మనకన్నా విలువైనది ఏమీ కాదు వాళ్ళ ఓటు. కానీ వాళ్ళ ఓటు మనం వేసే ఓటు కన్నా చాలా చాలా విలువైనదిగా భావిస్తారు. నిజమే కావచ్చు. వాళ్ళ ఓటు వెనుక వాళ్ళ వ్యాపార ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి కదా. జార్జి ఆర్వెల్ '1984 పేరిట రాసిన పుస్తకంలో – ప్రతి దస్త్రం నాశనం కావించబడుతున్నది లేదంటే తప్పుడు తడకలుగా మార్చేస్తున్నారు. ప్రతి పుస్తకాన్ని తిరగ రాస్తున్నారు, ప్రతి చిత్రానికి తిరిగి రంగులు అద్దుతున్నారు. ప్రతి వీది , పేరూ, ప్రతి విగ్రహం పేరూ మార్చేస్తున్నారు. తేదీలను మార్చేస్తున్నారు. ఇది ప్రతి రోజూ, ప్రతి నిమిషం నిరంతరాయంగా కొనసాగుతూ ఉన్నది. అంతూ దరీ లేని ఈ వర్తమానం తప్ప ఇంకేం మిగలలేదు. ఏది ఏమైనా పార్టీ వైఖరి సరైనదే' అని రాస్తాడు. భారతీయ కార్పొరేట్ రంగం అవునని తలూపుతోంది.

**(అనువాదం – కె.అస్మిత)**

# మధ్య యుగాల్లో ప్రజల జీవన పరిస్థితులు - సమాజం



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

ఎం.వి.ఎస్.శర్మ

క్రీ.శ. 800 – 1200 మధ్య కాలంలో చేతివృత్తులు, ముఖ్యంగా చేనేత ఉన్నత ప్రమాణాలతో కొనసాగింది. బంగారు, వెండి ఆభరణాల తయారీలో కూడా అటువంటి పరిస్థితే ఉంది. వ్యవసాయాభివృద్ధి సైతం కొనసాగింది. ఈ ఉపఖండపు భూములు సారవంతమైనవని, రైతులు నైపుణ్యం కలిగివున్నారని ఇక్కడ ఆ కాలంలో పర్యటించిన అరబ్బు యాత్రికులు తమ గ్రంధాల్లో పేర్కొన్నారు.

ప్రభుత్వాధికారులు, మంత్రులు, భూస్వాములు, పెద్ద పెద్ద వ్యాపారులు చాలా విలాసవంతమైన జీవితాలను గడిపినట్టు ఆనాటి సాహిత్యంలో వర్ణించారు. రాజు ఏ విధంగా విలాసవంతమైన భవనాల్లో జీవించాడో ఈ ఉన్నత తరగతులవారు కూడా అదే విధంగా బహు అంతస్తుల భవనాల్లో, విదేశాలనుండి దిగుమతి చేసుకున్న ఉన్ని, పట్టు దుస్తులతో, బంగారం వెండి ఆభరణాలతో అలంకరించుకునేవారు. వారి సేవలకు అనేకమంది నౌకర్లు ఉండేవారు. 'మహా సామంతాధిపతి' వంటి బిరుదులను తగిలించుకుని ఎక్కడకు పోయినా దాసదాసీ జనాన్ని, ఛత్రాన్ని వెంటపెట్టుకుని అలంక రించిన అశ్వాల మీద పయనమయేవారు.

ఐతే తక్కిన ప్రజానీకం అంతా ఇదే మాదిరిగా జీవించగలిగే పరిస్థితి లేదు. ఒకపక్క ఆహార వస్తువులు చౌకధరలకే లభిస్తున్నా వాటిని కొనుగోలు చేసే స్తోమత లేని పేదలు చాలామంది ఉండేవారు. రాజుగారి కొలువులో ఉండే అధికారులు అంతా మద్యం, మాంసాలతో ఖరీదైన విందులు ఆరగిస్తూంటే సామాన్యులు అన్నం, పచ్చడి మెతుకులతో కడుపులు నింపుకునేవారని రాజతరంగిణి కావ్యంలో వివరించారు. ఇది కాశ్మీర్‌లో 12వ శతాబ్దంలో రాసిన గ్రంధం. పేదరికాన్ని తట్టుకోలేక కొంతమంది దొంగతనాలకు, దోపిడీలకు తెగబడేవారు. ఇది నగరాలలో పరిస్థితి.

గ్రామాల్లో రైతులవద్దనుండి పంటలో ఆరవ వంతు శిస్తుగా వసూలు చేసేవారు. దాంతోబాటు, పశువుల మేతకు, చెరువు నీటికి అదనంగా వసూలు చేసేవారు. ఇవి కాకుండా అదనపు పన్నులు విధించే అధికారం భూ స్వాములకు ఉండేది. కొన్ని సందర్భాలలో వెట్టి చాకిరీకి (కూలి లేకుండా పని చేయడం) రైతులను పిలుచుకు పోయేవారు. ఒక భూస్వామి నుండి మరొక భూస్వామికి యాజమాన్యం మారినా, ఆ భూమి మీద బతికే రైతులు, పశు కాపరులు, చేతివృత్తుల వారు అందరూ కొత్త యజమాని కింద పని కొనసాగించాల్సి వుండేది. భూస్వాములు తమ విలాసాలకు కావలసిన ధనాన్ని ఏడో ఒక పేరుతో ప్రజలనుండి నిర్బంధంగా వసూలు చేసేవారు. దీనికి తోడు తరచూ వచ్చే కరువు కాటకాలు, యుద్ధాలు ప్రజలను చాలా ఇబ్బందుల పాలు చేసేవి. ఆ యుద్ధాల్లో చెరువుల కట్టలు తెగ్గొట్టి నీటి వనరులను ధ్వంసం చేయడం, గ్రామాలను తగులబెట్టడం, పశువుల మందలను ఎత్తుకుపోవడం, గాదెలనుండి ధాన్యాన్ని కొల్లగొట్టడం వంటి చర్యలు సర్వ సాధారణంగా జరిగేవి. ఆ విధంగా మధ్య యుగాల సమాజం సామాన్యుల జీవితాలమీద పలు విధాలుగా భారాలను మోపింది.

**కుల వ్యవస్థ**

కుల వ్యవస్థ సమాజంలో బలంగా ఉండేది. భూస్వామ్య సమాజానికి అదే పునాదిగా ఉండేది. ఈ కుల వ్యవస్థ అంతకు పూర్వపు సమాజంలోనే రూపు దిద్దుకున్నప్పటికీ, మధ్య యుగాల్లో అది చాలా బలంగా విస్తరించింది. ధర్మ శాస్త్రాలను, స్మృతులను రచించినవారు అంతకు మునుపు ఉన్న కట్టుబాట్లను మించి మరింత కఠినంగా శూద్రులను కట్టడి చేసేవిధంగా ఆంక్షలు రూపొందించారు. శూద్రుడు పెట్టిన ఆహారం తిన్నా, అతడితో స్నేహం చేసినా, అతడితో పాటు అదే స్థానంలో కూర్చున్నా, శూద్రుడి నుంచి ఏదైనా నేర్చుకున్నా ఆ వ్యక్తి ఎంత పెద్ద కులం వాడైనప్పటికీ భ్రష్టుడౌతాడని పరాశర స్మృతి పేర్కొంది. శూద్రుడి నీడను తాకితే మైల పడినట్టా? లేదా ? అన్న విషయం మీద తర్జన భర్జనలు జరిగినట్టు గ్రంధాల్లో ఉంది. ఒక పెద్ద కులపు వ్యక్తి మరొక తక్కువ కులపు వ్యక్తి మధ్య సంబంధం ఏర్పడిన కారణంగా వారికి బిడ్డ పుడితే ఆ బిడ్డ ఆ రెండు కులాల్లో ఏది తక్కువ కులమో ఆ కులానికే చెందుతుందని ధర్మ శాస్త్రాలు నిర్దేశించాయి. చాలా చేతివృత్తులను హీన కులాలుగా వర్గీకరించారు. ఎక్కువమంది శ్రమజీవులను, భిల్లులు వంటి ఆదిమ తెగల ప్రజలను అంటరాని కులాలుగా వర్గీక రించారు.

ఈ కాలంలో రాజపుత్రులు అనే కొత్త కులం కనిపిస్తుంది. ఈ రాజపుత్రులంతా తాము సూర్య వంశానికో, లేక చంద్ర వంశానికో చెందినట్టు వంశ చరిత్రలు రాయించుకున్నారు. ఐతే చరిత్రకారులు వీరు అనేక తెగలకు చెందినవారని, వివిధ సందర్భాలలో మన దేశంలోకి వచ్చి తమ

> ❝కుల వ్యవస్థ అనేక మార్పులకు లోనైందనడానికి మరొక ఉదాహరణ కాయస్థ కులం. రాజుల కొలువులో పని చేసిన బ్రాహ్మణ, వైశ్య, శూద్ర కులాలకు చెందినవారు ఒకానొక దశలో తమను కాయస్థులుగా చెప్పుకోవడం ప్రారంభించారు. క్రమంగా అదొక కులంగా స్థిరపడింది.❞

బల పరాక్రమాల ద్వారా రాజ్యాధికారం సంపాదించినవారని, వీరిలో ఎక్కువమంది ఇటు చైనా ప్రాంతం నుంచి కాని అటు కాస్పియన్ సముద్ర ప్రాంతం నుండి కాని వచ్చివుండాలని భావిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది హర్ష సామ్రాజ్యం బలహీనపడిన అనంతర కాలంలో వచ్చారని భావిస్తున్నారు. కొన్ని సందర్భాలలో బ్రాహ్మణులు, వైశ్యులు కూడా రాజ్యాధికారం నిర్వహించారు. ఇలా అనేక మూలాలనుండి వచ్చినవారు తర్వాత కాలంలో క్షత్రియులుగా ప్రకటించుకున్నారు. అప్పటికే ఉనికిలో ఉన్న క్షత్రియ కులంలో కలిసిపోయారు.

కుల వ్యవస్థ అనేక మార్పులకు లోనైందనడానికి మరొక ఉదాహరణ కాయస్థ కులం. రాజుల కొలువులో పని చేసిన బ్రాహ్మణ, వైశ్య, శూద్ర కులాలకు చెందినవారు ఒకానొక దశలో తమను కాయస్థులుగా చెప్పుకోవడం ప్రారంభించారు. క్రమంగా అదొక కులంగా స్థిరపడింది. మధ్య యుగాలలో వేగంగా హిందూ మతం బలపడుతూవచ్చింది. ఆ క్రమంలో బౌద్ధులనుండి, జైనులనుండి పెద్ద సంఖ్యలో వచ్చి కలిసిపోయిన వారినందరినీ కొత్త కొత్త కులాలుగా, ఉపకులాలుగా వర్గీకరించి కుల వ్యవస్థలో భాగంగా మార్చివేశారు. కుల వ్యవస్థలో భాగంగా మారిన తర్వాత కూడా కొన్ని తెగల ప్రజలు తమ పురాతన సాంప్రదాయాలను, దైవాలను కొనసాగించారు.

### మహిళల స్థితిగతులు

పురుషులతో పోల్చితే మహిళల తెలివితేటలు తక్కువగా ఉంటాయని, తమ భర్తలను అనుసరించడమే వారి విధి అని ఆ నాటి సమాజ ధర్మం నిర్దేశించింది. భర్త కాళ్ళు కడగడం దగ్గరనుంచి అన్ని రకాల సేవలనూ భార్య చేయాలని, భర్త శీలవంతుడిగాను, భార్య పట్ల ద్వేషం గాని అసూయ గాని ప్రదర్శించనివాడిగాను మెలగాలని ధర్మ శాస్త్రాలు ఆదేశించాయి. భార్య తప్పు చేస్తే భర్త ఆమెను తాడుతో గాని బెత్తంతో గాని దండించవచ్చునని మత్స్య పురాణం చెప్తోంది. వేదాలను నేర్చుకునే అధికారం మహిళలకు లేదు. స్త్రీల వివాహ వయస్సును బాగా తగ్గించినది ఈ కాలంలోనే. తద్వారా వాళ్ళు విద్య నేర్చుకునే అవకాశాలను లేకుండా చేశారు. ఉన్నత విద్యకు సంబంధించిన గ్రంధాలలో ఎక్కడా మహిళా బోధకుల పేర్లు ప్రస్తావనకు రాలేదు. దీనిని బట్టి అత్యధిక మహిళలు విద్యకు దూరం అయ్యారని స్పష్టమౌతోంది. ఐతే రాజాంత:పురాల్లో ఉండే మహిళలు సాహిత్యంలో మంచి ప్రవేశం కలిగివున్నట్టు, వివిధ లలిత కళల్లో ప్రావీణ్యం కలిగివున్నట్టు అప్పటి సాహిత్యంలో కనిపిస్తుంది.

ఆరు నుండి ఎనిమిది ఏళ్ళ వయస్సు వచ్చే లోపే మహిళకు వివాహం జరిగిపోయేది. భర్త దేశాంతరాలు పట్టి పోయినప్పుడు, లేదా సన్యాసం తీసుకున్నప్పుడు, లేదా సపుంసకుడు అని నిర్ధారణ అయినప్పుడు మాత్రమే స్త్రీకి మళ్ళీ పెళ్ళికి అనుమతి లభించేది.

మహిళల్ని నమ్మకూడదని, కట్టడిలో ఉంచాలని సంప్రదాయాలు చెప్తున్నాయి. ఐతే వ్యక్తిగత ఆస్తి పెరగడంతో స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించడం జరిగింది. భర్త ఆస్తి వారసత్వంగా భార్యకు సంక్రమించేది. వితంతువు మరణానంతరం ఆమె కూతుళ్ళకు కూడా ఆ ఆస్తిలో వాటా ఉండేది. అంటే మహిళలకు ఏ ఇతర హక్కులూ లేకున్నా ఆస్తి హక్కు కల్పించారన్నమాట. ఇది నిజానికి ఫ్యూడల్ ఆస్తి హక్కును కాపాడుకోవడం కోసం చేసినదే అని స్పష్టంగానే తెలుస్తోంది.

సతి దురాచారం ఈ కాలంలో అమలు జరిగింది. ఐతే ఎక్కువ సందర్భాల్లో ఆ మహిళల ఇష్టానికే విడిచిపెట్టారు. సంపన్నులు ఎక్కువమంది భార్యలను కలిగివుండడం, ఆస్తికి వారసత్వం ఎవరిదన్న వివాదాలు పెరగడంతో సతి దురాచారం కూడా బాగా పెరిగింది.

### జీవన శైలి

స్త్రీలు చీరెలు, పురుషులు ధోవతులు ధరించడం సాధారణం. ఉత్తర భారతంలో చొక్కా మీద చిన్న కోటు ధరించడం, స్త్రీలు జాకెట్లు ధరించడం పరిపాటి. ఉన్నత తరగతుల పురుషులు పొడవాటి కోటు, ట్రౌజర్లు, బూట్లు ధరించడం హోదాకు నిదర్శనంగా ఉండేది. ఆభరణాలను ధరించడం పట్ల మగవారు, ఆడవారు మక్కువ చూపేవారు. చెవులకు పోగులు, గట్టిగా పట్టినట్టు ఉండే దుస్తులు, తలమీద టోపీతో ఉండేవారని గుజరాత్ ప్రాంతాన్ని సందర్శించిన యాత్రికులు రాశారు. అదే మలబార్ ప్రాంతంలోనైతే రాజు తప్ప తక్కిన వారు మొలకు మాత్రమే వస్త్రాన్ని చుట్టుకునేవారు. అక్కడ దర్జీ వృత్తి అనేది ఉనికిలో అప్పుడు లేదు. ఐతే ఆభరణాలను మాత్రం ధరించేవారు.

సాధారణంగా శాకాహారాన్ని తీసుకున్నా ప్రత్యేక సందర్భాలలో మాంసాహారాన్ని కూడా తీసుకునేవారు. అడవుల్లో దొరికే జంతువుల మాంసాన్ని తీసుకోవడం చట్టబద్ధంగా పరిగణించేవారు.

మద్యాన్ని సేవించడం పండుగల్లో, ఉత్సవాల్లో పరిపాటి. ఉన్నత కులాల వారికి మద్య సేవనం నిషేధం అని స్మృతుల్లో ప్రకటించినప్పటికీ ఆచరణలో అది కచ్చితంగా అమలు అయేది కాదు.

పట్టణాల్లో ప్రజలు వినోద కాలక్షేపానికి ప్రాధాన్యతనిచ్చేవారు. ఉత్సవాలు, జాతరలు, పండుగలు మాత్రమే కాక వనభోజనాలు, ఈత పోటీలు, విందులు తరచూ జరిగేవి. గుర్రె పందేలు, కోడిపందేలు జరిగేవి. ఉన్నత వర్గాలవారు జూదం మీద మక్కువ చూపేవారు.

### శాస్త్ర విజ్ఞానం, విద్య

అంతకు పూర్వకాలంలో పెంపొందించిన విద్యా విధానమే ఈ కాలంలోనూ కొనసాగింది. పెద్దగా మార్పులు లేవు. ప్రజలందరినీ విద్యావంతుల్ని చేయాలన్న భావనే ఆ కాలంలో లేదు. చదవడం, రాయడం కొద్దిమందికే, ముఖ్యంగా బ్రాహ్మణులకే పరిమితం అయింది. క్షత్రియులలో, వైశ్యులలో కూడా కొద్దిమంది

విద్యావంతులు ఉండేవారు. తక్కిన ప్రజలందరూ తమ బతుకుతెరువుకు కావలసిన విద్య లేదా నైపుణ్యాన్ని నేర్చుకునేవారు.

సాధారణంగా దేవాలయాలు ఉన్నత విద్యా కేంద్రాలుగా ఉండేవి. గురువు దగ్గర ప్రాథమికవిద్య నేర్చుకోవాలనుకునేవారు అతని ఇంటివద్దే ఉండి నేర్చుకోవాలి. స్తోమత ఉన్నవారు గురువుకు దక్షిణ చెల్లించాలి. అది లేనివారు అతని వద్ద ఉచితంగా చాకిరీ చేయాలి. ప్రధానంగా వేదాలు, వ్యాకరణం నేర్పేవారు.

**“సాధారణంగా దేవాలయాలు ఉన్నత విద్యా కేంద్రాలుగా ఉండేవి. గురువు దగ్గర ప్రాథమికవిద్య నేర్చుకోవాలనుకునేవారు అతని ఇంటివద్దే ఉండి నేర్చుకోవాలి. స్తోమత ఉన్నవారు గురువుకు దక్షిణ చెల్లించాలి. అది లేనివారు అతని వద్ద ఉచితంగా చాకిరీ చేయాలి. ప్రధానంగా వేదాలు, వ్యాకరణం నేర్పేవారు.”**

బౌద్ధవిహారాలలో విద్యాభ్యాసం లౌకికాంశాలమీద ప్రధానంగా జరిగేది. నలంద, విక్రమశిల, ఉద్దానపుర వంటివి ఆనాటి విద్యాలయాలు. అవి ఇప్పటి బీహార్‌లో ఉన్నాయి. దేశ విదేశాలనుండి విద్యార్థులు వచ్చి నేర్చుకునేవారు. ఈ విద్యాలయాలు రాజు ఇచ్చే గ్రాంటుమీద ఆధారపడి నడిచేవి. విద్యార్థులకు చదువు ఉచితం. కాశ్మీర్ మరొక విద్యా కేంద్రంగా ఉండేది. అనేక శైవ శాఖలు ఇక్కడ విద్యాలయాలను నడిపేవి. దక్షిణాదిన శృంగేరి, మదురై వంటి చోట్ల మఠాలు నడిచేవి. ఇక్కడ మతం, తత్వశాస్త్రం ప్రధాన అంశాలుగా బోధించేవారు. దేశంలోని వివిధ విద్యా కేంద్రాలను సందర్శించి అక్కడివారితో తాత్విక చర్చలు, వాదోపవాదాలు జరిపిన తర్వాతే ఒక విద్యార్థి పండితుడుగా పరిగణింపబడేవాడు. ఈ క్రమంలో తాత్విక భావాలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. కొంతవరకు సాంస్కృతికంగా వివిధ ప్రాంతాలను చేరువ చేశాయి.

ఐతే ఈ కాలంలో క్రమేపీ శాస్త్ర విజ్ఞానం మాత్రం అభివృద్ధి చెందడం ఆగి పోయింది. అంతవరకూ ప్రపంచంలోనే శాస్త్రవిజ్ఞానంలో ఒక అగ్రగామిగా పరిగణించబడే మనదేశం ఈ కాలం నాటికి ఆ గుర్తింపును కోల్పోయింది. శవాలను కోయడం నీచంగా ధర్మశాస్త్రాలు పరిగణించడంతో శస్త్ర చికిత్సావిధానం క్రమంగా దిగజారిపోయింది. క్షౌరవృత్తి చేసేవారే శస్త్ర చికిత్స కూడా చేయడం మొదలైంది. జాతకం చెప్పడం పెరిగి ఖగోళశాస్త్రం వెనక్కి పోయింది. గణితం విషయంలో మాత్రం కొంత పురోగతి ఉంది. ఈ కాలంలో భాస్కరుడు రచించిన లీలావతి గణితం చాలా కాలం వరకూ పాఠ్యపుస్తకంగా కొనసాగింది. వైద్యంలో పాదరసాన్ని వినియోగించి కొన్ని రకాల ఔషధాలను కొత్తగా ప్రవేశపెట్టారు. జంతువులకు, మొక్కలకు సంబంధించిన సంరక్షణ విషయంలో కూడా కొన్ని పుస్తకాలు వచ్చాయి, కాని మేలు రకపు గుర్రాలను పెంపొందించడం మాత్రం సాధ్య పడలేదు. దాంతో అరేబియా, ఇరాన్ మధ్య ఆసియా ప్రాంతం మీద మనం ఆధారపడడం కొనసాగింది.

శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి చెందడం అనేది సమాజం మొత్తంగా అభివృద్ధి చెందడంతో ముడిపడివుంటుంది. ఈ కాలంలో సమాజం రాను రాను జడత్వాన్ని, సంకుచిత తత్వాన్ని సంతరించుకుంది. మత ఛాందసవాదం పెరిగింది. పట్టణ జీవితం క్రమంగా నిస్సారంగా మారింది. “బ్రాహ్మణులు విద్యావంతులైనప్పటికీ, చాలా పొగరుగా, మూర్ఖంగా, తమను తామే వంచించుకుంటూ, బండరాళ్ళమాదిరి ఉంటారు. తమకు తెలిసినదానిని ఇతరులకు చెప్పడం పట్ల తీవ్ర విముఖత వారిలో చూశాను. తక్కిన కులాలకు చెందినవారికి తమ విద్య ఏమాత్రమూ అందకుండా ఉండేందుకు వారు తీసుకునే శ్రద్ధ చాలా


‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

**"ఈ కాలంలో హిందూయిజం దేశంలో బాగా బలపడింది. బౌద్ధం, జైనం బలహీన పడ్డాయి. ఆ రెండు విశ్వాసాలనూ సైద్ధాంతికంగా, తాత్వికంగా సవాలు చేయడమే కాక వారిపై హింసకు పాల్పడడం, వారి ఆరామాలను ఆక్రమించుకోవడం, ధ్వసం చేయడం వంటివి చాలా ఘటనలు ఈ కాలంలో జరిగాయి."**

ఎక్కువ. ఇక విదేశీయుల విషయంలో చెప్పనక్కరలేదు" అని అల్ బరూని రాశాడు. "వారి దృష్టిలో ఈ భూమ్మీద ఉన్న జీవుల్లో తమకన్నా ఎక్కువ తెలిసినవారెవ్వరూ లేరు" అని అన్నాడు.

**మత ఉద్యమాలు, విశ్వాసాలు**

ఈ కాలంలో హిందూయిజం దేశంలో బాగా బలపడింది. బౌద్ధం, జైనం బలహీన పడ్డాయి. ఆ రెండు విశ్వాసాలనూ సైద్ధాంతికంగా, తాత్వికంగా సవాలు చేయడమే కాక వారిపై హింసకు పాల్పడడం, వారి ఆరామాలను ఆక్రమించుకోవడం, ధ్వసం చేయడం వంటివి చాలా ఘటనలు ఈ కాలంలో జరిగాయి.

తూర్పు భారతంలో పాలించిన 'పాల' ప్రభువులు బౌద్ధమతాన్ని ఆదరించారు. పదవ శతాబ్దంలో పాల సామ్రాజ్యం పతనంతో బౌద్ధానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దానితోబాటు బౌద్ధంలో మహాయానం అనే శాఖ బయలుదేరింది. అది బుద్ధుడిని దైవంగా పరిగణించి ఆరాధించడం మొదలుపెట్టింది. మంత్ర తంత్రాలతో బుద్ధుడిని ఆరాధిస్తే అతీత శక్తులు సాధించవచ్చుననే ప్రచారం చేసింది.

ఇదే తరహా ప్రచారం హిందువులలో కూడా సాగింది, చాలా మంది యోగులుగా మారి అతీత శక్తులను సాధించాలనే యాతనలో పడ్డారు. వారిలో గోరఖ్‌నాథ్ ప్రముఖుడు. ఈ యోగుల్లో ఎక్కువమంది తక్కువ కులాలనుండి వచ్చినవారు. వీరు బ్రాహ్మణుల పెత్తనాన్ని నిరసించి, కుల వ్యవస్థను వ్యతిరేకించి తంత్రవిద్యను అభ్యసించడానికి పూనుకున్నారు.

ఆ విధంగా పలు వైపుల నుండి వచ్చిన మార్పులతో బౌద్ధం బాగా బలహీనపడింది. జైనం ముఖ్యంగా వ్యాపార వర్గాలలో ప్రాచుర్యం కొనసాగించింది. పశ్చిమ భారతంలో కొన్ని ప్రముఖ జైన దేవాలయాలు ఈ కాలంలోనే నిర్మించారు. మాల్వ ప్రభువుల కాలంలో మౌంట్ అబు వద్ద నిర్మించిన దిల్వారా దేవాలయం ఈ కాలంలోనిదే. బ్రహ్మాండమైన రీతిలో మహావీరుడి విగ్రహాలను నిర్మించారు. జైన దేవాలయాలు యాత్రికులకు విశ్రాంతిస్థలాలుగా కూడా ఉండేవి. కర్నాటకను పాలించిన గాంగులు జైన మతాన్ని పోషించారు. శ్రావణబెళగొళ వద్ద నిర్మించిన అతి పెద్ద మహావీర విగ్రహం ఈ కాలంనాటిదే. క్రమంగా రాజాదరణను కోల్పోయిన జైనం క్షీణించసాగింది.

హిందూ మతంలో శివుడు, విష్ణువు ప్రధాన దేవతలు అయ్యారు. అనేక స్థానిక తెగల దైవాలు హైందవీకరించబడ్డాయి. వారంతా ఈ ప్రధాన దేవతలకు అనుచరులుగా పరిగణించబడ్డారు. హిందూ మతం పుంజుకోవడంతోబాటు బ్రాహ్మణుల అధికారం, అహంకారం కూడా పెరగసాగాయి. దీనికి ప్రతిచర్యగా మానవులందరూ సమానమేనని, అందరికీ స్వేచ్ఛ ఉండాలని ప్రబోధించే ఉద్యమాలు తలెత్తాయి.

వాటిలో తంత్రవాదం ఒకటి. దానిగురించి ఇంతకుముందే చెప్పుకున్నాం. దానికన్నా విశాల ప్రాతిపదికన, ఎక్కువ ప్రభావం కలిగించిన ఉద్యమం భక్తి ఉద్యమం. ఇది దక్షిణాదిన తలెత్తింది. ఆళ్వారులు, నయనార్లు దీనిని ప్రచారంలోకి తెచ్చారు. భగవంతుడికి, భక్తుడికి మధ్య అంతరం గాని అడ్డు కాని ఏదీ ఉండకూడదని వీరు ప్రబోధించారు. దైవాన్ని ఆరాధించడానికి వేరే అర్హతలు ఏమీ అవసరం లేదని, భక్తి ఉంటే చాలునని వీరు చెప్పారు. నేరుగా కుల వ్యవస్థను సవాలు చేయకపోయినా, భక్తి ఉద్యమం అన్ని కులాలవారినీ తనలో ఇముడ్చుకుంది. హిందూ మతంలోకి చాలామంది బౌద్ధ, జైన మతస్తుల్ని ఆకర్షించింది. పలు ఆదివాసీ తెగలను కూడా ఆకర్షించింది. కర్ణాటకలో లింగాయతుల ఉద్యమం 12వ శతాబ్దంలో బయలుదేరింది. శివ భక్తిని ప్రబోధించే లింగాయతులు కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించారు. ఉపవాసాలు, బలులు, తీర్థయాత్రలు వంటి పద్ధతులను వ్యతిరేకించారు. బాల్య వివాహాలను వ్యతిరేకించారు. వితంతువులకు పునర్వివాహం ఉండాలని వాదించారు.

బౌద్ధానికి, జైనానికి అతి పెద్ద సవాలు శంకరుడి రూపంలో ఎదురైంది ఈ కాలంలోనే. 9వ శతాబ్దంలో కేరళలో శంకరుడు జన్మించాడు. తన ప్రాంతంలో బలంగా ఉండిన జైనుల వేధింపులనుండి తప్పించుకుని ఉత్తర భారతం అంతా పర్యటించి అక్కడ తాత్విక చర్చల్లో విజయం సాధించి తిరిగి స్వస్థలాన్ని చేరుకున్నాడు. మదురై తిరిగివచ్చాక రాజు జైనులను వెళ్ళగొట్టి శంకరుడిని ఆదరించాడు. శంకరుడు బోధించిన తత్వాన్ని అద్వైతం అంటారు. జీవాత్మ. పరమాత్మ అంటూ రెండు వేరు వేరుగా లేవు అని, ఉన్నదంతా పరమాత్మేనని ఆ తత్వం సారాంశం. దీనినే వేదాంతం అని కూడా అంటారు.

శంకరుడి తత్వం సామాన్య ప్రజలకు అర్థం కాని స్థాయిలో ఉండిపోయింది. అందుచేత వారిమీద పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఆ తర్వాత 11వ శతాబ్దంలో వచ్చిన రామానుజుడు భక్తిని, వేదాంతాన్ని మేళవించి వేదాంతానికి ప్రజాదరణ కల్పించే కృషి చేశాడు. అతడి మార్గాన్నే తర్వాత మాధవాచార్యుడు, రామానందుడు, వల్లభాచార్యుడు తదితరులు అనుసరించారు. మొత్తానికి భక్తి భారతీయ సమాజంలో సర్వామోదం పొందిన భావనగా మారింది.

భూస్వామ్య సమాజంలో ప్రభువు పట్ల తిరుగు లేని విశ్వాసం కలిగివుండడం ప్రజల విధిగా పరిగణించేవారు. పరలోకంలో దైవం మీద ఏ విధంగా అపరిమితమైన భక్తి కలిగివుంటారో, ఈ లోకంలో అదేవిధమైన భక్తిని రాజు యెడల ప్రదర్శించాలని ప్రజల్లో సాగిన ప్రచారానికి భక్తి ఉద్యమం బాగా తోడ్పడింది. అందుకే దానికి రాజాదరణ బాగా లభించింది.

**(తరువాయి వచ్చే సంచికలో)**

**సైన్సు, సమాజం-3**

# ఆధునిక యుగంలో సైన్సు

*(2023 డిసెంబర్ 23-25 తేదీల్లో విజయవాడలో జరిగిన సైన్సు వర్క్‌షాపులో ప్రవేశపెట్టిన పత్రం నుండి)*



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

**ఎస్ వెంకట్రావు**

ఆధునిక యుగంలో మానవుని ఆలోచనా విధానం మీద గొప్ప ప్రభావం కలుగజేసిన ఆవిష్కరణలు భౌతిక శాస్త్రంలో జరిగాయి. ఇవి తదుపరి అణు ఇంధనం, ఎలక్ట్రానిక్స్- టెలికమ్యూనికేషన్స్ రంగాలలో గొప్ప విజయాలకు దారితీశాయి. 1895 ఎక్స్-రే, రేడియో ధార్మిక వికిరణాలు కనుగొనడంతో ఈ ఆవిష్కరణల పరంపర ఆరంభమైంది. 1912లో స్పటిక నిర్మాణం, 1932లో న్యూట్రాన్లు, 1938లో అణు విచ్ఛిత్తి కనుగొనబడ్డాయి. క్యూరీ దంపతులు, రూథర్ ఫర్డ్, మాక్స్‌ప్లాంక్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, బ్రాగ్స్, బోర్ మొదలైన శాస్త్రవేత్తల కృషి వీటి వెనుక వుంది. 1968లో జెనిటిక్ కోడ్ ఆవిష్కరణ జీవశాస్త్రంలో పెను మార్పులకు దారితీసింది.

వీటన్నిటిలోకీ మానవుని ఆలోచనలలో సమూలమైన మార్పులు తెచ్చిన ఆవిష్కరణ ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కనుగొన్న సాపేక్ష సిద్ధాంతం. 1915లో ఆయన సాధారణ సాపేక్ష సిద్ధాంతాన్ని కనుగొన్నాడు. అంతకుముందు 1905లో ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతాన్ని కనుగొన్నాడు. తొలి సిద్ధాంతంలో ఆయన చలనం సాపేక్షమైనదని చెప్పాడు. స్థలం - కాలం రెండూ కొంతవరకు ఒకదానితో ఒకటి మారకం వేయగల అంశాలనీ, వాటిని పరిశీలించే వ్యక్తి యొక్క చలనంపై ఈ మారకం ఆధారపడి వుంటుందనీ చెప్పారు. పదేళ్ళ తర్వాత ఈ ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతంలోకి న్యూటన్ గురుత్వాకర్షణను కూడా తీసుకురావడం ద్వారా ఐన్‌స్టీన్ అంతకు ముందు కోపర్నికస్, గెలీలియో, న్యూటన్ సృష్టించిన విశ్వచిత్రానికి కొత్త రూపునిచ్చాడు.

ఐన్‌స్టీన్ కనిపెట్టిన సాధారణ సాపేక్ష సిద్ధాంతం ఇప్పటికీ సాధారణమైన వ్యక్తులు అర్థం చేసుకోవడానికి ఇబ్బంది పడే అంశమే. సమయం, స్థలం, కాలం - పదార్థం, శక్తి మొదలైన వాటికి సంబంధించి ఐన్‌స్టీన్ సిద్ధాతం నూతనమైన, సమగ్రమైన ఆలోచనను కలిగించింది. ముఖ్యంగా ఆయన $E=mc^2$ అనే సూత్రం ద్వారా పదార్థమూ, శక్తీ ఒకటేనని చెప్పాడు. అంతేకాదు, కాంతి వేగం అనేది విశ్వంలో వేగానికి ఒక పరిమితిని విధిస్తోందని చెప్పాడు. ఈ రెండు అంశాలూ తర్వాత ఈ విశ్వంపై మానవుని అవగాహన పెంచడానికి తోడ్పడ్డాయి. నిజానికి ఐన్‌స్టీన్ సూత్రం, మానవుని సత్యానికి అతి చేరువకు తీసుకుపోయింది.

E=mc2 లో E అంటే శక్తి, m అంటే పదార్థం. c అంటే కాంతి వేగం. ఈ సూత్రం పదార్థపు అణువులో నిక్షిప్తమై వున్న అపారమైన శక్తి గురించి వివరించింది. ఈ విశ్వంలో వున్న శక్తి అంతా ఒకటేనని, అది పదార్థం నాశనం అవడం ద్వారా వస్తున్న శక్తేనని తరువాత జరిగిన పరిశోధనలు తెలియజేశాయి. నక్షత్రాలలో హైడ్రోజన్ వాయువు విచ్ఛిన్నమై హీలియంగా మారుతోంది. ఈ క్రమంలో పదార్థంలో కొంత భాగం అపారమైన శక్తిగా మారుతోంది. దీనిలో కొద్దిభాగం మన భూమి మీదకు చేరి సకల చరాచర జీవరాసుల మనుగడకు కారణమవుతోంది. ఆ విధంగా ఈ విశ్వం మొత్తం ఒకటే, అదే "చలనంలో వున్న పదార్థం" లేదా శక్తి రూపం అన్న తాత్విక భావనకు ఐన్‌స్టీన ఆవిష్కరణ ఆధారం చూపింది.

చలనం సాపేక్షమైనది. నిజమే. మరి చలనానికి హద్దేది? ఈ విశ్వంలో పదార్థమైనా, అణువైనా వేగం పెరిగీ పెరిగీ ఒక దశ వచ్చేసరికి దాని శక్తీ, పరిమాణం రెండూ ఒకేసారి పెరుగుతాయి. ఫలితంగా అవి మరింత వేగంగా పయనించడం కష్టమై పోతుంది. చివరికి ఇంకా వేగం పెరగడం ఆగిపోతుంది. ఆ పరిమితిని పెట్టే వేగమే కాంతి వేగమని ఐన్‌స్టీన్ చెప్పాడు. దాన్నే సరళంగా చెప్పాలంటే ఈ విశ్వంలో ఏ వస్తువు వేగమైనా పెరిగి పెరిగి కాంతి వేగం చేరేసరికి దాని పరిమాణం ఎంతగా పెరుగుతుందంటే అది కాంతిగా మారిపోతుంది. కాంతి - కాంతి వేగాన్ని మించి పయనించదు. కనుక కాంతి వేగాన్ని మించిన వేగం ఈ విశ్వంలో ఏ వస్తువుకూ రాదు.

బరువు, గురుత్వాకర్షణ అనేవి నిజానికి స్థలం - కాలం - చలనం యొక్క అభివ్యక్తీకరణ అని చెప్పాడు ఐన్‌స్టీన్. స్థలం అనేది యూక్లిడ్ చెప్పినట్లు క్షేత్ర గణితం మాదిరిగా బల్లపరుపుగా ఉండదనీ, పెద్ద పెద్ద, విశ్వగోళాల వద్ద స్థలం వొంగుతుందనీ చెప్పాడు. నిజానికి స్థలం... అంటే "స్పేస్" వొంగడం అనేది ఒక కొత్త భావన. అర్థం చేసుకోవడానికి చాలా కష్టపడాల్సిన భావన. కాని ఐన్‌స్టీన్ చెప్పిన భావన ప్రయోగాత్మకంగా కూడా రుజువైంది. కాంతి రుజుమార్గంలో పయనిస్తుంది. అందుకనే పారదర్శకం కాని ఏదైనా వస్తువుకు వెనుక వున్న మరో వస్తువు మనకు కనిపించదు. కాని సూర్యుని వెనుక వున్న నక్షత్రం మనకు కనిపిస్తుంది. ఎందుకంటే నక్షత్ర కాంతి సూర్యుని దగ్గరకు వచ్చినాక వొంపుగా ప్రయాణించి తిరిగి రుజుమార్గంలో పయనిస్తుంది. నిజానికి అక్కడ కాంతి వొంగదనీ కాంతి పయనించే స్థలం

> ❝ కొత్త శాస్త్రీయ పరిజ్ఞానం కొత్త సాంకేతిక అవకాశాలకు దారితీస్తుంది. ఉదాహరణకు, విద్యుత్తును కనుగొనడం వల్ల విద్యుత్ బల్బులు, విద్యుత్ మోటార్లు వచ్చాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం కొత్త శాస్త్రీయ ఆవిష్కరణలకు దారితీస్తుంది. ఉదాహరణకు టెలిస్కోపు కనుగొనడంతో ఖగోళ విజ్ఞానం పెరిగింది. ❞

పెద్ద గోళమైన సూర్యుని దగ్గర వొంగుతోందనీ ఐన్‌స్టీన్ చెప్పాడు.

ఐన్‌స్టీన్ ఈ విశ్వం యొక్క ఏకత్వాన్ని మనముందుంచాడు. అణువు అంతర్భాగం నుండి అంతరిక్షంలోని మహాగోళాల వరకూ అంతా పదార్థమేననీ, పదార్థమే శక్తి అనీ తన జూఎమ్2 సూత్రం ద్వారా తేల్చాడు.

అయితే ఐన్‌స్టీన్ సిద్ధాంతం భౌతిక శాస్త్రంలో ఎంతటి గొప్ప ఆవిష్కరణలకు తావిచ్చిందో అంతగానూ మార్మికతకు కూడా కారణమైంది. ఈ సిద్ధాంతం అర్థం చేసుకోవడం కష్టం. సామాన్యుడు అర్థం చేసుకోలేనిదే ఎక్కువ. అందువల్ల కొద్దిమంది విజ్ఞాన శాస్త్రవేత్తలు మినహా మిగిలిన ప్రపంచంలో ఐన్‌స్టీన్ సిద్ధాంతం మార్మిక వాదానికి తావిచ్చింది. ముఖ్యంగా మొదటి ప్రపంచ యుద్ధం, తదనంతర సంవత్సరాల్లో పెట్టుబడిదారీ ప్రపంచంలో తలెత్తిన సంక్షోభం, దాని నుండి ఏర్పడిన దైన్యమైన పరిస్థితి, తదుపరి జరిగిన రెండవ ప్రపంచ యుద్ధం... ఈ కాలమంతటా వాస్తవ పరిస్థితిని ఎదుర్కోవం కన్నా సాపేక్షత వెనుక దాక్కోవడం మేధావులకు సుఖంగా కనిపించేది. వారిని వేధించే ప్రశ్న ఏది ముందుకు వచ్చినా "అంతా సాపేక్షం" అని తప్పుకునేవారు. "అంతా నీవేమనుకుంటున్నావు అన్న దానిపై ఆధారపడి ఉంటుంది" అనేవారు. "నీవు అర్థం చేసుకునే దాన్ని బట్టి ఉంటుంది" అనే మాట వెనుక ఒక రకమైన నిరాశావాదం, అభివృద్ధి నిరోధక భావజాలం పొడచూపింది. శాస్త్రవేత్తలు తాము స్పష్టంగా గ్రహించే విషయం పైన కూడా సందేహించడం ప్రారంభించారు.

### సైన్సు-సాంకేతికత
### (Science and Technology)

సైన్సు, సాంకేతికత అనేవి భిన్న రంగాలైనప్పటికీ ఒకదానిపై ఒకదానితో మరొకటి విడదీయలేని కార్యకలాపాలు. సైన్సు అంటే ప్రకృతిని అధ్యయనం చేయడం, సాంకేతికత అంటే శాస్త్రీయ విజ్ఞానాన్ని ఉపయోగించుకుని మానవుని జీవితావసరాల ఉత్పత్తికి అవసరమయ్యే పనిముట్లను తయారుచేయడం, మానవునికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం. మానవ సమాజ చరిత్రను పరిశీలిస్తే తన ఆహారం, ఇతర అవసరాలు తీర్చుకోవడం కోసం పరికరాలను తయారు చేయడం ప్రారంభించడంతోనే అతని ప్రస్థానం ప్రారంభమైంది. ఆ పరికరాలను ఉపయో గించుకుని నిత్యావసరాలను ఉత్పత్తి చేసుకునే క్రమంలో అతను ప్రకృతి సూత్రాలను ఒక్కొక్కటిగా కనిపెట్టడం ప్రారంభించాడు. ఆ విధంగా గ్రహించిన శాస్త్రీయ విజ్ఞానం కొత్త సాంకేతికతల అభివృద్ధికి తోడ్పడుతూ వచ్చింది. కొత్త సాంకేతికతలు తిరిగి ప్రకృతి పరిశోధనలకు తోడ్పడ్డాయి. ఆ విధంగా సైన్సు- సాంకేతికతలు ఒకదానిపై మరొకటి ఆధారపడి అభివృద్ధి చెందుతూ వచ్చాయి. అదేసమయంలో వాటికి సూత్రధారి అయిన మనిషి కూడా వాటితోపాటే అభివృద్ధి చెందుతూ వచ్చాడు. ఉత్పత్తి క్రమంలో అభివృద్ధి అయ్యే ఈ శక్తులను ఉత్పత్తి శక్తులు అంటున్నారు.

కొత్త శాస్త్రీయ పరిజ్ఞానం కొత్త సాంకేతిక అవకాశాలకు దారితీస్తుంది. ఉదాహరణకు, విద్యుత్తును కనుగొనడం వల్ల విద్యుత్ బల్బులు, విద్యుత్ మోటార్లు వచ్చాయి.

కొత్త సాంకేతిక పరిజ్ఞానం కొత్త శాస్త్రీయ ఆవిష్కరణలకు దారితీస్తుంది. ఉదాహరణకు టెలిస్కోపు కనుగొనడంతో ఖగోళ విజ్ఞానం పెరిగింది.

శాస్త్ర-సాంకేతికతల పెరుగుదల వల్ల మనిషి తనకు ఎదురయ్యే అనేక సమస్యలను పరిష్కరించుకోగుతున్నాడు. ఉదాహరణకు రోడ్లు, వంతెనలు, భవనాలు, వాహనాల తయారీలో, వనరుల వెలికి తీతలో, పరిశ్రమల్లో కొత్తకొత్త ఇంజినీరింగ్ డిజైన్స్ తయారు చేయడం. ఈ డిజైన్స్ రూపొందించే క్రమంలో మనిషి నైపుణ్యాలు పెరుగుతున్నాయి.

### పారిశ్రామిక విప్లవాలు
### (Industrial Revolutions)

పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావంతో జరిగిన విప్లవాత్మక ఆవిష్కరణల వల్ల ప్రకృతి విజ్ఞాన శాస్త్రం ఉరుకులు పరుగులతో పురోగమించిందని గతంలోనే తెలుసుకున్నాం. విశాల విశ్వం దగ్గరి నుండి అణువు అంతర్భాగం వరకు శోధించి వాటి మధ్య సంబంధాలను కనుగొనే ఆవిష్కరణలన్నీ ఈ కాలంలోనే జరిగాయి.

అలాగే మానవజాతి ఆవిర్భావం దగ్గరినుండి ప్రజలు ఉత్పత్తి పరికరాలనూ, ఉత్పత్తినీ మార్పులు చేసుకుంటూ వస్తున్నప్పటికీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావం తరువాత వాటిలో వచ్చిన మార్పులు అత్యంత విప్లవాత్మకమైనవి. వస్తూత్పత్తీ, పంపిణీ..కుటీర పరిశ్రమల స్థాయి నుండి యంత్రాలను ఉపయోగించి చేసే స్థాయికి మారడాన్ని పారిశ్రామిక విప్లవాలు (Industrial Revolutions) అంటున్నారు. ఇప్పటి వరకు నాలుగు పారిశ్రామిక విప్లవాలను దాటుకుంటూ మానవాళి పయనించింది. వీటిని 1.0, 2.0, 3.0, 4.0 పారిశ్రామిక విప్లవాలని అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం అయిదో పారిశ్రామిక విప్లవం దిశగా ప్రపంచ పయనం సాగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

### పారిశ్రామిక విప్లవం 1.0 : నీటి ఆవిరి (steam) తో నడిచే పరిశ్రమలు

తొలి పారిశ్రామిక విప్లవం 1760లో ఇంగ్లండులో వస్తువుల రవాణాకు నీరు, నీటి ఆవిరి వినియోగంతో ప్రారంభమైంది. నీటి ఆవిరి గురించి మనుషులకు అంతకు ముందే తెలుసు. కానీ పారిశ్రామిక కార్యకలాపాలకు దాన్ని ఉపయో గించడం మాత్రం ఈ కాలం వరకు జరగలేదు. అందువల్ల నీటిఆవిరిని పారిశ్రామికావసరాలకు ఉపయోగించడం అనేది మానవాళి పురోగమనాన్ని ఒక పెద్ద మలుపు తిప్పింది. గాజు, గనులు, వ్యవసాయం, జౌళి పరిశ్రమలు ఈ కాలంలో పెద్ద ముందడుగు వేశాయి. ఆవిరి యంత్రాల వినియోగం వల్ల ఈ పరిశ్రమల్లో ఉత్పత్తి పెద్ద ఎత్తున పెరిగింది.

### పారిశ్రామిక విప్లవం 2.0 : సాంకేతిక విప్లవం

"సాంకేతిక విప్లవం"గా పిలవబడుతున్న రెండవ పారిశ్రామిక విప్లవం 1870లో ప్రధానంగా బ్రిటన్, అమెరికా, జర్మనీల్లో ప్రారంభమై అంతటా విస్తరించింది. ఇది విద్యుత్ వినియోగంతో వచ్చింది. విద్యుత్తుతో

నడిచే యంత్రాలు వచ్చాయి. దీనివల్ల యంత్రాల వినియోగం సులభం కావడమే కాకుండా ఖర్చుకూడా బాగా తగ్గింది. ఈ కాలంలోనే ఫోర్డ్ వంటి సంస్థలు ప్రారంభించిన అసెంబ్లీ లైన్ ఉత్పత్తి విస్తరించింది. ఆటోమొబైల్ రవాణా, విమాన యానం ఆవిష్కరించ బడ్డాయి. బొగ్గు ఇంధనం నుండి చమురు ఇంధనానికి మార్పు జరిగింది.

**పారిశ్రామిక విప్లవం 3.0 : డిజిటల్ కాలం**

1970లో మూడవ పారిశ్రామిక విప్లవం సమాచార-సాంకేతికత (ఐటి), కంప్యూటర్ సాంకేతికతల రాకతో ప్రారంభమైంది. దీన్ని ''డిజిటల్ విప్లవం'' అంటున్నాం. ఈ కాలంలోని కంప్యూటర్లు మనం ఇప్పుడు వాడే కంప్యూటర్ల కన్నా చాలా పెద్దవి అయినప్పటికీ, నేటి కంప్యూటర్లకు అవి బాటలు వేశాయి. నాటి కంప్యూటర్లు స్వయం చలిత యంత్రాలే అయినప్పటికీ వాటికి మనిషి నియంత్రణ అవసరమయ్యేది. ఈ కాలంలో ఇంటర్‌నెట్ ప్రవేశించడంతో వస్తూత్పత్తి, యాంత్రీకరణ బాగా అభివృద్ధి చెందాయి. పునరుత్పాదక ఇంధనం ప్రవేశించింది. ఈ కాలంలో అభివృద్ధి అయిన సాంకేతికతలను మనం ఇప్పటికీ పెద్ద ఎత్తున వినియోగిస్తున్నాం.

**పారిశ్రామిక విప్లవం 4.0 : స్వయం చలిత యంత్రాల కాలం**

స్వయం చలిత యంత్రాల ప్రవేశంలో ఈ విప్లవం ప్రారంభమైందని చెబుతారు. ఇది ఖచ్చితంగా ఎప్పుడు ప్రారంభమైందన్న దానిపై కొంత వివాదం ఉన్నప్పటికీ 2011లో పరిశ్రమలు ఉత్పత్తిలో మానవ ప్రమేయం లేని స్వయం చలిత యంత్రాలను ప్రవేశపెట్టడంతో ప్రారంభమైందని చాలా మంది చెబుతారు. ఈ కాలంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, 5జి టెక్నాలజీ, స్మార్ట్ మెషిన్లు, బిగ్ డేటా, పునరుత్పాదక ఇంధనాలు విరివిగా వినియోగించబడుతున్నాయి. కంప్యూటరైజ్డ్ సెన్సింగ్, స్కానింగ్, మోనిటరింగ్ సామర్థ్యాలు గల యంత్ర పరికరాలు, వాహనాలు వినియోగంలోకి వచ్చాయి. సోషల్ మీడియాతో సమాచార విస్ఫోటనం సంభవించింది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్-ఎఐ) మరమనుషులు (రోబోట్లు) మానవ కార్యకలాపాల్లోకి ప్రవేశించి విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి.

**పారిశ్రామిక విప్లవం 5.0 : రానున్నది**

మనుషులతోపాటు లేక మనుషుల కింద కృత్రిమ మేథతో పనిచేసే రోబోట్లు అన్ని రంగాల్లో పనిచేసే కాలం. ఇళ్లల్లో, మార్కెట్‌లో, పరిశ్రమల్లో...అన్ని చోట్లా ఎఐ ఆధారిత రోబోట్లు పనిచేస్తాయి. ఉత్పత్తిలో మనిషి ప్రమేయం చాలా వరకు తగ్గిపోతుంది. పునరుత్పాదక ఇంధనం ప్రధాన ఇంధనంగా ఉంటుంది. 6జి టెక్నాలజీ, 3డి ప్రింటింగ్ ఉత్పత్తి విధానం, వైద్యరంగంలో నానో చిప్స్ వినియోగం, క్వాంటమ్ కంప్యూటింగ్ విస్తారంగా వాడుకలోకి వస్తాయని చెబుతున్నారు.

> **❝ మొత్తంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థతోపాటే పుట్టిపెరిగిన ఆధునిక సైన్సు పెట్టుబడిదారీ విప్లవాన్ని సుసాధ్యం చేసింది. మానవ జీవితంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. ముమ్ముందు మరిన్ని మార్పులు తెచ్చే అవకాశాలు కలిగి ఉంది. మానవుని విజ్ఞాన నేత్రం నేడు పదార్థపు చిట్టచివరి లోతుల నుండి విశ్వపు చిట్టచివరి అంచుల వరకు చేరగలుగుతోంది. మానవ జీవితపు ప్రతి క్షణం, ప్రతి అడుగూ సైన్సుతో ముడిపడి సాగుతోంది. ❞**

**అవకాశాలు-అవరోధాలు**

మొత్తంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థతోపాటే పుట్టిపెరిగిన ఆధునిక సైన్సు పెట్టుబడిదారీ విప్లవాన్ని సుసాధ్యం చేసింది. మానవ జీవితంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. ముమ్ముందు మరిన్ని మార్పులు తెచ్చే అవకాశాలు కలిగి ఉంది. మానవుని విజ్ఞాన నేత్రం నేడు పదార్థపు చిట్టచివరి లోతుల నుండి విశ్వపు చిట్టచివరి అంచుల వరకు చేరగలుగుతోంది. మానవ జీవితపు ప్రతి క్షణం, ప్రతి అడుగూ సైన్సుతో ముడిపడి సాగుతోంది.

సైన్స్-సాంకేతికతలు ఇంతగా పెరుగుతున్న నేటి సమాజంలో ఒక విచిత్రమైన వైరుధ్యం నెలకొని ఉంది. ఒకవైపు శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం ఉరకలు పరుగులతో అభివృద్ధి చెందుతోంది. మరోవైపు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం లేక శాస్త్రీయ ఆలోచనా విధానం తగ్గుతోంది. అన్ని దేశాల్లోనూ మితవాద భావజాలం, అశాస్త్రీయ ఆలోచనా విధానంలో పాలక వర్గాలు కూరుకుపోతున్నాయి, ప్రజల్లో వాటిని పెంచిపోషిస్తున్నాయి.

మన దేశంలో బాబాలు, సాధువులు, అమ్మలను కొలవడం, మూఢనమ్మకాలు, టివీలలో మత బోధనలు, అశాస్త్రీయ యాడ్స్, దెయ్యాలు మూఢ నమ్మకాలను సమర్ధించే సినిమాలు, టివి కార్యక్రమాలు, అశాస్త్రీయ వైద్యం, వాస్తు.... అన్నిరకాల మూఢవిశ్వాసాలు క్రమంగా పెరుగుతున్నాయి. మామూలు ప్రజలే కాదు, సైన్సు చదువుకున్నవారు, శాస్త్రవేత్తలు కూడా ఎందుకు ఈ అశాస్త్రీయ భావాలను ప్రశ్నించకుండా ఆమోదిస్తున్నారు? ఆచరిస్తున్నారు?

తెలుగునాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డ్రైనేజీ స్కీములేక
డేంజరుగా మారుతోంది

అని గజ్జెల మల్లారెడ్డి కవిత్వం చెప్పారు. కానీ ఆ అభ్యుదయ కవే కాలం గడిచే సరికి మూఢనమ్మకాల బారిన పడ్డారు. కుల, మత నమ్మకాలు, మూఢనమ్మకాలకు దూరంగా ఉన్న కుటుంబాల్లో తరాలు మారుతున్న కొద్దీ అశాస్త్రీయ నమ్మకాలు పెరుగుతున్న వైనాన్ని వారి పెళ్లిళ్లు, క్రతువులు, ఇతర జీవన ఆచారాల్లో చూస్తున్నాం. ఎందుకిలా జరుగుతోంది?

హేతువాదం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం అనేవి సమాజాన్ని ముందుకు తీసుకుపోయే ఆలోచనా ధోరణులు. ఒకనాడు ఫ్యూడల్ సమాజంపై తిరుగుబాటుకు ఈ ఆలోచనలనే ఆధునిక బూర్జువావర్గం సాధనాలుగా చేసుకుంది. ఫ్రెంచ్ విప్లవ కాలంలో క్యాథలిక్కు మతాచారాలను ఫ్రీ రాడికల్స్ దునుమాడారు. దైవ భావాన్నే తిరస్కరించారు. నిజానికి విశ్వాన్ని వర్ణించడానికి ఆదిమానవులకు దేవుడు అవసరమైనాడు. కానీ అభివృద్ధి చెందిన సైన్సు.. విశ్వసృష్టిలో దేవుని ప్రమేయం లేదని తేల్చేసింది. ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త లాప్లాస్ తను ఖగోళాన్ని గురించి చేసిన అధ్యయనంలో దేవుని ప్రమేయం ఎక్కడా రాలేదని చెప్పాడు. ఖగోళశాస్త్రమే కాదు, నేడు జన్యుశాస్త్రం, మానవ విజ్ఞాన శాస్త్రం, మెదడుకు సంబంధించిన పరిశోధనలు ఇవేవీ కూడా దేవుని ప్రమేయం లేకుండానే జరుగుతున్నాయి.

**"సామాజిక ఆర్థిక చట్రంలో నెలకొన్న పరిస్థితులు అశాస్త్రీయ భావాలు పెరగడానికి మరో ప్రాతిపదికను సృష్టిస్తున్నాయి. మానవుల "సామాజిక, రాజకీయ, వైజ్ఞానిక జీవితాలపై వారి భౌతిక జీవితావసరాల ఉత్పత్తి విధానం విధిగా ఆధిపత్యం వహిస్తుంది" అని కారల్ మార్క్స్ చెప్పాడు. అంటే నేటి మన ప్రజల వైజ్ఞానిక జీవితంలో వస్తున్న మార్పులకు ప్రాతిపదిక మన సమాజపు ఆర్థిక జీవనంలో అంటే ఆస్తి, సంపదల సృష్టి, పంపిణీ విధానంలో ఉందన్నమాట."**

కాబట్టి శాస్త్రవేత్తలకు తెలుసు దేవునితో వారికీ, వారి పరిశోధనలకూ సంబంధం లేదని. అయినా వారు దేవుని నమ్ముతున్నారు. సమాజం నడవడానికీ, ప్రజల్లో నీతినియమాలు స్థాపించడానికీ దేవుడు అవసరం అంటారు. అందువల్ల ఎంత గొప్ప శాస్త్రవేత్త అయినా, ఎంత విజ్ఞానవంతుడైనా అతని మెదడు లోనుండి దేవుడు అనే భావం చెరిగిపోక పోవడమే కాదు అనేక రకాల మూఢనమ్మకాలతో కలగలిసి మరింత వికారంగా తయారవుతోంది. పామరులు, చదువులేని వారైతే సరే... బాగా నాగరీకులమనుకున్న వారే బాబాలు, స్వాములకు సాష్టాంగపడుతున్నారు. సత్యసాయిబాబా చనిపోయిన తరువాత బాగా చదువుకున్న వారే బాబాగారు మూడో రోజు లేస్తారు చూడండి, ఆయన సమాధిలోనుండే మాట్లాడతాడు, అద్భుతాలు చేస్తాడు అన్నారు. కానీ అలా ఏం జరగలేదు. శకునాలు, అదృష్టాలు, దిష్టులు, జ్యోతిష్యాలు, వాస్తులు వగైరావగైరా మూఢనమ్మకాలు ఈ 'విజ్ఞానుల్లోనే' ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నిత్యజీవన సమరంలో సతమతమవుతున్న శ్రామికునికన్నా 'విజ్ఞానులైన' ఈ ఉన్నతవర్గాల్లోనే ఈ నమ్మకాలూ, మూఢాచారాలు ఎక్కువగా ఉన్నాయి, పెరుగుతున్నాయి, అవి మొత్తం సమాజం మీద రుద్దబడు తున్నాయి. ఎందుకన్నది ప్రశ్న.

సమాజంలో శాస్త్రీయ దృక్పథం ఉండడానికీ లేక కొరవడడానికీ రెండు ప్రాతిపదికలున్నాయి. 1. మన విజ్ఞానానికి ఉన్న పరిమితులు 2. సామాజిక పరిస్థితులు.

**మొదటిది.** మన విజ్ఞానానికి ఉన్న పరిమితులేమిటి? ఆదిమానవుడు ప్రకృతిపై పనిచేయడం ద్వారా దానిలోని సూత్రాలను కనిపెట్టగలిగాడు. ఆ విధంగా అతను విజ్ఞానాన్ని విస్తరించుకుంటూ ఆధునిక మానవుడైనాడు. విజ్ఞానం ఎంత విస్తరించినా మానవుని మెదడుకు అందని చీకటి ప్రాంతం చాలా ఉంది. విశ్వంలో 94 శాతం డార్క్ మేటర్ ఉంది. దాని గురించి మనకేం తెలియదు. 'తెలిసిన' విశ్వంలో కూడా మనకు తెలియని విషయాలు చాలా చాలా ఉన్నాయి. అందువల్ల ఈ తెలియని చీకటి ప్రాంతం "విశ్వాసాలు" పెరగడానికి ఒక ప్రాతిపదిక.

**రెండవది:** సామాజిక ఆర్థిక చట్రంలో నెలకొన్న పరిస్థితులు అశాస్త్రీయ భావాలు పెరగడానికి మరో ప్రాతిపదికను సృష్టిస్తున్నాయి. మానవుల "సామాజిక, రాజకీయ, వైజ్ఞానిక జీవితాలపై వారి భౌతిక జీవితావసరాల ఉత్పత్తి విధానం విధిగా ఆధిపత్యం వహిస్తుంది" అని కారల్ మార్క్స్ చెప్పాడు. అంటే నేటి మన ప్రజల వైజ్ఞానిక జీవితంలో వస్తున్న మార్పులకు ప్రాతిపదిక మన సమాజపు ఆర్థిక జీవనంలో అంటే ఆస్తి, సంపదల సృష్టి, పంపిణీ విధానంలో ఉందన్నమాట.

మన సమాజంలో కొందరు ఎంత కష్టపడినా వారి వద్ద పేదరికం పోగుపడుతోంది, మరికొందరు కష్టపడకపోయినా వారివద్ద సంపద పోగుపడుతోంది. పోగుపడిన సంపద కొందరివద్ద నుండి మళ్లీ ఇంతలోనే మాయమైపోతోంది. తెలియకుండానే వస్తున్న సంపద తెలియకుండానే వెళ్లిపోవడానికి కారణమేమిటి? తాము ఏ తప్పూ చేయకపోయినా కొన్నిసార్లు సంపద కోల్పోతున్నారు. ఏ ఘనకార్యం చేయకపోయినా సంపద అకస్మాత్తుగా రావడం చూస్తున్నారు. అందువల్ల ఏదో తెలియని శక్తి దీన్ని నడిపిస్తోందన్న భావనకు ఆధునిక మానవుడు గురవుతున్నాడు. దాన్ని అదృష్టమనో, మరొకటనో అనుకుంటున్నాడు.

యాంత్రీకరణ పెరిగి ఉత్పత్తి బాగా అభివృద్ధి చెందినాక సంపద ఎలా పోగవుతోంది, ఎలా పంపిణీ జరుగుతోందో వ్యక్తులకు తెలిసే అవకాశాలు మరింత తగ్గిపోతున్నాయి. ఆస్తి కార్పొరేట్ సంస్థల్లో నైరూప్య గుణాన్ని సంతరించుకుంటోంది. స్టాక్స్, బాండ్లు, టైటిల్ డీడ్‌లుగా మారి స్టాక్ ఎక్స్ఛేంజ్ సుడిగుండంలోకి విసిరివేయబడుతోంది. అక్కడ ఆస్తి కొనుగోలు, అమ్మకాలు ఒకరి మొహాలు ఒకరు చూసుకోకుండానే జరిగిపోతున్నాయి. చివరికి అది తనదగ్గరికి ఎక్కడినుండి వచ్చిందో ఎక్కడికి పోతోందో కూడా తెలియదు. చేతులు మారుతోంది. స్టాక్ ఎక్స్ఛేంజిలో కొందరికి నష్టం వస్తోంది. కొందరికి లాభాలొస్తున్నాయి. స్టాక్‌లు ఎందుకు నష్టపోతున్నాయో, ఎందుకు లాభపడుతున్నాయో తెలియదు. అంతా ఒక జూదం లాగా సాగిపోతోంది. దీని గురించి ప్రఖ్యాత మార్క్సిస్టు సామాజిక వేత్త పాల్ లాఫార్గ్ ఇలా అంటాడు: "ఆధునిక ఆర్థికాభివృద్ధి మొత్తం పెట్టుబడిదారీ సమాజాన్ని ఒక పెద్ద అంతర్జాతీయ జూద గృహంగా మార్చేసింది. ఇక్కడ పెట్టుబడిదారుడు నిత్యం పెట్టుబడిని గెలుచుకుంటుంటాడు, ఓడిపోతుంటాడు. ఇదంతా కూడా ఎవరూ ఊహించని అదృశ్య ఘటనల వల్ల సంభవిస్తుంటాయి. ఇదంతా కూడా అదృష్టం మీద ఆధారపడి నడుస్తుందని వారు భావిస్తుంటారు. ఒక జూద గృహంలో మాదిరిగానే అదృశ్యశక్తి పెట్టుబడిదారీ సమాజంలో తచ్చాడు తుంటుంది."

పేకాడేవాడు ప్రతి ముక్కకూ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటాడు. సెంటిమెంట్లు, నమ్మకాలు, శకునాలు అతన్ని ముక్కముక్కకీ నడుపుతుంటాయి. మార్కెట్లో పెట్టుబడి పెట్టిన వారు కూడా ఎప్పుడేం జరుగుతుందో తెలియని అయోమయంలో పేకాట రాయుళ్ల మాదిరి సెంటిమెంట్లు, నమ్మకాలు, శకునాలకు లోనవుతారు. అటువంటి వారు హేతుదృక్పథాన్ని పూర్తిగా వదిలేసి సంపూర్ణ మూఢనమ్మకాల మనుషులుగా మారుతారు.

ఆదిమానవుడు ప్రకృతి శక్తుల గమనం గురించి తెలియక వాటిముందు ఎంత అయోమయంగా నిలబడ్డాడో నేటి సమాజంలో సంపదను నడిపించే ఈ అదృశ్యశక్తి ముందు మనిషి అంతే అయోమయంగా నిలబడ్డాడు. తను సృష్టించుకున్న విలువలేని, లేక అత్యంత విలువ తక్కువ కాగితం ముక్క (రూపాయి) నాగరిక సమాజాన్ని నడుపుతోంది. తిండి, ఇల్లు, గుడ్డ, వినోదం... అన్నిటినీ ఇస్తోంది. దాని గమనం అదృశ్య శక్తులతో నడుస్తోంది. ఇదంతా మనిషిలో ఒక రకమైన మార్మికతను పెంచిపోషిస్తోంది. అందునా ఆర్థిక సంక్షోభ కాలాల్లో అయితే తమ చేతుల్లో లేని అదృశ్య శక్తులు విచ్చలవిడిగా వ్యవహరిస్తాయి. మొత్తం మీద ఆధునిక జీవనంలో మనిషి అంతులేని

> **మనిషి ప్రకృతి శక్తులపై నిత్యం విజయా లు సాధిస్తుం టాడు గనుక అనాగరికులకైనా రేపు తన సమస్యలన్నిటికీ పరిష్కారం దొరుకు తుందన్న ఆశ ఉంటుంది. కాని సామాజిక శక్తులముందు మోకరిల్లిన ఆధునిక మానవు నికి ఆ ఆశకూడా లేనప్పుడు ఈ శక్తులనుండి విముక్తిచేసే మార్గం అతనికి దేవుళ్లూ, బాబాలు, స్వాములు, మూఢ విశ్వాసాల్లో మినహా మరెక్కడా కనిపించదు.**

వైచిత్రుల అగాథంలో కూరుకుపోతున్నాడు. విజ్ఞానశాస్త్ర కృషి వల్ల ప్రకృతి శక్తులపై అదుపు సాధించిన మానవుడు, సామాజిక శక్తులమీద అదుపు సాధించలేకపోతున్నాడు. ఇక్కడ ఆర్థిక శక్తులే సమాజాన్ని, రాజకీయాలను అన్నిటినీ నడుపుతాయి. అవి అతన్ని ఎంతగా భయపెడతాయంటే ఆదిమానవుడు ప్రకృతి శక్తులను ప్రసన్నం చేసుకోడానికి చెట్టూపుట్టా ముందు మోకరిల్లినట్లు ఆధునిక మానవుడు ఈ సామాజిక అగోచర శక్తిని ప్రసన్నం చేసుకోడానికి దేవుళ్లూ, దెయ్యాలు, బాబాలు, స్వాములు అందరినీ ఆరాధిస్తాడు. చెట్లకీ, పుట్టలకీ, రాళ్లకూ రప్పలకూ మొక్కుతాడు. ఆదిమానవుడు ప్రకృతిని ప్రసన్నం చేసుకో డానికి రకరకాల క్రతువులను అశ్రయించినట్లు, ఆధునిక మానవుడు అనేక రకాల క్రతువులు, మూఢనమ్మకాలు, శకునాలు, జ్యోతిష్యాలు, సెంటిమెంట్లను ఆశ్రయిస్తున్నాడు. ఆదిమాన వునికి మంచి ఆత్మలు (దేవతలు), చెడ్డ ఆత్మలు (దెయ్యాలు) మాదిరిగానే ఆధునిక మానవునికి సామాజిక శక్తులు దెయ్యాలు, దేవతలు మాది రిగా కనిపిస్తున్నాయి.

మనిషి ప్రకృతి శక్తులపై నిత్యం విజయా లు సాధిస్తుంటాడు గనుక అనాగరికులకైనా రేపు తన సమస్యలన్నిటికీ పరిష్కారం దొరుకు తుందన్న ఆశ ఉంటుంది. కాని సామాజిక శక్తులముందు మోకరిల్లిన ఆధునిక మానవు నికి ఆ ఆశకూడా లేనప్పుడు ఈ శక్తులనుండి విముక్తిచేసే మార్గం అతనికి దేవుళ్లూ, బాబాలు, స్వాములు, మూఢ విశ్వసాల్లో మినహా మరెక్క డా కనిపించదు.

అందువల్ల ఈ నమ్మకాలు, మూఢ విశ్వా సాలు, అహేతుక భావజాలం సామాజిక వాతా వరణం నుండి ఉద్భవించాయి. కనుక సమాజా న్ని అధ్యయనం చేసి, ఈ విశ్వాసాలకు కారణ మైన సామాజిక వ్యవస్థ మూలాన్ని సంస్కరించి నప్పుడే శాస్త్రీయ దృక్పథం పెరుగుతుంది.

యూరప్‌లో ఫ్యూడలిజంపై జరిగిన పోరాటం సందర్భంగా క్యాథలిక్కు ఛాందస భావాలను ప్రతిఘటించడం జరిగింది. హేతువాదం, లౌకిక వాదం, శాస్త్రీయ ఆలోచ నలకు ఆదరణ పెరిగింది. కాని పెట్టుబడిదారీ వ్యవస్థ నిలదొక్కుకున్న తరువాత ఆ వ్యవస్థలోని అహేతుకత సమాజంలోని హేతుబద్ధ ఆలోచనలకు తిలోదకాలిచ్చింది. మన దేశం లో కూడా స్వాతంత్ర్యోద్యమం జరుగు తున్నప్పుడు సమాజంలో రాడికల్ భావాలకు ఆదరణ పెరిగింది. కాని స్వాతంత్ర వచ్చాక పాలకులు ఆ విలువలకు తిలోదకాలిస్తున్నారు. అహేతుక, మతతత్వ, అశాస్త్రీయ భావాలు పెరుగుతున్నాయి. ప్రపంచీకరణ యుగంలో ఇవి మరింత వెర్రితలలు వేస్తున్నాయి.

### ప్రపంచీకరణ– అశాస్త్రీయ దృక్పథం పెరుగుదల

ఆధునిక మనిషికి అర్థంకాని అగోచర సాంఘిక శక్తులు ప్రపంచీకరణ యుగంలో మరింత విజృంభించాయి. ఆర్థిక నిర్వహణపై ప్రభుత్వ నియంత్రణ తగ్గుతున్న కొద్దీ స్వేచ్ఛా మార్కెట్ శక్తులు విజృంభిస్తున్నాయి. పెట్టుబడికి ప్రపంచ వ్యాపితంగా స్వేచ్ఛ లభించింది. పెట్టుబడి ఇప్పుడు ఏ దేశంలోని స్టాక్ మార్కెట్‌నుండైనా క్షణాల్లో మాయమైపోయి మరోదేశానికి పారిపోవచ్చు. అందువల్ల పెట్టుబడిదారుల వద్ద పోగైన సంపద ఏ నాటికన్నా నేడు చంచలంగా ఉంది. కళ్లముందే తోటివారివద్ద కోట్ల సంపద పోగవుతుంటే, రాత్రికిరాత్రి మార్కెట్ పతనాలతో. ఆర్థిక దివాళాలతో కొందరు దివాళా ఎత్తుతున్నారు. ఇదంతా ప్రజల్లో మరింత అభద్రతనూ, అశాంతినీ పెంచి పోషిస్తోంది. కాబట్టి ప్రపంచీకరణ యుగంలో దేవుడు, బాబాలు, స్వాములు వారి మాయలూ, మంత్రాలూ మరింత అవసరమైనాయి. అందుకనే ఈ కాలంలో అన్ని దేశాల్లోనూ మతఛాందసత్వం, మూఢ విశ్వాసాలు పెరిగాయి.

విజ్ఞాన శాస్త్రాలతో ఈ ఛాందసత్వానికి వ్యతిరేకంగా పోరాడితే సరిపోతుందని కొందరు భావిస్తున్నారు. కాని ఆ పని జరిగేది కాదని చరిత్ర మనకు చెబుతోంది. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థే తన అవసరం కొద్దీ శాస్త్ర–సాంకేతిక రంగాలను ప్రోత్సహిస్తోంది. సైంటిస్టులు ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలను సరిగ్గానే పరిశోధన చేసి ఫలితాలు అందిస్తున్నారు. కాని పెట్టుబడిదారీ వర్గం సామాజిక రంగంలో మాత్రం శాస్త్రవేత్తలు ఈ పనిచేయడానికి అనుమతించడం లేదు. అలా చేసినప్పుడు ఈ మూఢవిశ్వాసాలు, నమ్మకాలు పోతాయి. కాని ఆ నమ్మకాలు ఉండడం పెట్టుబడిదారీ వర్గానికి అవసరం గనుకనే అది పనిగట్టుకుని సామాజిక శాస్త్రాలనూ, సామాజిక పరిశోధనలనూ నిర్లక్ష్యం చేస్తోంది, వక్రీకరిస్తోంది. పుక్కిటి పురాణాలను చరిత్రగానూ, మూఢ విశ్వాసాలను సైన్సుగానూ ప్రచారం చేసే ధోరణి ఈ రోజు పెరిగిపోవడానికి కారణం ఇదే. ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలు కూడా ఈ మూఢవిశ్వాసాలు పెంచడానికే ఉపయోగ పడుతున్నాయి.

### వర్గ సమాజం – సైన్సు

అభివృద్ధి చెందిన శాస్త్ర–సాంకేతిక విజ్ఞానం ఈ రోజు మానవుడు తనచుట్టూ ఉన్న పర్యావరణాన్ని కాపాడుకుంటూ సుఖవం తంగా, ఆరోగ్యవంతంగా జీవించడానికి కావలసిన అన్ని రకాల అవకాశాలనూ సృష్టించింది. ఈ రోజు ప్రపంచంలోని 800


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

> “సైన్సు లౌకికమైంది. దానిలో మతజోక్యం ఉండకూడదు. చరిత్ర మొత్తంలోనూ మత ఛాందసత్వం, పిడివాదం సైన్సు అభివృద్ధికి అవరోధాలు కల్పిస్తూనే వచ్చాయి. నేటి ఆధునిక సమాజంలో కూడా మతతత్వం సైన్సు అభివృద్ధికి అవరోధంగా మారింది. మన దేశం లో హిందూత్వ సిద్ధాంతం, ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇస్లామిక్ ఛాందసవాదం మరోవైపు ఇతర మతతత్వ సిద్ధాంతాలు సైన్సు అభివృద్ధిని ఆటంక పరుస్తూనే ఉన్నాయి.”

కోట్ల మందికి అవసరమైనంత ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేయగల వ్యవసాయ పరిజ్ఞానం ఉంది. వారందరికీ కావలసినన్ని నిత్యావసర వస్తువులు ఉత్పత్తి చేయగల సాంకేతిక పరిజ్ఞానం ఉంది. వైద్య రంగం ఎంతగా అభివృద్ధి చెందిందంటే మానవుని జన్యువులను రిపేరు చేసి వంశపారంపర్య జబ్బులకు సమాధానాలు చెప్పగల స్థితి ఉంది. మందులు శరీరమంతటికీ కాకుండా ఏ అవయవానికి లేదా కణజాలానికి అవసరమైతే ఆ అవయవానికి లేక కణాలకు మాత్రమే అందజేసే నానో టెక్నాలజీ అభివృద్ధి అయింది. మనుషుల స్థానంలో కృత్రిమ మేథస్సు ఆధారిత రోబోట్లు వస్తున్నందున మానవునికి శ్రమ చేసే కాలం తగ్గి విశ్రాంతి కాలం గణనీయంగా పెరుగుతుంది. అందువల్ల అతను జీవినం కోసం నిర్బంధ శ్రమ చేయడానికి బదులు తనకు తోచిన పనిని సృజనాత్మకంగా చేయడానికి విజ్ఞానశాస్త్రం అవకాశం కల్పించింది.

కానీ మానవుడు నేటి సమాజంలో ఈ అవకాశాలను ఉపయోగించుకునే పరిస్థితి మాత్రం లేదు. వ్యవసాయరంగంలో శాస్త్రీయ విజయాలు అందరికీ ఆహారం సమకూర్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రపంచంలో 200 కోట్ల మంది ప్రజలు నేటికీ తీవ్రమైన పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. ఇందులో అత్యధిక శాతం ప్రజలు మన దేశంలో ఉన్నారు. అనేక ఆఫ్రికా దేశాలు కరువుకాట కాలంతో అలమటిస్తున్నాయి. వైద్య శాస్త్రం ఇంతగా అభివృద్ధి చెందినా మెజారిటీ ప్రజలకు వైద్యం అందనిద్రాక్ష అయింది. అందరికీ అన్ని రకాల వస్తువులు అందించగల స్థితిలో శాస్త్ర-సాంకేతిక అభివృద్ధి ఉన్నప్పటికీ జనాభాలో మెజారిటీ నేటికీ కొరతలతో బాధపడుతున్నారు.

శాస్త్ర-సాంకేతికాభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందకుండా నేటి సమాజంలో అనేక అవరోధాలు నెలకొంటున్నాయి. పేటెంట్ల రూపంలో శాస్త్ర-సాంకేతిక రంగంపై కొద్దిమందికి ఆధిపత్యం ఏర్పడింది. మానవ వనరులను ప్రజల అవసరాలకు కాకుండా యుద్ధావసరాలకు మళ్లించబడుతోంది.

సైన్సు లౌకికమైంది. దానిలో మతజోక్యం ఉండకూడదు. చరిత్ర మొత్తంలోనూ మత ఛాందసత్వం, పిడివాదం సైన్సు అభివృద్ధికి అవరోధాలు కల్పిస్తూనే వచ్చాయి. నేటి ఆధునిక సమాజంలో కూడా మతతత్వం సైన్సు అభివృద్ధికి అవరోధంగా మారింది. మన దేశం లో హిందూత్వ సిద్ధాంతం, ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇస్లామిక్ ఛాందసవాదం మరోవైపు ఇతర మతతత్వ సిద్ధాంతాలు సైన్సు అభివృద్ధిని ఆటంక పరుస్తూనే ఉన్నాయి. అందుకే సైన్సు అభివృద్ధి కావాలంటే లౌకికతత్వాన్ని అనుసరించడం తప్పని సరి.

ఇతర అన్ని రంగాల మాదిరిగానే సైన్సు కూడా వర్గ సమాజంలో ప్రజలందరికీ కాకుండా పాలక వర్గాలకు అనుకూలంగా పనిచేస్తుంది. సైన్సు-టెక్నాలజీ అనేది మానవుల ఉమ్మడి ఆస్తి. కాని ఆదిమ జమాజం వర్గాలుగా విడిపోవడంతోనే అది కొద్ది మంది ఆధిపత్య వర్గాల చేతుల్లోకి వెళ్లిపోయింది. బానిస సమాజంలోనూ, ఫ్యూడల్ సమాజం లోనూ ప్రధాన ఉత్పత్తి వనరు అయిన భూమి అధిపత్యవర్గాల చేతుల్లో ఉండడం వల్ల సైన్సు మీద కూడా వారిదే అధిపత్యం అయింది. పెట్టుబడిదారీ సమాజంలో అది పెట్టుబడి దారుల గుత్త సొత్తుగా మారింది.

అందువల్ల ఆధునిక కాలంలో సైన్సు సామాజిక అభ్యుదయానికి మాత్రమే కాదు దేశాల మీద అణచివేతకూ, యుద్ధాలకూ, విధ్వంసానికీ, ప్రజల మీద ఆధిపత్యానికీ, పీడనకూ, నిరుద్యోగానికీ, దారిద్ర్యానికీ కూడా సాధనమైంది. ఇది చాలా విచిత్రంగా కనిపించవచ్చు. కాని ఈ వైరుధ్యం నేడు మనముందున్న వాస్తవం. అందుకే ఈనాడు శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంత అభివృద్ధి జరుగుతుందో అంతగా వివాదం కూడా చెలరేగుతోంది. అంతగా దానివల్ల ప్రమాదం కూడా ఎదురవుతోంది. ప్రతి నూతన ఆవిష్కరణా మానవాళి ముందు ఒక ఆశా సౌధాన్ని సాక్షాత్కరింపచేస్తున్నది. అదే సమయంలో భయంకరమైన దుస్స్వప్నాలకు కూడా అదే కారణమవుతోంది. ఈ పరిస్థితి 20వ శతాబ్దపు విజ్ఞాన శాస్త్ర చరిత్ర అంతా కనిపించింది. విమానాలు, అణుబాంబులు, రాకెట్లు, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, జన్యుపరిశోధన అన్నీ కూడా ఒకవైపు అభివృద్ధికి ఆస్కారమిస్తూనే మరోవైపు విధ్వంసానికి, అణచివేతకూ, దారిద్ర్యానికి కూడా కారణమైనాయి. ఈ వైరుధ్యమే 21వ శతాబ్దంలో కూడా మనకు కనిపిస్తుంది. ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్ వంటి అధునాతన ఆవిష్కరణల చుట్టూ చెలరేగుతున్న వివాదాలు, వ్యక్తమవుతున్న భయాందోళనలు ఈ విషయాన్నే చెబుతున్నాయి. అన్నిటికీ మించి ఆధునిక పరిశ్రమలు, వాహనాలు, పశు పెంపక శాలల నుండి వెలువడే ఉద్గారాల (ఎమిషన్స్) వల్ల భూ తాపం పెరిగి ప్రళయ సమానమైన ఘటనలు సంభవిస్తున్నాయి. మానవాళి మనుగడే ప్రమాదంలో పడింది.

ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించుకుని సైన్సు ముందుకు పయనించాలంటే సైన్సులో కాదు సామాజిక వ్యవస్థలోనే విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉంది. మొదటిది, సైన్సు కొద్ది మంది కార్పొరేట్ గుత్త సంస్థల ఆధిపత్యం నుండి ప్రజల ఆధిపత్యం లోకి రావాలి. రెండవది, సైన్సు-సాంకేతికతను యుద్ధావసరాల కోసం మళ్లించకుండా నివారించాలి. ఈ రెండూ జరగాలంటే ఉత్పత్తి సాధనాలపై కొద్దిమందికి అధిపత్యం కల్పిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థ పోయి ఉత్పత్తి సాధనా లను సామాజికం గావించే సోషలిస్టు వ్యవస్థ రావాలి. అప్పుడు సైన్సు ఒకనాడు మానవాళి శైశవ దశలో ఎలాగైతే ఉమ్మడి ప్రయోజనాలకు ఉపయోగపడిందో అలాగే ఈ కొత్త సమాజంలో సైన్సు మానవాళి దోపిడీ సాధనంగా కాకుండా వారి ఉమ్మడి ప్రయోజనాల కోసం పనిచేస్తుంది. అప్పుడు సైన్సు పట్ల వివాదాలు సమసిపోతాయి, భయాలు తొలగిపోతాయి అది మానవాళి సంపూర్ణ వికాసానికి సాధనంగా మారుతుంది.

❃

# కార్పొరేట్ దోపిడికి ఆటంకాలను తొలగించటానికే జమిలి ఎన్నికలు

**ఎ.కోటిరెడ్డి**



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంటు శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టింది. బిల్లుకు ప్రతిపక్షాల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురుకావటంతో గత్యంతరం లేని పరిస్థితిలో ప్రభుత్వం బిల్లును జాయింటు పార్లమెంటరి కమిటికి పంపించింది. జమిలి ఎన్నికలు ఎవరికి ఉపయోగం అన్నది పరిశీలించాలి. ఈ బిల్లు చట్టమైతే ప్రజలకు ఇస్తున్న రాయితీలను రద్దు చేయటం, ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్‌లకు అప్పగించటం ప్రభుత్వానికి సులభవౌతుంది. ప్రజాస్వామ్యానికి, సమాఖ్యవాదానికి పెద్ద దెబ్బ తగులుతుంది. కార్మికులు, కర్షకులు చేసే ఉద్యమాలు, పోరాటాలను తేలికగా అణచి వేయటానికి, ప్రజల ఆకాంక్షలను వమ్ముచేయటానికి ప్రభుత్వాలకు వీలు కలుగుతుంది. రాష్ట్ర శాసనసభల స్వతంత్ర ఉనికికి అవకాశం లేకుండాపోతుంది. జిల్లా, మండల పరిషత్‌లు, మునిసిపాలిటీలు, గ్రామ పంచాయితీలకు ఈపాటి స్వతంత్రత కూడా ఉండదు. ముఖ్యంగా పార్లమెంటు నుండి పంచాయితీల వరకు దేశంలోని అన్ని ప్రజాస్వామ్య సంస్థలకు ఐదు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే ఎన్నికలు జరుగుతాయి. కాబట్టి వివిధ సమయాలలో రాష్ట్రాల శాసనసభలకు జరిగే ఎన్నికలలో ప్రజలు ప్రతికూలమైన తీర్పులు ఇస్తారనే భయం లేకుండా ప్రజల భూములను, ఇతర సంపదలను దేశ, విదేశీ బడా పెట్టుబడిదారి సంస్థలు, కార్పొరేట్లకు కట్టబెట్టవచ్చు. ప్రజా వ్యతిరేకతను గురించి ఎటువంటి భయం లేకుండా కార్పొరేట్ అనుకూల విధానాలను నల్లేరు మీద నడకలా అమలు చేయవచ్చు. పేద ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేయనూవచ్చు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్వాతంత్ర్యానంతరం ఏర్పాటు చేసిన సంస్థలు, వ్యవస్థలను ధ్వంసం చేయటం వేగం పుంజుకుంటుంది. కార్పొరేట్లు, హిందుత్వవాదుల ఎజెండాను మరింత వేగంగా అమలు చేస్తారు.

ఈనాడు మనదేశంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పార్లమెంటు నుండి పంచాయితీల వరకు ఎన్నికలు జరుగుతున్నాయి. పంచాయితీ, మునిసిపాలిటి, ఇతర స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపటంలో కొన్నిసార్లు తాత్సారం జరిగినా చట్టసభలైన పార్లమెంటు, అసెంబ్లిలకు ఐదు సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా ఎన్నికలు జరుగుతున్నాయి. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న తర్వాత మొదటగా 1952లో పార్లమెంటు, అన్ని రాష్ట్రాల అసెంబ్లిలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. కాని ఆ తర్వాత వచ్చిన అనేక పరిణామాల రీత్యా కొన్ని రాష్ట్రాలలో శాసనసభలు ఐదు సంవత్సరాల కాల పరిమితి వరకు కొనసాగలేక మధ్యలోనే రద్దు అవుతున్నాయి. 1970, 80 దశాబ్దాలలో పార్లమెంటును కూడా ఐదు సంవత్సరాల కాల పరిమితికి ముందే రద్దుచేసి, ఎన్నికలు జరపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పార్లమెంటు లేదా ఏ రాష్ట్ర అసెంబ్లి అయినా ఐదు సంవత్సరాల కాల పరిమితిలోగా రద్దయితే ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం ఆరు మాసాలలోగా తిరిగి ఎన్నికలు జరిపి, నూతన పార్లమెంటు లేదా శాసనసభలను ఎన్నుకోవాలి.

కాబట్టి మన ప్రజాస్వామిక వ్యవస్థలో ఎన్నికైన రాష్ట్రాల అసెంబ్లీలు, పార్లమెంటుకు ఎపుడు ఐదు సంవత్సరాల కాలం పూర్తయితే అపుడు ఎన్నికలు జరుగుతున్నాయి మినహా పార్లమెంటు, అసెంబ్లిలు అన్నింటికీ ఏకకాలంలో ఎన్నికలు జరగటం లేదు. 2024 సంవత్సరం ఏప్రిల్ 19 నుండి జూన్ 1వ తేది వరకు పార్లమెంటు సభ్యులను ఎన్నుకోవటం కోసం ఎన్నికలు జరిగాయి. పార్లమెంటు ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల శాసనసభలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. మిగతా రాష్ట్రాల శాసనసభలు కొన్నింటికి పార్లమెంటు ఎన్నికలకు ముందు, మరి కొన్నింటికి పార్లమెంటు ఎన్నికల తర్వాత ఎన్నికలు జరిగాయి. ఏ రాష్ట్ర శాసనసభకు ఐదు సంవత్సరాల కాల పరిమితి పూర్తయితే ఆ రాష్ట్ర శాసనసభకు అపుడు ఎన్నికలు జరుగుతున్నాయి. పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లిలకు ఐదు సంవత్సరాల కాల పరిమితి ముగిసేలోగా ఎన్నికలు జరిపి, కొత్త సభ్యులను ఎన్నుకోవాలన్న రాజ్యాంగ నిర్దేశం ప్రకారమే ఈ ఎన్నికలు జరుగుతున్నాయి.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత గత 75 సంవత్సరాల కాలంలో దేశంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ జరిగిన పరిణామాల రీత్యా అనేక రాష్ట్రాలలో వివిధ సమయాలలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1983లో ఎన్నికలు జరిగిన తర్వాత నాదెండ్ల భాస్కరరావుతో ఫిరాయింపులను ప్రోత్సహించి, ఎన్‌టిఆర్ నాయకత్వంలో ప్రజలెన్నుకున్న తెలుగుదేశం ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం కూల్చివేసింది. దానితో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ప్రజాగ్రహం మిన్నంటింది. ఫిరాయింపుదారుల ప్రభుత్వాన్ని తొలగించాలని, ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని పునరుద్ధరించాలని రాష్ట్రంలో పెద్ద ప్రజా ఉద్యమం జరిగింది. దానితో ఎన్‌టిఆర్‌కు తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి అవకాశం ఇవ్వటం మినహా కేంద్రం ప్రభుత్వానికి గత్యంతరం లేకపోయింది. ఈ పరిస్థితులలో 1985లో శాసనసభను రద్దుచేసి, తిరిగి ఎన్నికలు జరిపారు. తెలంగాణలో 2014లో ఎన్నికైన ప్రభుత్వం ఆరు మాసాలు

> "ఈ విధంగా దేశంలోని 29 రాష్ట్రాల శాసనసభలకు ఐదు సంవత్సరాలు పూర్తయే సమయానికి- పార్లమెంటు ఎన్నికలతో నిమిత్తం లేకుండా- ఎన్నికలు జరుగుతున్నాయి. ఆయా స్థాయిలలో ప్రజలు శాసనసభ, తమ పరిధిలోని సంస్థలకు ప్రతినిధులను ఎన్నుకొంటున్నారు. ఇపుడు జమిలి ఎన్నికలను తీసుకొస్తే, వివిధ స్థాయిలలోని ప్రజాసంస్థలకు తమ ప్రతినిధులను ఎన్నుకోవటానికి ప్రజలకున్న హక్కును వమ్ము చేస్తారు. ప్రజలపై నిరంకుశ పాలన రుద్దుతారు."

ముందుగానే శాసనసభను రద్దు చేయటంతో 2018 అక్టోబరులోనే ఎన్నికలు జరిగాయి. తిరిగి 2023 అక్టోబరుతో ఆ శాసనసభ కాల పరిమితి ముగియటంతో పార్లమెంటు ఎన్నికల కన్నా ముందే తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో పార్లమెంటు ఎన్నికల కన్నా ముందే ఎన్నికలు జరగగా, పార్లమెంటు ఎన్నికల తర్వాత హర్యానా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగాయి.

ఈ విధంగా దేశంలోని 29 రాష్ట్రాల శాసనసభలకు ఐదు సంవత్సరాలు పూర్తయే సమయానికి- పార్లమెంటు ఎన్నికలతో నిమిత్తం లేకుండా- ఎన్నికలు జరుగుతున్నాయి. ఆయా స్థాయిలలో ప్రజలు శాసనసభ, తమ పరిధిలోని సంస్థలకు ప్రతినిధులను ఎన్నుకొంటున్నారు. ఈ విధంగా ప్రజాస్వామిక ప్రక్రియ కొనసాగుతున్నది. ఇపుడు జమిలి ఎన్నికలను తీసుకొస్తే, వివిధ స్థాయిలలోని ప్రజాసంస్థలకు తమ ప్రతినిధులను ఎన్నుకోవటానికి ప్రజలకున్న హక్కును వమ్ము చేస్తారు. ప్రజలపై నిరంకుశ పాలన రుద్దుతారు.

### జాతీయోద్యమం, కమ్యూనిస్టుల కృషితో సంక్షేమ పథకాలు

సంక్షేమ పథకాలకు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయి. కార్పొరేట్లకు సర్వం కట్టబెట్టటమే ఆ పార్టి విధానం. స్వాతంత్ర్యోద్యమంలో సామాన్య ప్రజల సమస్యలు ముందుకు రావటంతో కాంగ్రెస్‌తో సహా ఉద్యమంలో పాల్గొన్న పార్టీలు ఆయా సమస్యల పరిష్కారాన్ని కూడా ఉద్యమంలో భాగంగా చేశాయి. ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని, తిండి, బట్ట, ఇల్లు, విద్య, వైద్యం లాంటి మౌలిక సమస్యలను పరిష్కరిస్తామని వాగ్దానం చేశాయి. స్వాతంత్ర్యానికి ముందు, అనంతరం కూడా దేశంలో పేదలకు భూములు, ఇళ్ళు, ఇళ్ళస్థలాలు ఇవ్వాలని, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేయాలని విశాలమైన ఉద్యమాలు జరిగాయి. లక్షల సంఖ్యలో ప్రజలు ఈ ఉద్యమాలలో పాల్గొన్నారు. 1957లో కేరళలో అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు పార్టి నాయకత్వంలోని మొదటి రాష్ట్ర ప్రభుత్వం భూసంస్కరణలను అమలు జరిపి, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులకు భూములు ఇవ్వటానికి పూనుకున్నది. ప్రజా సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్నది. 1977 నుండి 2011 వరకు పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం అమలు జరిపిన భూ సంస్కరణలు, సంక్షేమ విధానాలు దేశప్రజలపై ప్రగాఢమైన ముద్ర వేశాయి. అదేకాలంలో మధ్యలో విరామం ఉన్నా త్రిపుర, కేరళ రాష్ట్రాలలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వాలు భూపంపకం చేయటంతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలుచేశాయి. కమ్యూనిస్టు పార్టి (మార్క్సిస్టు) నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన ఈ విధానాలు వివిధ రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలను అమలు జరపక తప్పని పరిస్థితులను కల్పించాయి. ఫలితంగా దేశంలోని ప్రతి రాజకీయ పార్టి తన విధానాలతో నిమిత్తం లేకుండా తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ప్రకటిస్తున్నాయి. అందువలన పార్లమెంటు ఎన్నికలైనా, రాష్ట్రాల శాసనసభలకు జరుగుతున్న ఎన్నికలైనా తాము అధికారంలోకి వస్తే వ్యవసాయ కార్మికులు, రైతులు, వృత్తిదారులు, చిన్న వ్యాపారాలు, పరిశ్రమలు, కౌలురైతులు తదితరులకు రుణమాఫీ చేస్తామని, విరివిగా రుణాలిప్పిస్తామని, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని అన్ని పార్టీలు ప్రకటించక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి.

### సంక్షేమ పథకాల రద్దు బిజెపి లక్ష్యం

దేశంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేయటం, సంపదలను మొత్తంగా బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టటం బిజెపి విధానాలలో ప్రధానాంశం. మోడి 2014 ఎన్నికలలో వివిధ రకాలైన సంక్షేమ పథకాలను అమలు చేస్తామని వాగ్దానం చేశాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని సంక్షేమ పథకాలను అమలు చేయటం ప్రారంభించారు. గరీబ్ కల్యాణ్ యోజన, వంటగ్యాస్‌ను 400 రూపాయలకే ఇవ్వటం, రైతులకు డబ్బును అందజేయటం తదితరాలను ప్రారంభించారు. తర్వాత వాటిని క్రమంగా కుదించటానికి పూనుకున్నారు. రాష్ట్రాల శాసనసభలకు జరిగే ఎన్నికలలో తాము అధికారంలోకి వస్తే ఉచితాలను అందిస్తామని బిజెపి ప్రజలకు వాగ్దానాలు చేస్తున్నది. యుపి ఎన్నికలలో ప్రజలకు చౌక ధరలలో ఇళ్ళు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేశారు.

2022లో బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు సంక్షేమ పథకాలకు వ్యతిరేకంగా బహిరంగంగా ప్రచారాన్ని ప్రారంభించాయి. సంక్షేమ పథకాలను అమలు చేయటం ద్వారా రాజకీయ నాయకులు ప్రజలను అవినీతిపరులను చేయటానికి, వారిని కొనుగోలు చేయటానికి ప్రయత్నిస్తున్నారని మోడి ప్రచారం ప్రారంభించాడు. మోడి ఈ ప్రచారం ప్రారంభించిన తర్వాత వివిధ స్థాయిలలోని బిజెపి నాయకులు, మంత్రులు, ప్రభుత్వ ఆదేశాలతో వివిధ మంత్రిత్వ శాఖల అధికారులు సంక్షేమ పథకాలపై దాడిని పెంచారు. వివిధ రాష్ట్రాల-ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాల-అభివృద్ధిని ఉచితాలు దెబ్బతీస్తున్నాయన్న ప్రచారాన్ని తీవ్రం చేశారు. మోడి, బిజెపి నాయకులు ఉచితాలంటూ ప్రచారం చేస్తున్నవన్ని సామాన్య ప్రజల జీవితావసరాలను తీర్చేవే.

సంక్షేమ పథకాలు, జీవనావసరాలను సంపాదించుకోవటం కోసం ప్రజలు సమైక్యంగా పోరాటాలు చేస్తుండటంతో మతం పేరుతో సమాజాన్ని చీల్చాలన్న ఆర్ఎస్ఎస్, బిజెపి కుట్రలు విఫలం అవుతున్నాయి. అందువలన ఉచితాలను గురించి ప్రచారం చేయకూడదని ప్రతిపక్షాలపై ఆంక్షలు విధించటానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. తమ పార్టి నాయకుడు అశ్వినికుమార్ ఉపాధ్యాయ చేత సంక్షేమ

పథకాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటీషన్ కూడా దాఖలు చేయించింది.

ఈ ప్రచారం ప్రారంభించిన తర్వాత బిజెపిపై ప్రజలలో ఆగ్రహావేశాలు తీవ్రమైనాయి. అదే సమయంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో అసెంబ్లి ఎన్నికలు వచ్చాయి. ప్రజల సంక్షేమ పథకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఎన్నికలలో పుట్టగతులుండవని బిజెపికి అర్థం అయింది. అందువలన తాత్కాలికంగా ఈ అంశాన్ని పక్కన పెట్టినప్పటికీ, సరైన సమయంలో సంక్షేమ పథకాలను రద్దు చేయటానికి "గోతికాడ నక్క" లాగా బిజెపి కాచుకొని కూర్చున్నది. పేదలకు అందిస్తున్న సబ్సిడి బియ్యం, ఇతర నిత్యావసరాలు, మహాత్మాగాంధి జాతీయ ఉపాధి హామి చట్టం, పంటలకు మద్దతు ధరల విధానం, రైతులకు, పేదలకు ఇస్తున్న వివిధ రకాలైన సబ్సిడిలు, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్‌లు, ఉచిత విద్య, ఉచిత వైద్యం తదితరాలన్నింటిపై బిజెపి ప్రభుత్వం దాడి చేస్తున్నది. వీటిని కాపాడుకోవటానికి, మరిన్ని హక్కులను సాధించుకోవటానికి సమైక్య ప్రజా పోరాటాలు నిర్వహించటం ద్వారానే బిజెపి, కార్పొరేట్ శక్తుల కుట్రలను తిప్పికొట్టగలం.

> **"ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు గారు బడా పెట్టుబడిదారులకు అంతులేని లాభాలను, సంపదలను కట్టబెట్టటానికి పూనుకున్నాడు. ఎన్నికలలో ప్రజలు ఓడించిన జగన్ విధానాలను సాకుగా చూపుతూ ప్రజలపై కనీవినీ ఎరుగని భారాలను మోపుతున్నాడు."**



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జమిలి ఎన్నికల సిఫార్సులను అందజేస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

### బడా పెట్టుబడిదారులకు చంద్రబాబు దాసోహం

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబునాయుడు గారు బడా పెట్టుబడిదారులకు అంతులేని లాభాలను, సంపదలను కట్టబెట్టటానికి పూనుకున్నాడు. ఎన్నికలలో ప్రజలు ఓడించిన జగన్ విధానాలను సాకుగా చూపుతూ ప్రజలపై కనీవినీ ఎరుగని భారాలను మోపుతున్నాడు. రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం రూపాయి కూడా సహాయంగా ఇవ్వనప్పటికీ ప్రపంచబ్యాంకు ఇస్తున్న రుణాన్ని కేంద్రం ఉచితంగా ఇస్తున్నట్లుగా ప్రచారం చేయటంలో పోటి పడుతున్నారు. రుణం ఇవ్వటానికి ప్రపంచబ్యాంకు విధించిన షరతులు, ప్రజలపై భారాలు మోపటానికి అవి ఏ విధంగా దారితీస్తాయో వెల్లడైనప్పటికీ వాటిని గురించి నోరు మెదపటం లేదు.

డిసెంబరు 26న ఢిల్లి పర్యటనలో చంద్రబాబునాయుడు గారు బడా పెట్టుబడిదారు ఆర్సెలర్ మిట్టల్ తరఫున వక్కాల్తా పుచ్చుకున్నట్లుగా వ్యవహరించాడు. రాష్ట్రానికి కావలసిన వాటికోసం ప్రధానిని కలిశానని చెబుతున్న చంద్రబాబు అనకాపల్లి వద్ద నక్కపల్లిలో ఆలుచూలు లేని మిట్టల్ స్టీలుప్లాంటు– ఏర్పాటవుతుందో లేదో తెలీదు. ముడిఖనిజం గనులు కేటాయించాలని, అన్ని అనుమతులు త్వరగా మంజూరు చేయాలని విన్నవించాడు. కాని విశాఖ ఉక్కు ఫ్యాక్టరిని ప్రైవేటీకరించవద్దని, ఇనుప ఖనిజం గనులు కేటాయించాలని, ఆర్థిక సహకారం అందించాలని మాత్రం కోరలేదు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరిని ప్రైవేటీకరించి, మూత వేయటానికి కేంద్రం చేస్తున్నప్రయత్నాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించటానికి, ఏదో ఒక ఉక్కు ఫ్యాక్టరి ఉంటుందని ఉత్తరాంధ్ర ప్రజలను నమ్మించటానికి మిట్టల్ స్టీలు ఫ్యాక్టరి అంటూ హడావిడి చేస్తున్నారు. ఫ్యాక్టరి రాకపోయినా హడావిడి చేస్తే ఆ పేరుతో వేల ఎకరాల భూములు లాక్కోవచ్చు. ఉక్కు ఫాక్టరి విషయం ఎందుకు మాట్లాడలేదని ప్రజలు ప్రశ్నిస్తే తాను ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి వద్ద ప్రస్తావించానని చెబుతున్నాడు.

గత ముఖ్యమంత్రికి అదాని లంచాలు ఇచ్చి చేయించుకున్న సోలార్ ఎనర్జి ఒప్పందాన్ని రద్దు చేయటం గురించి మాట మాత్రం కూడా చంద్రబాబునాయుడు గారు ప్రస్తావించలేదు. ఇతరంగా కేంద్రం నుండి రాష్ట్రానికి రావలసిన నిధులను గురించి గట్టిగా మాట్లాడింది లేదు. ప్రజలపై భారాలు వేయటం, బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వంగి వంగి సలాంలు చేయటంలో జగన్, చంద్రబాబుకు ఏ మాత్రం తేడా కనిపించటం లేదు. మతోన్మాద శక్తులు రాష్ట్రంలో కాలూనటానికి ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా అవకాశం కల్పిస్తున్నది. ఎన్నుకున్న ప్రజలను మోసం చేస్తున్న ఈ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టటానికి ప్రజలు ఐక్యంగా కదలాలి.

❋

# నిధుల్లేక కునారిల్లుతున్న స్థానిక సంస్థలు-2

డా॥ బి గంగారావు



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, మహా విశాఖ నగర పాలక సంస్థ కార్పొరేటర్.

(గత సంచిక తరువాయిత)

**విద్యుత్ ఛార్జీల తగ్గింపు :** స్థానిక సంస్థలకు వీధిలైట్లు, మంచినీటి సరఫరా, ఇతర సేవలపై విద్యుత్ ఛార్జీల చెల్లింపు భారం తీవ్రంగా ఉంది. వాణిజ్య విద్యుత్ రేట్లను అమలు చేస్తున్నారు. యూనిట్‌కి రూ.7ల నుండి రూ.11ల వరకు చెల్లించవల్సి వస్తున్నది. నాల్గవ ఆర్థిక సంఘం కూడా స్థానిక సంస్థల విద్యుత్ రేట్లను డొమెస్టిక్ కేటగిరికి మార్చాలని ప్రతిపాదన చేసింది. కనుక ప్రస్తుత టారిఫ్ కేటగిరి మార్చి విద్యుత్ ఛార్జీల భారాన్ని స్థానిక సంస్థలకు తగ్గించాలి. అలాగే 3 వేల లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ ఛార్జీలను భరించాలి.

**నిధులపై ఆటానమస్ :** స్థానిక సంస్థలకు తన పరిధిలో నిధులు వినియోగించుకునే పూర్తి హక్కులు కల్పించాలి. ప్రస్తుతం పంచాయితీలకు, మున్సిపల్ కౌన్సిల్స్‌కు వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించుకునే అధికారంపై తీవ్ర పరిమితులు, ఆంక్షలు విధించబడ్డాయి. వీటిని ఉప సంహరించాలి.

**అభివృద్ధి పనులపై జిఎస్‌టి తొలగింపు :** స్థానిక సంస్థలు చేపట్టే వివిధ రకాల అభివృద్ధి పనులపై చేసే వ్యయంపై 18% జిఎస్‌టి విధిస్తున్నారు. ఇది చట్ట విరుద్ధం. దీనివల్ల స్థానిక సంస్థలు వందల కోట్ల రూపాయాలు జిఎస్‌టికి అన్యాయంగా చెల్లించాల్సి వస్తుంది. కనుక దీనిని మినహాయించాలి.

**వాణిజ్య సముదాయాలు :** స్థానిక సంస్థల పరిధిలో ఉండే వ్యాపార వాణిజ్య, సంస్థలు, మార్కెట్లోని షాపులు, కళ్యాణ మండపాల లీజు పరిమితి మూడేళ్ళకు మించి ఇవ్వకూడదు. మూడేళ్ల తర్వాత వేలం వేసే పద్ధతి ఉండాలి. బకాయి పడ్డ అద్దెల వసూలుకు ఆదేశించాలి. షాపుల కేటాయింపుల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ పిహెచ్‌సి తరగతులకు రిజర్వేషన్స్ పాటించాలి.

**యూజర్ ఛార్జీలు రద్దు :** వివిధ మౌలిక సదుపాయాలు, పౌరసేవలుపై ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్‌ను 100% ప్రజల నుండి యూజర్ ఛార్జీలరూపంలో వసూలు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ప్రజలకు తీవ్రనష్టం. పౌరసేవలను వ్యాపార సరుకులుగా చూడకూడాదు. వీటిని సామాజిక అవసరాలుగా పరిగణించాలి. కనుక పౌర సేవలపై విధిస్తున్న యూజర్ ఛార్జీల విధానాన్ని ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలి.

**ప్రయివేటీకరణ విధానాలు :** స్థానిక సంస్థల్లో పౌర సేవలు, రిక్రియేషన్స్, ఉద్యానవనాలు, కళ్యాణ మండపాలు, క్రీడా మైదానాలు, స్టేడియమ్స్, పార్కులు, ఖాళీ స్థలాలు, స్విమ్మింగ్ పూల్స్ తదితర ప్రజల ఉమ్మడి ఆస్తులను ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) క్రింద 10 నుండి 99 ఏళ్లకు ప్రైవేట్ సంస్థల పరం చేసే సంస్కరణలు విరమించాలి. ఇవన్నీ స్థానిక సంస్థలే ప్రత్యక్షంగా నిర్వహించాలి.

**గ్రామ,వార్డు సచివాలయాలు:** గ్రామ, పట్టణ, వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్ వ్యవస్థను పూర్తిగా స్థానిక సంస్థల పర్యవేక్షణలోకి తీసుకురావాలి. వాలంటీర్స్ గౌరవ వేతనాలు కూడా స్థానిక సంస్థల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. సచివాలయాల ద్వారా వచ్చే ఆదాయవనరులను స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లను రాజకీయ అవసరాలకు, నిఘా వ్యవస్థలుగా వినియోగించుకొనే అ ప్రజాస్వామిక చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలి. ప్రజాస్వామ్య బద్ధంగా స్థానిక సంస్థల పర్యవేక్షణలోనే ఇవి ఉండాలి. సచివాలయాలపై స్థానిక సంస్థలకు పూర్తి అధికారాలు ఉండాలి.

**సమాంతర వ్యవస్థలు :**

స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పివి) ఏర్పాటు పేర స్థానిక సంస్థల అధికారాలను కుదించే చర్యలు ఉపసంహరించాలి. ఎస్.పి.వి.ల వ్యవస్థలుండకూడదు. స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో విశాఖపట్నం, కాకినాడ, అమరావతి, తిరుపతి నగరాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక లిమిటెడ్ సంస్థలను రద్దుచేయాలి. ఈ మిషన్ క్రింద చేపట్టిన ప్రాజెక్టులన్నీ స్థానిక సంస్థల పరిధిలోకి తీసుకురావాలి. భవిష్యత్‌లో ఎటువంటి పథకాలైనా స్థానిక సంస్థల ఆధీనంలోనే జరగాలి.

**ప్రజా రవాణా వ్యవస్థ:**

గత 2 దశాబ్దాల నుండి గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వ ప్రజా రవాణా తీవ్రంగా కుదించబడింది. ప్రైవేట్‌రంగం మీద అంతకంతకు ఆధారపడాల్సివస్తున్నది. ఈ తిరోగమన పరిస్థితిని నిలువరించాలి. ప్రతి గ్రామ పంచాయితీకి ప్రజా రవాణా సౌకర్యం తప్పని సరిచేయాలి. గిరిజన ప్రాంతాల్లో ప్రజా రవాణా ఫ్రీక్వెన్సీ పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను ప్రైవేటీకరించే విధానాలు విడనాడాలి. ప్రభుత్వం బస్సులు సంఖ్యను కనీసం 2 రెట్లు పెంచాలి. అందుకు రవాణా సదుపాయాలు క్రింద నిధులు మంజూరు చేయాలి.

**మురికి వాడలకు 40 శాతం నిధులు :**

పట్టణ స్థానిక సంస్థలు తమ బడ్జెట్‌లలో, బేసిక్ గ్రాంట్స్‌లో కనీసం 40శాతం

నిధులు మురికివాడలో మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించాలి. ఇప్పటికే జివో ఉన్నప్పటికీ అమలు చేయడంలేదు. ఫలితంగా మురికివాడల్లో కనీస సదుపాయాలు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనుక నిధులు కేటాయింపులో మురికివాడల వాసులకు న్యాయం జరిగేలాగా సిఫార్సులు చేయాలి.

**వలస కార్మికుల ఆవాసాలు ఏర్పాటు :**

నయా–సరళీకరణ విధానాల వల్ల పట్టణ ప్రాంతాలకు పెద్దఎత్తున వలస కార్మికులు రాష్ట్రంలోను, ఇతర రాష్ట్రాల నుండి ఉపాధి కొరకు వస్తున్నారు. వీరికి ఏ హక్కులు ఉండటంలేదు. ఉద్యోగ భద్రతలేదు. అత్యంత తక్కువ వేతనాలతో తీవ్ర దోపిడికి గురవుతున్నారు. నివాస సమస్య తీవ్రంగా ఉంది. అత్యంత దయనీయమైన స్థితిలో జీవనం సాగిస్తున్నారు. ఇటువంటి వారికి పట్టణాల్లో తాత్కలిక నివాసాలు స్థానిక సమస్యలు ఏర్పాటుచేయాలి. అందుకు కనీసం పట్టణ స్థానిక సంస్థలకు వెయ్యికోట్లు నిధులు కేటాయించాలి.

**వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ ఏర్పాటు :**

ఈ కాలంలో పెద్ద సంఖ్యలో ఉపాధి కొరకు మహిళలు పట్టణాలకు వస్తున్నారు. వీరికి నివాస సమస్య, భద్రత సమస్య తీవ్రంగా ఉంది. అతితక్కువ వేతనాలకు పనిచేస్తూ దోపిడికి గురవుతున్నారు. వీరికి గనుక ప్రతి లక్షమంది జనాభాకి 200 రూముల సామర్థ్యం గల వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ ప్రతి పట్టణంలోను నిర్మించాలి. వీటి నిర్వహణ స్థానిక సంస్థల పరిధిలోకి తీసుకురావాలి. వీటి నిర్మాణాలకు ప్రతి ఏడాది వెయ్యికోట్లు చొప్పున మౌలిక సదుపాయాల గ్రాంట్లు క్రింద ఇవ్వాలి.

**గ్రంథాలయాలు:**

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీ చట్టం–1960 ప్రకారం ఆస్తిపన్ను మీద గ్రంథాలయాల అభివృద్ధి, నిర్వాహణ కొరకు 8 శాతం సెస్ వసూలు చేస్తున్నారు. గ్రామ పంచాయితీల్లో ఇది చాలా నామ మాత్రమే. ప్రస్తుతం రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో 212, గ్రామీణ ప్రాంతంలో 705 గ్రంథాలయాలు ఉన్నాయి. నేడు రాష్ట్రంలో 13,371 గ్రామ పంచాయితీలు 123 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. ఈ అంకెలు పెద్ద సంఖ్యలో గ్రంథాలయాలు నిర్మించాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

**❝ ఈ కాలంలో పెద్ద సంఖ్యలో ఉపాధి కొరకు మహిళలు పట్టణాలకు వస్తున్నారు. వీరికి నివాస సమస్య, భద్రత సమస్య తీవ్రంగా ఉంది. అతితక్కువ వేతనాలకు పని చేస్తూ దోపిడికి గురవుతున్నారు. వీరికి గనుక ప్రతి లక్షమంది జనాభాకి 200 రూముల సామర్థ్యం గల వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ ప్రతి పట్టణంలోను నిర్మించాలి. ❞**



కనీసం ప్రతి గ్రామ పంచాయితీకి ఒక గ్రంథాలయం ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో ప్రతి 10 వేల జనాభాకి ఒక గ్రంథాలయం ఉండాలి. వీటికి డిజిటలైజేషన్ సదుపాయం కల్పించాలి. ఇందుకు తప్పనిసరిగా 2025 –30 మధ్యకాలంలో ఈ లక్ష్యాన్ని పూర్తి చేయుటకు ఏడాదికి అభివృద్ధి మౌలిక సదుపాయాల క్రింద ప్రతి ఏడాదికి రూ.500 కోట్లు చొప్పున నిధులు కేటాయించాలి. అలాగే పట్టణ స్థానిక సంస్థలలో వసూలు అయ్యే సెస్ తప్పని సరిగా గ్రంథాలయాల నిర్మాణాలకు, నిర్వాహణకు ఖర్చు చేయాలి.

**మోనటరింగ్, డేటా సెల్ :**

రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులపై రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన సిఫార్సులను తప్పని సరిగా అమలు చేయటానికి రాష్ట్ర సెక్రటేరియట్‌లో ప్రత్యేక మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలి. ఇది డేటా సెల్‌గా కూడా విధులు నిర్వర్తించాలి. ఈ సెల్ ప్రతి ఏడాది స్థానిక సంస్థల నుండి పూర్తి సమాచారాన్ని సమీకరించి పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి. అలాగే కొత్తగా ఏర్పాటు చేసే ఆర్థిక సంఘాలకి ముందుగా పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసి ఇచ్చేలా అవసరమైన డేటాని సిద్ధం చేయాలి. కనుక ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను , సిబ్బందిని, అధికారులను నియమించాలి.

**ఆర్థిక సంఘాల నియామకం:**

ప్రతి 5 ఏళ్ళకోసారి ఎటువంటి జాప్యం లేకుండా రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించి నిర్ణీతకాల పరిమితిలో యాక్షన్ టేకెన్ రిపోర్టు (ఎటీఆర్)ను అమలుకు పూనుకోవాలి. ఆర్థిక సంఘం ప్రతిపాదించే ఆర్థిక పరమైన సిఫార్సులన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి అమలు చేయాలి. ❋

# రాబందు సంస్కృతి

సీతారామ్ ఏచూరి



రచయిత భారతయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మాజీ ప్రధాన కార్యదర్శి. 2005 నవంబరు 3న ఆయన రాసిన వ్యాసాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.

వర్గ ఆదిపత్యం దృష్ట్యా చూస్తే ప్రపంచీకరణ సంస్కృతి ప్రజలను తమ రోజువారీ వాస్తవికతల నుండి దూరం చేస్తుంది. సంస్కృతి ఇక్కడ సౌందర్యశాస్త్రానికి దన్నుగా నిలబడదు. పేదరికం, దౌర్భాగ్యం వంటి తక్షణ సమస్యల నుండి పక్కదోవ పట్టించడానికి వినియోగించబడుతుంది.

వైవిధ్యభరితమైన సాంస్కృతిక వ్యక్తీకరణలను పరిరక్షించి, వాటి వ్యాప్తికి తోడ్పడాలన్న తీర్మానాన్ని ఈ మధ్యనే యునెస్కో బలపరిచింది. అక్టోబర్ మొదటి వారంలో యునెస్కో 33వ జనరల్ కౌన్సిల్ సమావేశానికి హాజరయిన భారత ప్రతినిధి బృందంలో నేనూ ఒక సభ్యుడిని. కమీషన్ చర్చలలో పై తీర్మానాన్ని తిరిగి చర్చకు పెట్టాలని అమెరికా సవరణ ప్రతిపాదించింది. దాని లక్ష్యం స్పష్టమే. ఆధునిక ప్రపంచంలో ప్రతిదాన్నీ సరుకుగా మార్చినట్లే సంస్కృతిని కూడా మార్కెట్‌లో అమ్మకపు, కొనుగోలు సరుకుగా మార్చాలనేదే దాని ఉద్దేశ్యం. సాంస్కృతిక ఉత్పత్తులను డబ్ల్యూ.టి.ఓ. లోని వాణిజ్యం, సేవల పరిధిలోకి తీసుకురావాలని అమెరికా ప్రయత్నిస్తున్నది. అందుకే సార్వభౌమ దేశాల ప్రభుత్వాలు తమ సంస్కృతిని, వైవిధ్యతను పరిరక్షించుకునే హక్కు కల్పిస్తున్న యునెస్కో తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నది.

తొలిదఫా చర్చలలో అమెరికా సవరణను 160 సభ్యదేశాలలో 158 దేశాలు వ్యతిరేకించాయి. అమెరికా ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసుకుంది. కజకిస్థాన్ ఓటింగ్‌కు గైర్హాజరు అయ్యింది. తదనంతరం జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో 191 దేశాలు యునెస్కో తీర్మానాన్ని ఆమోదించాయి. కేవలం అమెరికా దాని ఉపగ్రహదేశం ఇజ్రాయిల్ - ఈ రెండు దేశాలు మాత్రమే వ్యతిరే కించాయి. అంటే అమెరికా సాంస్కృతిక సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ తమ తమ సాంస్కృతిక అస్థి త్వాలను, వైవిధ్యతలను పరిరక్షించు కోవడానికి కృతనిశ్చయంతో ఉన్నాయని స్పష్టం అవుతున్నది.

ఇవి అనవసర భయాలు అని కొట్టిపారెయ్యడానికి వీలులేదు. ప్రపంచీకరణ విధానాల ద్వారా అమెరికా కేవలం ఆర్థికపరంగా, సైనికపరంగా మాత్రమే తన ఆధిపత్యం నిలుపుకోవడానికి పరిమితం కాలేదు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలను కూడా కబళించడానికి ప్రయత్నిస్తున్నది. తన ఆధిపత్యం నెలకొల్పాలని చూస్తున్నది. ఇటువంటి తన ఆధిపత్య ధోరణుల తక్షణ ప్రయోజనం ఘనమైన లాభాలు సంపాదించడానికే.

సాంస్కృతిక ఆధిపత్యాన్ని ప్రపంచీకరించాలంటే ముందు ప్రజల అభిరుచులను ఏకీకృతం చెయ్యాలి. అలా ఏకీకృత అభిరుచులను నెలకొల్పడం కోసం సాంస్కృతిక ఉత్పత్తులను యాంత్రికంగా పునరుత్పత్తి చేసే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమెరికాకు అందుబాటులో ఉన్నది. సంస్కృతిని వాణిజ్యీకరించడమే ప్రపంచీకరణ పరమావధి. ఉదాహరణకు పశ్చిమదేశాల్లో ఉన్న వాలంటైన్స్‌డే (ప్రేమికులరోజు) హఠాత్తుగా ప్రపంచవ్యాప్తంగా పట్టణ, నగర యువతరానికి పట్టేసింది. ఈ సందర్భంగా కొనుగోళ్ళు చేసే కార్డులు, బహుమతులకు ఒక్కసారిగా గిరాకీ పెరిగిపోయింది. తృతీయ ప్రపంచదేశాల్లో అక్షరాస్యతా శాతం తక్కువగా ఉండొచ్చుగాక కానీ పిల్లలకు వాల్ట్‌డిస్నీ కార్టూన్ బొమ్మలను ఇట్టే గుర్తుపట్టేస్తారు.

వర్గ ఆధిపత్యం దృష్ట్యా చూస్తే ప్రపంచీకరణ సంస్కృతి ప్రజలను తమ రోజు వారీ వాస్తవికతల నుండి దూరం చేస్తుంది. సంస్కృతి ఇక్కడ సౌందర్యశాస్త్రానికి దన్నుగా నిలబడదు. పేదరికం, దౌర్భాగ్యం వంటి తీక్షణ సమస్యల నుండి పక్కదోవ పట్టించడానికి వినియోగించబడుతుంది. ప్రజానీకం వాళ్ళ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవడానికి పోరాడేశక్తిని పలుచన చేస్తుంది. "మన సంస్కృతిని ఊర (మాస్) సంస్కృతి, పాపులర్ సంస్కృతి, మీడియా సంస్కృతి అని మూడు రకాలుగా వర్గీకరించినా వీటన్నిటినీ స్వంతం చేసుకుని, నిర్వహించేది బహుళజాతి కార్పొరేషన్‌లే. వీటి లక్ష్యం తమ యజమానులకు లాభాలమీద లాభాలు సంపాదించి అపారమైన సంపద కూడబెట్టడమే. సంస్కృతిని ఉపయోగపు విలువకు బదులుగా వినియోగపు విలువగా మార్చడం, సామాజిక సృజనాత్మకత వికసింప చెయ్యడానికి బదులు సామాజిక నియంత్రణ కోసం వినియోగిస్తాయి" అంటాడు మైకేల్ పేరంటీ.

ఊర సంస్కృతి (మాస్ కల్చర్) పేరిట ప్రజానీకం విస్తృత వాస్తవాల పట్ల ఆలోచించనీయకుండా పక్కదారి పట్టిస్తారు. వినోదం పేరిట ప్రజలను తక్షణ సమస్యలపై దృష్టి నిలవనీకుండా చేసే సంస్కృతిని రుద్దుతారు. సంచలనాత్మక పాపులర్ సంస్కృతి పేరిట దిగజారుడు సంస్కృతిని ప్రజలకు అలవాటు చేస్తారు. ప్రజల అభిరుచిని జంక్ ఫుడ్ వైపు, అర్థం పర్థం లేని హింస వైపు, పైపై మెరుగుల వైపు మొగ్గేలా చేస్తారు.

వాస్తవానికి దీనంతటి వెనుక ఒక సైద్ధాంతిక భావజాలం ఇమిడి ఉన్నది. పైకి రాజకీయ ఉద్దేశ్యాలు లేనట్లు కనబడినప్పటికీ వినోద సంస్కృతి లింగ వివక్ష, వర్ణ వివక్ష, వినిమయదారీ, నియంతృత్వ, సైనికతత్వ, సామ్రాజ్యవాద విలువలను చిత్రరూపంలో జనం మీద రాజకీయ ప్రభావం కలుగ చేస్తుంది. (మార్క్సిస్టు రివ్యూ, ఫిబ్రవరి 1999)

ప్రపంచీకరణ సంస్కృతి అనేది సంప్రదాయానికి వ్యతిరేకం అని భావిస్తే అది పొరబాటే అవుతుంది. అది సంప్రదాయ ధోరణులను స్వంతం చేసుకుంటుంది. మీరు ఏ మ్యూజిక్ ఛానల్ అయినా పెట్టి చూడండి. భాంగ్రా, దాండియా వంటి సంప్రదాయ కళారూపాలు అన్నింటినీ ప్రపంచీకరణ సంస్కృతి స్వంతం చేసుకున్న తీరు మనకు కానవస్తుంది. ప్రజల అభిరుచిని ఏకీకృతం చెయ్యడానికి సంప్రదాయ రూపాలను వాడుకుంటుంది. యాంత్రికమైన పునరుత్పత్తి సాంకేతిక పరిజ్ఞానంతో వినోద పరిశ్రమ ఈ కళారూపాలను అమ్మి సొమ్ము చేసుకుంటుంది. సాంస్కృతిక రంగ మొఘలాయి అనదగ్గ రూపర్ట్ మర్డోక్, రామానంద్ సాగర్ నిర్మించిన రామాయణం సీరియల్ ప్రపంచవ్యాప్త ప్రసార హక్కులు కొనుగోలు చెయ్యడమే ఇందుకు తార్కాణం.

ప్రజా సంస్కృతిని అమెరికా సామ్రాజ్యవాద సంస్కృతి మింగేస్తుంది, సామ్రాజ్యవాద సంస్కృతి ఆధిపత్యం సాధించడానికి ప్రయత్నిస్తుంది అని మనం విమర్శించాం అనుకోండీ వెంటనే ప్రజలు ఆ సంస్కృతినే కోరుకుంటు న్నారయ్యా, ప్రజలు అభిరుచికి అనుగుణంగా సాంస్కృతిక రూపాలు రూపొందించి అందిస్తున్నాం, తప్పేంటి అని ఎదురు ప్రశ్నిస్తారు.

❝ ప్రజా సంస్కృతిని అమెరికా సామ్రాజ్యవాద సంస్కృతి మింగేస్తుంది, సామ్రాజ్యవాద సంస్కృతి ఆధిపత్యం సాధించడానికి ప్రయత్నిస్తుంది అని మనం విమర్శించాం అనుకోండీ వెంటనే ప్రజలు ఆ సంస్కృతినే కోరుకుంటు న్నారయ్యా, ప్రజలు అభిరుచికి అనుగుణంగా సాంస్కృతిక రూపాలు రూపొందించి అందిస్తున్నాం, తప్పేంటి అని ఎదురు ప్రశ్నిస్తారు.❞

పెట్టుబడిదారీ విధానాన్ని విశ్లేషించే క్రమంలో నూటయాభై ఏళ్ళ క్రితమే మార్క్స్ ఏం చెప్పాడో చూడండి – పెట్టుబడిదారీ "ఉత్పత్తి అనేది అవసరాన్ని తీర్చే వస్తువులను అందించడమే కాదు, వస్తువుల అవసరాన్ని కూడా సృష్టిస్తుంది"'.

ఆదిమ మొరటు తక్షణావసరాల నుండి వినిమయం జరిగినప్పుడు – ఉత్పత్తి ఆదిమ మొరటు స్థాయిలోనే ఉంటుంది కాబట్టి – అది వస్తువు మనలో నుండి వెలికి తీసే కోరిక అవుతుంది. వస్తువు అవసరాన్ని మనం భావించామంటే అది ఆ వస్తువు మనలో సృష్టించే భావమే. ఏ కళ అయినా ఆ కళాభిరుచి కలిగి, ఆ కళను ఆస్వాదించే సమూహాన్ని సృష్టించుకుంటుంది. ఇది కేవలం కళకే కాదు ఏ ఇతర ఉత్పత్తికి అయినా వర్తిస్తుంది. కాబట్టి ఉత్పత్తి అనేది కేవలం సరుకును సృష్టించడమే కాదు, ఆ సరుకు అవసరాన్ని కాంక్షించే ప్రజా సమూహాన్ని కూడా సృష్టించు కుంటుంది అంటాడు కారల్ మార్క్స్. (ఆర్థిక రాతప్రతులకు పరిచయం 1857–58).




పెట్టుబడిదారీ సంస్కృతి చిరికి మనందరికీ మిగిల్చే ఒకే ఒక అస్తిత్వం...వినియోగదారుడు

మార్క్స్ చెప్పినదే ఇవాళ మన కళ్ళముందు జరుగుతా ఉన్నది. ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లు ఖర్చు చేసి రూపొందిస్తున్న వాణిజ్య ప్రకటనలు కేవలం సరుకుల గురించి మాత్రమే ప్రచారం చెయ్యడం లేదు, ఆ సరుకుల అవసరాన్ని ప్రజలలో సృష్టిస్తున్నాయి. సంస్కృతి కూడా ఇందుకు మినాయింపు కాదు. ముందుగా సరుకును భారీగా వినిమయం చేసే ప్రేక్షక సమూహాన్ని సిద్ధం చేసుకుంటారు. వాణిజ్య ప్రకటనల రూపంలో ప్రజల అభిరుచిలో ఏకరూపత సృష్టిస్తారు. అంటే ప్రజల అభిరుచికి అనుగుణంగా కళలు సృష్టించడం కాదు, ప్రజలలో తాము ఉత్పత్తి చేసే కళలకు అనుగుణమైన అభిరుచిని ప్రజలలో సృష్టిస్తున్నారని మనం గ్రహించాలి.

అమెరికా తన ఆధిపత్యాన్ని రుద్దడానికి సాంస్కృతిక రంగం మీద కూడా పెద్ద ఎత్తున దాడికి తెగబడుతుంది. క్లింటన్ అధికార యంత్రాంగంలో పని చేసిన కొలంబియా విశ్వవిద్యాలయ ఆచార్యులు డేవిడ్ రోత్‌కోఫ్ అమెరికన్ పాలకుల ఉద్దేశాలను ఎంత చక్కగా వివరించాడో చూడండి – 'ప్రపంచం అంతా ఒకే భాషను – ఇంగ్లీష్ – అనుసరించడం అమెరికా ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల రీత్యా అవసరం. ప్రపంచం టెలికమ్యూనికేషన్స్ వైపు పురోగమిస్తుంది అనుకుంటే ప్రమాణాలు, భద్రతా అంశాలు అమెరికన్‌వి అయి తీరాలి. ప్రపంచం రేడియో, టీవీ ప్రసారాలతో అనుసంధానం అవుతుంది అనుకుంటే ఆ ప్రసారాలు అమెరికన్ సంస్కృతిని ప్రతిబింబించేవిగా రూపొందించబడినవయి ఉండాలి. ప్రపంచం కొన్ని విలువలు రూపొందించుకోవాలి అనుకుంటే అవి అమెరికన్లు సౌకర్యంగా భావించగలిగే విలువలయి ఉండాలి' అంటాడు. (టైమ్స్ ఆఫ్ ఇండియా 2005 అక్టోబరు 26 సంచికలో అర్చనా జోహగిర్‌దార్ ఉటంకింపు)

ఇలాంటి నేపధ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ ఏకోన్ముఖంగా యునెస్కో తీర్మానాన్ని బలపరచడం ద్వారా తమ సాంస్కృతిక ప్రత్యేకతలను, వైవిధ్యాన్ని పరిరక్షించుకోవడానికి కృత నిశ్చయంతో ఉన్నాయని స్పష్టం కావడం ఆహ్వానించదగిన పరిణామం, అభినందించదగిన పరిణామం.

**(అనువాదం : కె.సత్యరంజన్)**

# అస్సాం పౌరసత్వ సంక్షోభం



రచయిత గౌహతి కంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టు. ప్రస్తుతం ద్విభాషల్లో వెలువడుతున్న ఆన్‌లైన్ మేగజీన్ నెజిన్‌కు ఎడిటర్‌గా ఉన్నారు

**సుశాంత్ తాలూక్‌దార్**

గతంలో తూర్పు పాకిస్తాన్ (నేటి బంగ్లాదేశ్) నుండి వలస వచ్చి, అస్సాంలో నివసిస్తున్న వారికి భారత పౌరసత్వాన్ని ఇవ్వటం కోసం ఉద్దేశించిన 1955 పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాజ్యాంగ బద్ధంగా ఉన్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నాయకత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. దానితో 2019లో రూపొందించిన జాతీయ పౌరుల జాబితా (ఎన్‌ఆర్‌సి)ను ప్రచురించ టానికి ఉన్న చివరి న్యాయపరమైన ఆటంకం తొలగిపోయింది. సెక్షన్ 6ఎ చెల్లుబాటును సవాలు చేస్తూ 2019లో దాఖలు చేసిన పిటిషన్‌పై, రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చే తీర్పుకు అనుగుణంగా పౌరుల జాబితాను సవరించి ప్రచురించాలని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ గతంలో తీర్పు ఇచ్చింది.

బంగ్లాదేశ్ నుండి వలస వచ్చిన వారికి భారత పౌరసత్వం ఇవ్వటంపై రాజీవ్ గాంధి ప్రభుత్వం, అస్సాం రాష్ట్ర ప్రభుత్వం, ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్, గతంలో ఉన్న ఆల్ అస్సాం గణ సంగ్రామ పరిషత్‌ల మధ్య 1985లో ఒప్పందం కుదిరిన తర్వాత ఈ సెక్షన్‌ను చట్టంలో పొందుపరిచారు.

**అస్సాం ఒప్పందం ముఖ్య లక్ష్యాలు**

రాష్ట్రంలో ఉన్నవారిలో విదేశీయులు ఎవరనేది నిర్ధారించటం అస్సాం ఒప్పందంలో కీలకమైన అంశం. విదేశీయులను గుర్తించటానికి 1966, జనవరి 1ని ప్రారంభ తేదీగా తీసుకోవాలని ఒప్పందంలోని క్లాజ్ 5లో పేర్కొన్నారు. 1966 జనవరి 1వ తేదీ, 1971, మార్చి 24 తేదీల మధ్య వచ్చిన వారిని మాత్రమే క్రమబద్ధీకరించాలని, మార్చి 25 తర్వాత వచ్చిన వారికి అటువంటి అవకాశం ఉండదని ఒప్పందంలో చెప్పారు. తూర్పు పాకిస్తాన్ నుండి 1966–71 మధ్య ఎటువంటి ఆధారాలు లేకుండా రాష్ట్రంలోకి వచ్చిన వారిని గుర్తించి, విదేశీయులను రిజిస్టర్ చేసే ప్రాంతీయ కార్యాలయాలలో వారి పేర్లను రిజిస్టర్ చేసిన తేది నుండి 10 సంవత్సరాల పాటు వారి ఓటు హక్కును తొలగించాలని కూడా ఒప్పందంలో చెప్పారు. పౌరసత్వం చట్టంలోని 6ఎలో ఈ అంశాలను పొందుపరిచారు.

అస్సాం ఒప్పందంతో రాష్ట్రంలో ఉన్న విదేశీయులకు వ్యతిరేకంగా ఆరు సంవత్సరాల పాటు జరిగిన ఉద్యమం ముగిసింది. విదేశీయులను గుర్తించటానికి, వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించటానికి, రాష్ట్రం నుండి వారిని బహిష్కరించటానికి 1951 ప్రాతిపదిక సంవత్సరంగా ఉండాలని ఉద్యమ నాయకులు మొదటి దశలో కోరారు. కాని చివరికి వారు 1971, మార్చి 25 తేదిని ప్రాతిపదికగా అంగీకరించారు. ఒక సెక్షన్ మాత్రం 1951నే ప్రాతిపదిక సంవత్సరంగా ఉండాలనే డిమాండ్‌కే కట్టుబడి ఉన్నారు.

వలస వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వటానికి 1951 ప్రాతిపదిక సంవత్సరంగా ఉండాలన్న డిమాండ్‌తో, సెక్షన్ 6ఎను సవాల్ చేస్తూ ది అస్సాం సమ్మిళిత మహాసంఘ్ సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. ఎన్‌ఆర్‌సి జాబితాను ఆధునీకరించాలని కూడా కోరింది.

బంగ్లాదేశ్ నుండి వలస వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వటానికి ప్రస్తుతం రాష్ట్రంలో రెండు ప్రాతిపదిక సంవత్సరాలు ఉన్నాయి. "బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వలస వచ్చిన వారిని గుర్తించటం, వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించటం, వారిని రాష్ట్రం నుండి బహిష్కరించటం కోసం చేసుకున్న అస్సాం ఒప్పందం 1971ని ప్రాతిపదిక సంవత్సరంగా నిర్ణయించారు. పౌరసత్వ చట్టాని (సిఎఎ) కి 2019లో తీసుకొచ్చిన సవరణ ప్రకారం బంగ్లాదేశ్ నుండి "చట్ట విరుద్ధంగా దేశంలోకి వచ్చిన ముస్లిమేతర అక్రమ వలసదారులకు", పౌరసత్వం ఇవ్వటానికి 2014ను ప్రాతిపదిక సంవత్సరంగా నిర్ణయించారు.

సిఎఎ రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటీషన్లను పరిష్కరించేటపుడు పౌరసత్వాన్ని నిర్ణయించటానికి రాష్ట్రంలో రెండు వేర్వేరు చట్టాలు, రెండు ప్రాతిపదిక సంవత్సరాలు ఉండటం అవసరమా లేక అస్సాం ఒప్పందాన్ని అనుసరించి 1971 సంవత్సరమే ప్రాతిపదికగా ఉండాలా అన్న సమస్యను సుప్రీంకోర్టు పరిష్కరించవచ్చు. 1971 ప్రాతిపదిక సంవత్సరంగా ఉండాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో అఫిడవిట్లను దాఖలు చేశాయి.

తూర్పు పాకిస్తాన్‌లో జరుగుతున్న బంగ్లాదేశ్ జాతీయవాద ఉద్యమాన్ని అణచివేయటానికి పాకిస్తాన్ సైన్యం 1971, మార్చి 26న ఆపరేషన్ సెర్చిలైట్‌ను ప్రారంభించింది. కాబట్టి 1971, మార్చి 25ను ప్రాతిపదికగా నిర్ణయించటం సరైనదని సుప్రీంకోర్టు అక్టోబరు 17న ఇచ్చిన చారిత్రాత్మకమైన తీర్పులో పేర్కొంది. ఈ తేదీకి ముందు వచ్చిన వారిని దేశ విభజన సమస్య వలన వలస వచ్చిన వారిగా పరిగణించాలని చెప్పింది.

**"2014, డిసెంబరు 31వ తేదీకి ముందు సరిహద్దులు దాటి వచ్చిన హిందు, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ, క్రైస్తవ మతాలకు చెందిన వారి కేసులను తిన్నగా విదేశీయులను పరిశీలించే ట్రిబ్యునల్‌కు అప్పగించవద్దని అస్సాం ప్రభుత్వ పొలిటికల్ డిపార్ట్‌మెంట్ 2024, జులై 5వ తేదీన ఆదేశాలు జారి చేసింది."**

"పౌరసత్వ చట్టాన్ని 2003లో సవరించటానికి ముందు, సెక్షన్ 5(1)(ఎ) లో చెప్పినట్లుగా ఎటువంటి పత్రాలు లేకుండా దేశంలోకి వచ్చిన వారిని పౌరులుగా నమోదు చేయాలి. అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన వారిని పంపించి వేయాలి. కాబట్టి సెక్షన్ 6ఎ అక్రమ వలసలను నిరోధించదని, ఇతర రాష్ట్రాలలో ఉన్నవారిని కూడా పౌరసత్వం పొందటం కోసం అస్సాం వచ్చేలా ప్రేరేపిస్తున్నదని, కనుక సెక్షన్ 6ఎ రాజ్యాంగ విరుద్ధమని పిటీషన్‌దారుడు చేస్తున్న వాదన పూర్తిగా తప్పు" అని తీర్పులో పేర్కొన్నారు.

ఈ సమయంలోనే అస్సాంలో బిజెపి నాయకుడు హిమంత బిశ్వశర్మ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం 2014, డిసెంబరు 31వ తేదీకి ముందు సరిహద్దులు దాటి వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు, జైనులు, క్రైస్తవులకు చెందిన కేసులను వలసదారులను పరిశీలించే ట్రిబ్యునల్‌కు తిన్నగా పంపించవద్దని పోలీసులకు ఆదేశాలను జారిచేసింది.

**సిఎఎలోని అంశాలను బలపరుస్తూ అస్సాం ప్రభుత్వ మార్గదర్శకాలు**

2014, డిసెంబరు 31వ తేదీకి ముందు సరిహద్దులు దాటి వచ్చిన హిందు, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ, క్రైస్తవ మతాలకు చెందిన వారి కేసులను తిన్నగా విదేశీయులను పరిశీలించే ట్రిబ్యునల్‌కు అప్పగించవద్దని అస్సాం ప్రభుత్వ పొలిటికల్ డిపార్ట్‌మెంట్ 2024, జులై 5వ తేదీన ఆదేశాలు జారి చేసింది. "పౌరసత్వం కోసం నిర్దేశిత ఫారం ద్వారా భారత ప్రభుత్వ పోర్టల్‌లో దరఖాస్తు పెట్టుకోవాలని అటువంటి వారికి సలహా ఇవ్వాలి. ఆయా కేసులలోని వాస్తవాలు, పరిస్థితులను బట్టి వారికి పౌరసత్వం ఇచ్చే అంశాన్ని భారత ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఇటువంటి వారి కోసం ఒక ప్రత్యేకమైన రిజిస్టరును ఏర్పాటు చేయాలి" అని ప్రభుత్వం చెప్పింది.

వారి మతం ఏదైనప్పటికీ ఈ విధమైన ప్రత్యేకమైన అవకాశం 2014, డిసెంబరు 31 తరువాత పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి అస్సాంలో ప్రవేశించిన వారికి లభించదని ఈ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. అటువంటి వారిని గుర్తించి, తరువాతి చర్యల కోసం విదేశీయులను పరిశీలించే ట్రిబ్యునల్ న్యాయ పరిధిలోకి పంపటం జరుగుతుంది.

ఈ ఆదేశాలు సరైనవేనా అన్న న్యాయపరమైన ప్రశ్నను సుప్రీంకోర్టు తీర్పు లేవనెత్తుతున్నది. 1971–2014 సంవత్సరాల మధ్య 20,614 మంది హిందు విదేశీయులను, 27,309 మంది ముస్లిం విదేశీయులను రాష్ట్రంలో గుర్తించినట్లు ఆగస్టు 22వ తేదీన అస్సాం అసెంబ్లిలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లెక్కలు తెలుపుతున్నాయి.

**ఉన్నత న్యాయస్థానం తీర్పుతో ఎన్ఆర్‌సి అమలులో చిక్కులు**

అక్టోబరు 17న ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అస్సాంలో ఎన్ఆర్‌సి అమలులో సమస్యలను తెస్తున్నది. 2019లో ఎన్ఆర్‌సి కో ఆర్డినేటర్ ప్రచురించిన జాబితాలో 19.06 లక్షల మంది దరఖాస్తుదారుల పేర్లను ప్రచురించలేదు. ఎన్ఆర్‌సి జాబితా నుండి మినహాయించబడిన వారు అప్పీలు చేసుకొనే క్రమం ఇంకా ప్రారంభం కాలేదు. జాబితాను నోటిపై చేసిన తర్వాత మాత్రమే జాబితాలో పేర్లను చేర్చకుండా తిరస్కరించటానికి కారణాలను వెల్లడిస్తారు. కాబట్టి అప్పీలు చేసుకోవటం ఇంకా ప్రారంభం కాలేదు. ఎన్ఆర్‌సి తుది జాబితాను ప్రచురించిన తర్వాత మినహాయించబడిన వారు విదేశీయులను నిర్ధారించే ట్రిబ్యునల్‌కు అప్పీలు చేసుకోవాలి. విదేశీయులను నిర్ధారించే ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలపై అసంతృప్తి చెందిన వారు హైకోర్టుకు, ఆ తరువాత సుప్రీంకోర్టుకు వెళ్ళవచ్చు.

న్యాయవాది శంతను బోర్థోకర్ ఈ విధంగా చెప్పారు: "పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ కు రాజ్యాంగపరంగా ఎదురౌతున్న సమస్యలను సుప్రీంకోర్టు తోసిపుచ్చిన తర్వాత, సుప్రీంకోర్టు ఆమోదం కోసం ఎదురు చూస్తున్న ఎన్ఆర్‌సి తుది ముసాయిదాను ప్రచురించటంపై ప్రభావం చూపుతుంది. అత్యంత వివాదాస్పదమైన అంశానికి ప్రాతిపదికగా 1971,మార్చి 25వ తేదిని సుప్రీంకోర్టు నిర్ణయించిన తర్వాత ఎన్ఆర్‌సి తుది జాబితాను ప్రచురించటానికి ఎటువంటి ఆటంకాలు ఉండవు. ఇంకా ఆలస్యం చేయటం కోసం సాకులు చెప్పటానికి ప్రభుత్వానికి అవకాశం ఉండదు".

సిఎఎపై ఈ తీర్పు ఎటువంటి ప్రభావం చూపదని బోర్థోకర్ విశ్వసిస్తున్నారు. "పౌరసత్వానికి సంబంధించిన చట్టాలు చేయటానికి పార్లమెంటుకు ఉన్న అధికారాన్ని ఈ తీర్పు గుర్తించింది. ఈ తర్కం ప్రకారం సిఎఎ లాంటి చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉన్నదని స్పష్టమౌతున్నది. అటువంటి చట్టం రాజ్యాంగంలోని లౌకికతత్వం సారాంశానికి అనుగుణంగా ఉన్నదా లేదా అన్నది వేరే ప్రశ్న. అది కోర్టు తీర్పు చెప్పవలసిన ప్రత్యేకమైన సమస్య. ఈ తీర్పు చెప్పేటపుడు వలసల వలన అస్సాంలో తలెత్తుతున్న ప్రత్యేకమైన పరిస్థితులను కూడా ఉన్నత న్యాయస్థానం ప్రస్తావించింది. అందువలన సిఎఎ లాంటి చట్టాలను తీసుకువచ్చి, అస్సాంలో ఎక్కువ మంది విదేశీయులకు పౌరసత్వం ఇవ్వాలన్న వాదనపై కూడా ఈ తీర్పు ప్రభావం చూపిస్తుంది".

1951 ఎన్ఆర్‌సిలో పేర్లు ఉన్నవారి కుటుంబాలను, 1971, మార్చి 24వ తేది అర్ధరాత్రి నాటికి ఓటర్ల జాబితాలో పేర్లున్న వారందరి నుండి దరఖాస్తులు ఆహ్వానించి, అస్సాంలో ఎన్ఆర్‌సిని ఆధునీకరించాలి. సుప్రీంకోర్టు తీర్పులో ఈ విధంగా చెప్పారు, "అస్సాం రాష్ట్రంలో ఉన్న పౌరులందరి పేర్లను చేర్చి ఎన్ఆర్‌సిని బలపరచాలి. అదే సమయంలో విదేశీయులను గుర్తించే క్రమం కూడా దానిలో ఉన్నది. పౌరసత్వ చట్టం, దానికోసం రూపొందించిన నిబంధనలు, విదేశీయుల చట్టం, ఇవన్నీ సమగ్రంగా ఉండి, నిజమైన వలసదారులు భారత పౌరసత్వం పొందటానికి అవకాశం కల్పిస్తున్నాయి. కాబట్టి పౌరసత్వం ఇచ్చేటపుడు ఈ అంశాలన్నింటినీ కలిపి చూడాలి".

అస్సాంలో ప్రస్తుతం విదేశీయులను గుర్తించే ట్రిబ్యునల్స్ 100 ఉన్నాయి. ఈ

**"మరింత ఎక్కువ మంది హిందువులు బంగ్లాదేశ్ నుండి రాష్ట్రానికి వలస రావటాన్ని ఈ చట్టం ప్రోత్సహిస్తుందని, దానితో అస్సామీ భాష మాట్లాడే ప్రజల ఉనికి మరింతగా ప్రమాదంలో పడుతుందని అస్సాంలో సిఎఎను వ్యతిరేకించే సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. ఈ సంవత్సరం సవరించిన పౌరసత్వ చట్టాన్ని నోటిఫై చేసిన తర్వాత మార్చి నుండి జులై వరకు సిఎఎ మార్గంలో పౌరసత్వం కోసం రాష్ట్రం నుండి ఎనిమిది మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు."**

ట్రిబ్యునల్స్ ముందు 96,000 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్‌ఆర్‌సి ముసాయిదా నుండి మినహాయించబడిన 19.06 లక్షల మంది వాదనలు, అభ్యంతరాలకు సంబంధించిన కేసులను సత్వరం పరిష్కరించేందుకు 2020, ఫిబ్రవరి 6వ తేదీన అదనంగా 200 ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేశారు. కాని 2022, అక్టోబరు 14 నుండి ఇవి పని చేయటం లేదు.

ఎన్‌ఆర్‌సి దరఖాస్తులలో దరఖాస్తు దారుల మతం గురించి తెలియజేసే కాలం లేదు. పార్టీకి స్థిరమైన ఓటు బ్యాంకుగా ఉన్న బెంగాలి హిందువులు ఎక్కువ మంది ఎన్‌ఆర్‌సి జాబితా నుంచి మినహాయించిన వారిలో ఉంటారన్న భావనతో అంతిమంగా ప్రచురించిన ముసాయిదాను బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. 1971కి ముందు తూర్పు పాకిస్తాన్‌లో జరిగిన హింసాకాండను భరించలేక పారిపోయి వచ్చిన హిందు బెంగాలిలకు ఇచ్చిన శరణార్థి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను, భౌతికంగా ఉన్న ఆధారాలను పరిశీలించటానికి ఎన్‌ఆర్‌సి అధికారులు నిరాకరించటం వలన బెంగాలి హిందువులు పెద్దసంఖ్యలో జాబితా నుండి తొలగించ బడ్డారని బిజెపి వాదిస్తున్నది.

గత తూర్పు పాకిస్తాన్, ప్రస్తుత బంగ్లాదేశ్ నుండి 2014, డిసెంబరు 31 నాటికి అస్సాంలోకి వచ్చి, ఎన్‌ఆర్‌సి జాబితాలో పేర్లు లేనివారు పౌరసత్వం పొందటానికి సిఎఎ ద్వారా ప్రయత్నం చేస్తారని బిజెపి, సంఘ్ పరివార్‌లు భావించాయి. సిఎఎ ద్వారా పౌరత్వం పొందటం కోసం తాము పాకిస్తాన్, బంగ్లాదేశ్ లేదా ఆఫ్ఘనిస్తాన్ పౌరులమని డాక్యుమెంట్ల ద్వారా నిరూపించుకోవాలి. ఎన్‌ఆర్‌సిలో తమ పేర్లు నమోదు చేయించుకోవటం కోసం ప్రాతిపదికగా నిర్ణయించిన 1971 సంవత్సరం నుండి తాము భారత పౌరులమేనని నిరూపించుకోవటానికి అవసరమైన డాక్యుమెంట్లను అందజేయాలి. సిఎఎ మార్గంలో భారత పౌరసత్వం పొందటం కోసం తాము బంగ్లాదేశ్ పౌరులమని ప్రస్తుతం వారు డాక్యుమెంట్లు అందజేయలేరు. ఈ విధమైన వైరుధ్యమే సిఎఎ ద్వారా పౌరసత్వం పొందటానికి తక్కువ దరఖాస్తులు రావటానికి కారణం కావచ్చు. ఈ పరిణామంతో రాష్ట్రంలో సిఎఎ గురించి ఉన్న భయాలు తొలగిపోయాయని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ వ్యాఖ్యానించాడు.

మరింత ఎక్కువ మంది హిందువులు బంగ్లాదేశ్ నుండి రాష్ట్రానికి వలస రావటాన్ని ఈ చట్టం ప్రోత్సహిస్తుందని, దానితో అస్సామీ భాష మాట్లాడే ప్రజల ఉనికి మరింతగా ప్రమాదంలో పడుతుందని అస్సాంలో సిఎఎను వ్యతిరేకించే సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. ఈ సంవత్సరం సవరించిన పౌరసత్వ చట్టాన్ని నోటిఫై చేసిన తర్వాత మార్చి నుండి జులై వరకు సిఎఎ మార్గంలో పౌరసత్వం కోసం రాష్ట్రం నుండి ఎనిమిది మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని శర్మ చెప్పాడు.

ఇంత తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావటంతో బిజెపి ఆందోళన పడుతున్నది. సిఎఎ అమలులోకి వచ్చిన తర్వాత కూడా ఎన్‌ఆర్‌సి జాబితా నుండి మినహాయించ బడిన–1966–71మధ్య రాష్ట్రంలోకి వచ్చిన వారిని కూడా– బెంగాలి హిందువుల సమస్యను పరిష్కరించకపోవటంతో వారిలో బిజెపికి మద్దతు తగ్గిపోతున్నది. దీనితో బిజెపి కలవరపడుతున్నది.

ఎన్‌ఆర్‌సి తుది నోటిఫికేషన్ జారి చేసిన తర్వాత, రాష్ట్రంలో ఎన్నికల జాబితాను సవరించేటపుడు ఓటర్ల పౌరసత్వాన్ని నిర్ధారించుకోవటం కోసం అధికారులు వివిధ పత్రాలను పరిశీలించవచ్చు. ఎన్నికల నిబంధనలు ఈ విధంగా చెబుతున్నాయి, "పౌరసత్వాన్ని నిర్ధారించటానికి ప్రస్తుతం దేశవ్యాపితంగా ఒకే విధమైన నిబంధనలు లేనప్పటికీ, ఒక వ్యక్తి పౌరుడా, కాదా అని విచారించే సందర్భంలో ఓటర్లను రిజిస్టర్ చేసే అధికారి కొన్ని డాక్యుమెంట్లను పరిశీలించవచ్చు. (1) అందుబాటులో ఉంటే జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి). (2) పౌరుడని నిర్ధారిస్తూ అధికారులు జారి చేసిన సర్టిఫికెట్. (3) భారత ప్రభుత్వం జారి చేసిన అధికారిక పాస్‌పోర్ట్. (4) జనన ధృవీకరణ పత్రం". ఈ డాక్యుమెంట్లు చూయిస్తే సరిపోతుందని, వీటన్నింటినీ అధికారులకు అందజేయాల్సిన అవసరం లేదని కూడా స్పష్టం చేసింది.

**ఎన్‌ఆర్‌సి–చట్టవిరుద్ధంగా వలస వచ్చిన వారు–ఓటర్ల జాబితా**

చట్ట విరుద్ధంగా వలస వచ్చి రికార్డులలో పేర్లు లేని వారిని గుర్తించటం, వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించటం, వారిని రాష్ట్రం నుండి బహిష్కరించటం జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌ను ఆధునీకరించటంలో ప్రాథమిక లక్ష్యాలుగా ఉన్నాయి. నరేంద్ర మోడి రెండవ సారి ప్రధాని అయిన తర్వాత 2019, సెప్టెంబరులో విదేశాంగ శాఖ ఈ విధంగా ప్రకటించింది: "ఎన్‌ఆర్‌సిలో పేరు లేనంత మాత్రాన అస్సాంలో నివసిస్తున్న వ్యక్తులకు ఎటువంటి సమస్యలూ రావు. అంతిమ జాబితాలో పేరు లేని వారిని నిర్బంధించరు. చట్ట ప్రకారం ఉన్న అన్ని అవకాశాలూ మూసుకుపోయేంత వరకు అంతకు ముందులాగే వారికి అన్ని హక్కులు ఉంటాయి. జాబితా నుండి మినహాయించిన వ్యక్తులు "దేశం లేనివారు" కారు. ఆ పదానికి ఉన్న చట్టబద్ధమైన అర్థంలో వారు విదేశీయులు కారు. వారు గతంలో అనుభవించిన హక్కులు, అర్హతలను వారికి లేకుండా చేయరు". అయినప్పటికీ తమ బయో మెట్రిక్ ఎన్‌ఆర్‌సి అధికారుల వద్ద లేకపోవటంతో ఎన్‌ఆర్‌సి జాబితాలో పేర్లు లేనివారికి ఆధార్ కార్డు లేకుండాపోయింది.

ఎన్‌ఆర్‌సి అంతిమ ముసాయిదాను పున:పరిశీలించాలని కోరటంతో పాటు, రాష్ట్రంలో ఎన్‌ఆర్‌సి అమలుపై సుప్రీంకోర్టు ఏవైనా ఆదేశాలను జారి చేయటానికి ఉన్న అవకాశాలను గమనంలో ఉంచుకోవాలి. అంతిమ జాబితాను పున:పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నవారు ఎన్‌ఆర్‌సి అంతిమ ముసాయిదాలో అనేకమంది అనర్హుల–

**(మిగతా 34వ పేజీలో)**

# షేక్ నాజర్

(2వ పేజీ తరువాయి)

తీసుకొస్తే వాళ్ళ అమ్మగారు ఆ కంకుల్ని దంచి వండి పెట్టేవారు. ఒకరోజు నాజర్ బడికి వెళ్లి మధ్యాహ్నం వరకు చదువుకొని ఇంటికి వస్తే ఒరేయ్ అబ్బాయి ఈరోజు మీ నాన్న ఏమి తీసుకురాలేదు తినటానికి ఇంట్లో ఏమీ లేదు ఈ కాసిన్ని మజ్జిగ తాగి పో అని అన్నదట తల్లి. చిన్నపిల్లవాడైన నాజరు ఆ మజ్జిగ తాగి ఇంటి నుంచి వెళుతూ "సజ్జ జొన్నలు లేవు కానీ, చల్ల తాగి చదువుకోరా''అంటూ శ్రావ్యంగా పాడుకునే వాడట. అలానే ఆ రోజుల్లో గ్రామ్ ఫోన్ రికార్డు నుంచి విన్న ఒక పాట "కోరి భజింతు గోవిందు నా మది" అనే పాటను వీధుల్లో పాడుకుంటూ బడికి వెళు తున్నప్పుడు తన గాన మాధుర్యానికి మెచ్చి పలువురు గ్రామస్తులు పదేపదే ఆ పాటలు పాడించుకుని సంతోషించి పప్పు బెల్లాలు బహుమతిగా ఇచ్చేవారు. ఆ ఊరిలోని కొందరు మీ అబ్బాయి బాగా పాడుతున్నాడు ఎక్కడైనా సంగీతం నేర్పించకూడదా అని మస్తాన్‌తో చెప్పేవారు. నాజర్ చిన్నతనం నుండి పాటలు పాడుతూ నాటకాలలో కూడా వేషాలు ధరించేవాడు. తను చదువుతున్న పాఠశాల వార్షికోత్సవాలలో "ద్రోణ విజయం"నాటికలో ద్రోణుడి పాత్ర వేసి, తాను తన్నులు తిన్న మాస్టారి గారి చేతనే పుస్తకాలు పెన్సిళ్లు బహుమతిగా పొందాడు. శ్రీరామనవమి సందర్భంగా పెద్ద పెద్ద పందిళ్ళు వేసి నాటకాలు వేయించేవారు. ఆ పందిళ్ళలోనే శ్యామల రెడ్డి అనే ఆయన "కనకతార" అనే నాటకంలో నాజర్ చేత వేషం వేయించాడు. ఆ నాటకానికి హార్మోనియం వాయించిన వ్యక్తి ఖాదర్ సాహెబ్. ఈయన నాజర్ తండ్రి మస్తాన్ గారితో మీ అబ్బాయి బాగా పాడుతున్నాడు నాతో పంపండి నేను సంగీతం నేర్పిస్తాను అని అడిగాడు. 9, 10 సంవత్సరాలు ఉన్న నాజర్‌ను తెనాలి దగ్గర ఉన్న పెదరావూరు తీసుకువెళ్లాడు. టి ఆర్ దాసు అనే ఆయన ఆధ్వర్యంలో నడుపుతున్న "బాల రత్న "అనే నాటక సమాజంలో చేర్పించాడు. నటనలో ఆయన వద్ద తర్ఫీదు తీసుకున్నాడు. అలాగే సంగీతంలో కూడా. ఒక సంవత్సర కాలం పాటు నాటకాల్లో నటించడం, పాటలు పాడటంలో తర్ఫీదు పొందాడు. నాటకాల్లో నాజర్ స్త్రీ పాత్రలను కూడా పోషించాడు. కృష్ణ లీల లో "దేవకి "పాత్ర, కృష్ణ తులాభారంలో "రుక్మిణి", భక్త రామదాసులో "చాందిని" వంటి పాత్రలను అద్భుతంగా పోషించాడు. పాదుకా పట్టాభిషేకంలో "కైకేయి" పాత్ర, ఖిల్జీ రాజ్య పతనంలో "కమలారాణి" లాంటి పాత్రలను పోషించాడు. రామదాసు నాటకంలో "చాందిని'' పాత్ర పోషణకు తెనాలిలోని కళావంతుల వద్ద రెండు నెలలు నాట్యం నేర్చుకున్నాడు. తర్వాతి కాలంలో సుంకర సత్యనారాయణ గారి "మాభూమి" నాటకంలో దేశముఖ్ జగన్నాథ రెడ్డి పాత్రను అద్భుతంగా పోషించాడు. మాభూమి నాటక సందర్భంలో అందులో నటించిన సినీ నటి జమునకు బుర్రకథ ఎలా చెప్పాలో శిక్షణ ఇచ్చాడు. బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవడం నా నట జీవితానికి పట్టం కట్టింది అని జమున ఆ తర్వాత వ్యాఖ్యా నించారు. 12,13 ఏళ్ళ వయసులోనే తెనాలి, విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు, గూడూరు, నరసరావుపేట వంటి పట్టణాల్లో నాటకాలను ప్రదర్శించి వెండి బంగారు మెడల్సులను, అనేక వెండి కప్పులను బహుమతిగా పొందాడు.

తరువాతి కాలంలో ఖాదర్ సాహెబ్ నాజర్‌ను నరసరావుపేట తీసుకువెళ్లి అక్కడ మురుగుళ్ల సీతారామయ్య అనే ఆయన వద్ద పైమెట్టు సంగీతం నేర్చుకోవడానికి చేర్పించాడు. ఆయన నేను సంగీతం అయితే నేర్పుతాను కానీ భోజనం వసతులు నావల్ల కాదు అని చెప్పారు. నెలకు మూడు రూపాయలు ఇచ్చినట్లయితే ప్రయత్నిస్తాను అని అన్నారు. ఆ విషయం మస్తాన్ గారికి తెలిసి నా దగ్గర ఉన్న మూడు రూపాయలు మాత్రమే ఉన్నాయి ఇవి తీసుకొని ఎంతవరకు చెప్పగలిగితే అంతవరకు నేర్పండి అని అభ్యర్థించాడు. ఎలాగో మూడు నెలలు గడిచాయి. కానీ మురుగళ్ల వారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రం కావడం చేత, ఎవరి ఇళ్ల దగ్గరైనా వారాలు చెప్పుకుంటే బాగుంటుం దని ఆ ప్రయత్నం కూడా చేశారు. కానీ ఆ పట్టణంలో ఉన్న అగ్రవర్ణాలకు చెందిన వారు కానీ, ఆఫీసర్లు కానీ, వ్యాపార స్తులు కానీ ఎవరూ అంగీకరించలేదు. సంగీతం చక్కగా నేర్చుకొని ప్రతిభనుకనపరు స్తున్న నాజర్ను వదిలిపెట్టటమూ మురుగుళ్ల వారికి ఇష్టం లేదు. దాంతో ఆయన ఒక జోలి కట్టి నాజర్ భుజానికి తగిలించి మొట్టమొదటి సారిగా తన భార్య చేత భిక్ష వేయించి ఊళ్లోకి తీసుకెళ్లాడు. ఒక వేశ్యా వీధికి తీసుకెళ్లి "అమ్మా" అని పిలిచాడట. ఆ వీధిలో నలు గురు ఐదుగురు కళావంతుల కుటుంబాలు ఉన్నాయి. వారికి వేశ్యావృత్తితో పాటు కళల్లో కూడా ప్రవేశం ఉండేది. నృత్యం, నాటకాలలో నటించేవారు. వాళ్ళు బయటికి వచ్చి ఏమిటి గురువుగారు, ఈ పిల్లాడు ఏమిటి, మీరేమిటి మమ్మల్ని పిలిచారు అని అడిగితే అమ్మా వీడు నా దగ్గర సంగీతం నేర్చుకోవటానికి వచ్చాడు, తినటానికి ఏమీ లేదు, దయచేసి మీరందరూ నలుగురు నాలుగు పిడికెళ్ల బియ్యం వేస్తే నో, లేక భోజనం పెడితేనో ఇతనికి సంగీత పాఠాలు నేర్పగలను అని వారితో అన్నాడు. మీరు అడిగితే సాయం చేయకపోవడం అంటూ ఏమీ ఉండదు కానీ అతనిని మా దగ్గరికి మిగతా వాళ్ళు రానీస్తారా అంటే, అది నేను చూసుకుంటాను అన్నారు మురుగుళ్ల వారు. వాళ్లు పెట్టిన బిక్ష, వారిచ్చిన కూరగాయలతో గురువుగారి ఇంటి వద్ద వండుకు తిని సంగీత పాఠాలు నేర్చుకున్నాడు నాజర్. ఆ విధంగా నాజర్‌లోని గాత్ర మాధుర్యాన్ని మరింత మెరుగులు దిద్దారు నరసరావుపేటలోని మురుగళ్ళ సీతారామయ్య గారు. ఆయన దగ్గర నేర్చుకున్న సంగీత పాఠాలద్వారా తర్వాతి కాలంలో ఆయన సొంతంగా రాసుకున్న బుర్రకథలలోని పాటలను ఏ రాగాలలో పాడాలో, సులభ తరంగా మలచాలో ఆ మెళుకులన్నీ నేర్చుకోగలిగాడు నాజర్. నాటకాలు వేసినంత కాలం ఏదో కొంత సొమ్ము సమకూరేది. నాటకాలు లేని రోజుల్లో పొలాల్లోకూలికి వెళ్లేవాడు. 15, 16 సంవత్సరాల వయసులో ఉండగా వాళ్ల తండ్రి మస్తాన్ మరణించారు. ఇంటి భారమంతా నాజరే మోయవలసి వచ్చింది. తనకు ఒక చెల్లెలు ఉంది. ఆమె పెళ్లి కూడా తనే చేయాలి. దీనితో ఆయన వ్యవసాయ కూలీగా "పొగాకు బేరన్" ల వద్ద ముఠామేస్త్రి గా పనిచేస్తూ, తన గ్రామం అయిన పొన్నెకల్లులో ఒక కుట్టు మిషన్ నేర్చుకుని దర్జీగా పనిచేస్తూ కుటుంబా న్ని పోషిస్తూ ఉండేవాడు. అనేక పట్టణాలలో తను ఇచ్చిన నాటక ప్రదర్శనలలో వచ్చిన బహుమతులను, వెండి కప్పులను అమ్మివేసి తన చెల్లెలి పెళ్లి చేశాడు.

పాటలు పాడటంలో మంచి అనుభవం గడించిన నాజర్ గొంతెత్తి కమ్మగా పాడుతూ ఉంటే కొమ్మినేని బసవయ్య అనే ఆయన విని నీవు ఎంతో శ్రావ్యంగా పాడుతున్నావు, బెజవాడలో మా చుట్టాల పిల్లలకు సంగీతం, హార్మోనియం నేర్పమని కోరాడు. అది నాజర్ జీవితంలో ఒక కొత్త మలుపుకు దారి తీసింది. బెజవాడలో సంగీతం, హార్మోనియం నేర్పుతున్న సమయంలోనే చుట్టుపక్కల గ్రామాలు వారు మా పిల్లలను కూడా నేర్పండి

అని అడిగారు. ఆయన అలానే చేశాడు. ఆయన సొంత గ్రామమైన పొన్నెకల్లులోని వారు కూడా పిల్లలకు నేర్పమని అడిగారు. దానితో ఆయన జీవితంలో కొంత స్థాయి పెరిగింది. పొన్నెకల్లులో పాతాలు నేర్పే సమయంలోనే ఈయన దగ్గర సరిగమలు నేర్చుకున్న కుర్రవాడే ఆ తర్వాత చలనచిత్ర సీమలో గొప్ప సంగీత దర్శకుడుగా పేరు తెచ్చుకున్న "చక్రవర్తి". ఆ సమయంలోనే కమ్యూనిస్టు మహాసభలు తుళ్లూరులో జరుగుతున్నాయి. ఆ సందర్భంగా పాటల పోటీలు నిర్వహించారు. మిత్రుల ప్రోత్సాహంతో నాజర్ ఆ పాటల పోటీల్లో పాల్గొన్నారు. పాటల పోటీల్లో ఆయనకు బహుమతి రానే వచ్చింది. అసలు ఆ పోటీలలో పాల్గొనటం అన్నదే నాజర్ జీవితంలో ఊహించని మలుపు తిప్పింది. ఇదంతా 1940, 42 ప్రాంతాల్లో జరిగింది. కమ్యూనిస్టులైన వేములపల్లి శ్రీకృష్ణ, కొండపనేని రామారావు గార్లు, నాజర్‌ను కమ్యూనిస్టు ఉద్యమాల్లో కళా రంగంలో పాల్గొని ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాన్ని స్వీకరించవచ్చు కదా! రండి మాతో అని ఆహ్వానించారు. నాజర్ మీద అప్పటికే హేతువాద సాహిత్య, త్రిపురనేని రామస్వామి సాహిత్య ప్రభావం బాగా ఉంది. దానితో ప్రజా కళలలో పాలుపంచుకోవటానికి అంగీకరిం చాడు నాజర్. రెండవ ప్రపంచ యుద్ధం నాటి రాజకీయ కల్లోల వాతావరణంలో తెలుగునాట కమ్యూనిస్టులు ప్రజా కళలతో ప్రజలను చైతన్య పరుస్తున్న కాలం అది. కళాతపస్వి డాక్టర్ గరికిపాటి రాజారావు గారి ఆధ్వర్యంలో ప్రజా నాట్యమండలి ఏర్పాటయింది. ఆయన అనేక జానపద కళారూపాలను ప్రజా కళారూపాలుగా మలిచిన వ్యక్తి. ఆయన వైద్యుడు అయినప్పటికీ ప్రజానాట్యమండలిలో చురుకుగా పాల్గొంటూ తగిన సూచనలు ఇస్తూ నాజరు చేత బుర్రకథలు చెప్పిస్తూ, వివిధ నాటకాలు వేయిస్తూ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వారు. వేములపల్లి శ్రీకృష్ణ, కొండపనేని రామారావు గారి ప్రోత్సాహంతో గుంటూరుకి వచ్చిన నాజర్ ఒక బుర్రకథను నేర్చుకొని చెబితే ప్రచారానికి బాగుంటుందని నిర్ణయించారు. వేపూరి రామకోటి ప్రధాన కథకుడు, నాజర్ హాస్యం, ముక్కామల పురుషోత్తం రాజకీయవంతలుగా ఒక దళాన్ని ఏర్పరిచారు. ఆ తర్వాత నాజర్ ప్రధాన కథకుడిగా రామకోటి, పురుషోత్తం వంతలుగా దళం కొనసాగింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో హిట్లర్ సైన్యాన్ని, హిట్లర్ యుద్ధ ట్యాంకులను ఆత్మాహుతి దళంతో పేల్చివేసిన వీర వనిత "టాన్యా "గురించి కాకుమాను సుబ్బారావు గారు రచించిన "సోవియట్ వీర వనిత టాన్యా" కథను నాజర్ బుర్రకథగా మార్చి మొదటగా గుంటూరు జిల్లా తాడికొండలో ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. 1944లో బెంగాల్లో కరువు వచ్చింది. అనేకమంది మరణించారు కూడా. ఆ విషయాన్ని ఇతివృత్తంగా తీసుకొని నాజర్ బుర్రకథను తయారుచేసి ప్రదర్శించాడు. ఈ బుర్రకథ ప్రజలను ఎంతగానో ఆలోచింప జేసింది. ఆ ప్రదర్శనను తిలకించిన ఆనాటి సినీ నటులు గోవిందరాజులు సుబ్బారావు గారు ప్రదర్శన అనంతరం నాజర్‌ని కౌగిలించుకొని ఇది "గుంటూరు గోంగూర దెబ్బ" అని ప్రశంసించాడు. అంతేకాకుండా నాజర్‌ని మద్రాస్ తీసుకువెళ్లి అక్కడ కూడా "బెంగాల్ కరువు" బుర్రకథను చెప్పించాడు. అది చూడ్డానికి వచ్చిన సినీ దర్శకులు గూడవల్లి రాంబ్రహ్మం గారు నేను పల్నాటి చరిత్ర అనే సినిమాను తీయడం గురించి స్క్రిప్ట్ తయారు చేసుకున్నాను, దానిలో సందర్భోచితంగా పాటలను ప్రవేశపెట్టడానికి ఏమైనా అవకాశం ఉంటే చేయమని ఆ స్క్రిప్టును నాజరికి ఇచ్చారు. తర్వాత దాన్ని నాజర్ బుర్రకథగా మలిచారు. 1945లో బాపట్లలో ఒక హైస్కూల్ ఆవరణలో "బెంగాల్ కరువు" బుర్రకథను నాజర్ ప్రదర్శించే సమయంలో ఆ ప్రదర్శనకు వచ్చిన బళ్లారి రాఘవ గారు ఉబికి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ రంగస్థలం పైకి వచ్చి నాజర్‌ను కౌగిలించుకొని బావురుమని ఏడ్చారట. నాజర్ చెప్పే బుర్రకథలు ప్రజల్లోకి అంతగా చొచ్చుకుని వెళ్లాయి అనటానికి ఇవే గొప్పతర్కాణాలు. రాయలసీమ కరువు, కష్టజీవి, పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, వీరాభిమన్యు లాంటి అనేక కథలను బుర్రకథలుగా తయారుచేసుకుని, ప్రదర్శించి ప్రజల మన్ననలను అందుకున్నాడు నాజర్. ఢిల్లీ ఆంధ్ర సంఘం ఆహ్వానం మేరకు ఆగ్రా, బొంబాయి, అహ్మదాబాద్, కలకత్తా, టాటానగర్లలో బుర్రకథలు చెప్పి ప్రజల ప్రశంసలు అందుకున్నారు.

గూడవల్లి రాంబ్రహ్మం గారు ఇచ్చిన పల్నాటి చరిత్ర స్క్రిప్టును నాజర్ పల్నాటి వీర చరిత్ర అనే బుర్రకథగా మలిచారు. ఇది నాజర్

# అస్సాం పౌరసత్వ సంక్షోభం

**(32వ పేజీ తరువాయి)**

బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వలస వచ్చిన వారు- పేర్లు ఉన్నాయని, చాలా మంది అర్హులు- నిజమైన భారత పౌరులు-పేర్లు జాబితాలో చేరలేదని వాదిస్తున్నారు.

1971కి ముందు అస్సాంలో ఉన్నామని నిరూపించుకోవటానికి ఎన్ఆర్‌సి అధికారులు అడిగిన పత్రాలను ఇవ్వలేక పోయినందున, నిరంకుశ అధికారులపై ఆధారపడిన, కాగితాలను ప్రాతిపదికగా చేసుకొని జరిగిన ఎన్ఆర్‌సిలో లోపాల కారణంగా అనేక మంది నిజమైన భారత పౌరుల పేర్లు తుది ముసాయిదాలో లేకుండాపోయాయి. దానితో అనేక కుటుంబాలు విచ్ఛిన్నమై పోయాయి.

1971 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకోవటానికి మద్దతుతో పాటు తమ జాతి మైనారిటీ అవుతుందేమోనని భయాలు కూడా కొనసాగుతున్నాయి.

1971ని ప్రాతిపదిక సంవత్సరంగా అంగీకరించటానికి రాజకీయ మద్దతు లభించటం, బంగ్లాదేశ్ నుండి వచ్చిన అక్రమ వలసదారులను గుర్తించటం తదితరాలతో పాటు, మతంతో నిమిత్తం లేకుండా 1971 తర్వాత రాష్ట్రంలోకి వచ్చిన బెంగాలి మాట్లాడే వలసదారుల వలన తాము మైనారిటీగా మారతామేమోనని అస్సామీ భాష మాట్లాడే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. "బంగ్లాదేశ్ నుండి చట్ట వ్యతిరేకంగా వచ్చిన ముస్లిం వలసదారులు మినహా", మిగతా వారిని గుర్తించటానికి 2014 ప్రాతిపదిక సంవత్సరంగా ఉండాలని బిజెపి వత్తిడి చేస్తున్నది. బంగ్లాదేశ్ ముస్లింలు, గత తూర్పు పాకిస్తాన్ నుండి వలస వచ్చిన ముస్లింలు అస్సామీ ప్రజలకు, ఇతర స్థానిక సమూహాల ప్రజలకు ప్రమాదం కలిగిస్తారంటున్న హిందుత్వవాదుల వాదనలకు కొనసాగింపే ఇది. అస్సాంను రాజకీయ రావణకాష్టంగా మార్చటానికి ఈ సమస్యలు సరిపోతాయి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

కళా రంగ జీవితంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఆ కథ ప్రదర్శించే సమయం లో ఆయన ఆవిష్కరించే వీర, రౌద్ర, కరుణ, హాస్యరసాలు ప్రేక్షకుల మదిలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంటాయి. కళా రంగంలో నాజర్ తర్వాతనే వేరే కళాకారులు ఎవరైనా అని చెప్పవలసి ఉంటుంది. బొబ్బిలి యుద్ధం బుర్రకథ కోసం ఆరు నెలల పాటు ఆ ప్రాంతమంతా తిరిగి ఎందరి వద్దనో సమా చారం సేకరించి, చర్చించి బుర్రకథను తయారు చేసుకుని ఇటు బొబ్బిలిలోనూ అటు విజయనగరంలోనూ ప్రదర్శించి శభాష్ అని అనిపించుకున్నారు.

భళానోయి భాయి తమ్ముడా
మేల్ భళానోయి దాదాన.
వినరా భారత వీరకుమారా
విజయము మనదేరా
తందాన తాన.

అంటూ నాజరు గళం నుండి విభిన్న రసాల్లో కథలు జాలు వారుతుంటే ఆ కథల్లో పేదలు తమ అంతరంగాలను దర్శించుకునే వారు. కర్తవ్యం నిర్వాహణకై కదిలే వారు. నాజరు తన బుర్ర కథల్లో సామాన్య ప్రజల నుడికారాలు, సామెతలు, జాతీయాలు పొందుపరిచి చెప్పేవారు. ఆయన నిరంతర శోధన కఠోర పరిశ్రమ సాధన ద్వారా బుర్రకథ కళను సుసంపన్నం చేశారు. అనేకమంది కళాకారులకు మార్గదర్శకుడయ్యారు.

నాజర్ తన ఉత్తేజ భరితమైన బుర్రకథల ద్వారా ప్రజలను చైతన్యపరచటమే కాకుండా ప్రజలలో పోరాట స్ఫూర్తిని రగిలిస్తుండడంతో, ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితి రావడంతో ప్రజానాట్యమండలని నిషేధించింది. ప్రజానాట్యమండలి ప్రదర్శనలు కమ్యూనిస్టు పార్టీ విస్తరించడానికి దోహదపడుతున్నాయని, ముఖ్యంగా నాజర్ ఉత్తేజ కరమైన బుర్రకథలు రైతాంగ తిరుగుబాటు పోరాటానికి కారణమని ప్రభుత్వం ప్రకటిం చింది. అంటే పాలకుల గుండెల్లో నాజర్ బుర్రకథలు ఎంతటి శక్తివంతమైన శతఘ్నులుగా పేలాయో అర్థం అవుతుంది. ఆ సమయంలోనే కమ్యూనిస్టు పార్టీ పైన కూడా నిషేధం విధించింది ప్రభుత్వం. నాజర్‌ను అరెస్టు చేయటానికి ఒకవైపు పోలీసులు, మరొకవైపు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించారు. ఆయన కాకర్లపూడి, నిడుముక్కల, పొన్నెకల్లు గ్రామాల లోని కొండ గుహల్లో అజ్ఞాతవాసం గడిపాడు. పోలీసులు గాలించినా పట్టుకోలేక పోయారు. చివరకు కుటుంబ సభ్యులపై పోలీసుల నిర్బంధ కాండ అమలు చేస్తున్న క్రమంలో నాజర్ పోలీసులకు మంగళగిరి క్యాంపులో లొంగిపోయారు. దాదాపు ఆరు నెలలు జైల్లో మగ్గిపోయారు. 1949లో జైలు నుండి విడుదలయ్యారు. విడుదలైన అనంతరం నాజర్ పార్టీతో సంబంధాలను తగ్గించుకొని, స్వతం త్రంగా సాంస్కృతిక పయనం సాగించారు. తన ఊర్లో రైతు కూలీ సంఘాలు యువజన సంఘాలు స్థాపించడం, ప్రజల్లో చైతన్యం నింపటానికి పాటలు రాయటం లాంటి కృషి మొదలుపెట్టాడు. ఆయన రాసిన పాటల్లో ఒకచోట"పొద్దున్నే చద్ది కూడు, మద్దేల నీల కూడు, కొద్దిగా జీతమయ్యే, పద్దాక తోముడయ్యే, పెద్దోరి భాగ్యమట్లు పోగాయే జీతగాడా'' ఇలాంటి పాటలు రాసి పడేవారు.

వలియా వలియా వలియో వలియా రావేలు గలవాడ రారా పోలిగాడా! అని పాడితే రైతు లోకం ఉర్రుతలూ గింది.

ఎండల్లో, వానల్లో, నీడనక నిద్రనక, పండిస్తాము పంటలు, పస్తులుంటారోరన్న! ఉప్పుంటే పప్పు ఉందా! ఉండబోతే కొంపందా! బతుకంతా వెతలాయనే నా చిన్నారి కూలన్నా! అన్న పాటతో కూలిజనం పోరాటాల్లోకి కదిలేది.

ఏరన్న రాకమునిపే ఏరువాక వచ్చెరన్నా అనే పాట విని జనం ఊగిపోయేవారు. ఇలా ప్రజలు మెచ్చిన నచ్చిన పాటలు పాడుతూ ఉన్న కాలంలో గరికపాటి రాజారావు గారు నాజర్‌కి కబురు చేశారు. పుట్టిల్లు అనే సినిమా తీస్తున్నాను అందులో ఒక సందర్భంలో బుర్రకథ ఉంటుంది నీవు రావాలి అని. అయితే నాజర్ ఆ సినిమాలో నటించలేదు కానీ పాట పాడారు. ఆ విధంగా మొట్టమొదటి సారి సినిమాలో నాజర్ కంఠం వినిపించింది. ఆ తర్వాత "అగ్గి రాముడు" సినిమాలో బుర్రకథ చెప్పటానికి అవకాశం దొరికింది. ఆ సినిమాలో ఎన్టీ రామారావు భానుమతి కూర్చొని ఉంటారు. ఆ సందర్భంలో ఒక బుర్రకథ చెప్పాలి. "అల్లూరి సీతారామరాజు" అనే బుర్ర కథను నాజర్‌తో 15 రోజుల్లో రాయించి ఆయనితోనే ప్రదర్శించి అందరి అభినందనలు పొందాడు. బుర్రకథ ఇంత అద్భుతంగా ఉంటుందా! దీనికి ఇంత ప్రభావం ఉందా! అని భానుమతి ఆశ్చర్యపోయారట. ఆ తర్వాత "పెత్తందార్లు" "నిలువు దోపిడీ" సినిమాల్లో కూడా నాజరుగారి స్వరం వినిపించింది. 1949 ,50 తర్వాత నాజర్ జీవితం కొంత గాడిలో పడింది.

కానీ పేదరికం నుండి బయట పడలేదు. కనీసం మంచి ఇల్లు కూడా కట్టుకోలేదు. ఒక రోజునె ఈదుల నారాయణరెడ్డి అనే ఆయన వచ్చి ఇదేమిటి? ఇంత గొప్ప కళాకారుడు ఈ పురిపాకలో ఉండటం ఏమిటి? అనుకొని ఆయన బుర్రకథను ఒక ఫారెస్ట్ ఏరియాలో ఏర్పాటు చేసి ఫారెస్ట్ రేంజర్ గారితో చెప్పి ఇంటి కావలసిన కలప ఇప్పించారట. ఇంకొ కరితో ఇటుకలు ఇప్పించి కాస్త ఇల్లు కట్టుకో అని చెప్పారు. ఆ విధంగా వారి వీరి ప్రోత్సాలంతో ఓ సొంత ఇల్లు లాంటిది ఏర్పాటు చేసుకోగలిగారు.

భీమవరంలో కన్నాబత్తుల రంగారాయ సోదరులు ఐదుగురు ఉండేవాళ్లు. వాళ్ల అయిదుగురు కలిసి నాజరుకు కనకాభిషేకం చేసి బంగారు గండ పెండేరం తొడిగారు." బుర్రకథ సామ్రాట్" అని బిరుదు ఇచ్చారు.. ఆ సమయంలో ఒక రథాన్ని కట్టి దానిపై షేక్ నాజరు గారిని కూర్చోబెట్టి 70 జతల ఎడ్లను ఆ రథానికి కట్టి అందులో కళాకారులు, ప్రజలు, శిష్యులు, షహనాయి, బ్యాండ్ మేళ కళాకారులతో ఊరేగించి భీమవరంలో వేదిక మీదకు తీసుకువచ్చి అక్కడ ఆయన కాలికి గండ పెండేరం తొడిగారు. వాళ్లలో మహామహులైన పండితులు ఉన్నారు. పండిత విరాట్ మహావాది వెంకటప్పయ్య శాస్త్రి గారు, అలాగే తెనాలికి చెందిన రామానుజన్ గారు, సూరి గారు అందరూ కూడా ఈ షేక్ నాజరు గారికి గండపెండేరం తొడిగేటువంటి సందర్భంలో ఉన్నారు.

నాజరు అంటేనే బుర్రకథ. బుర్రకథ అంటేనే నాజర్. నాజర్ బుర్రకథకు కేరాఫ్ అడ్రస్‌గా మారాడు. ఆయన పేరు ప్రఖ్యాతులు వినీలాకాశాన్ని అంటాయి. ప్రభుత్వ పురస్కా రాలు, శాలువాలు, సన్మానాలు సింహతలా టాలు, గండ పెండిరాలు ఊరేగింపులు ఇవన్నీ నేను బుర్రకథ చెబుతున్నప్పుడు ప్రజలు వేసే ఈలలకన్నా గొప్పవి కావు అని సవినయంగా చెప్పిన వ్యక్తి నాజర్. కమ్యూనిస్టు పార్టీతో తనకు ఉన్న సాహచర్య నేపథ్యంలో నాజర్ 1969 –70 ప్రాంతాల్లో నక్సల్ బరి ఉద్యమం మొదలైనప్పుడు మరికొన్ని బుర్రకథలు చెప్పటం ప్రారంభించారు. ఆ సమయంలోనే విప్లవ రచయితల సంఘం వారు నాజర్‌ను ఆహ్వానించి సభ్యుడిగా చేర్చుకున్నారు. కానీ ఆయన అందు లో ఇమడలేక అతి తక్కువ సమయంలోనే విరసం నుండి బయటికి వచ్చేసారు. 1978 తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు అందరూ నాజర్ ను సన్మానించారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక ఉగాది సందర్భంగా కొత్త సంవత్సరంలో అభిమానం తో నాజర్‌ను సత్కరించారు.

❃

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 8 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ఆహార వినిమయంలో 132వ స్థానంలో భారత్



"తిండి కలిగితె కండ కలదోయ్/ కండకలవాడేను మనిషోయ్" అన్నాడు గురజాడ అప్పారావు. కానీ ఈ రోజు ప్రపంచంలోనే అయిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండి, త్వరలోనే మూడో స్థానానికి ఎగబాకుతామని పాలకులు గొప్పగా చెప్పుకుంటున్న మన దేశంలో సగటు ప్రజల జీవన స్థితిగతులు ఎలా ఉన్నాయో వారి ఆహార వినిమయం చెప్పకనే చెబుతోంది.

ప్రపంచ ఆహార సంస్థ (ఎఫ్ఎఓ) భూగోళంలోని 161 దేశాలను పరిశీలించగా మన దేశం తలసరి ఆహార వినిమయంలో 132వ స్థానంలో ఉంది. ఒక మనిషి సాధారణ పద్దతుల్లో పనిచేసుకుని జీవించాలంటే పెద్ద వాళ్లకైతే రోజుకు 2000 కిలో కాలరీలు (లేక 8,400 కిలో జౌల్స్), పిల్లలకైతే 1000 కిలో కాలరీలు (లేక 4,200 కిలో జౌల్స్) శక్తినిచ్చే ఆహారం అవసరపడుతుంది. ప్రపంచంలోని దేశాల మధ్య, ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు వారు తీసుకునే ఆహారంలో కనిపిస్తోంది. కొన్ని దేశాల్లో ప్రజలు ఎక్కువ ఆహారం తీసుకుంటుండగా మరికొన్ని దేశాల్లో చాలా తక్కువ ఆహారం తీసుకుంటున్నారు. ప్రపంచ దేశాలన్నీ కులుపుకుంటే సగటు మానవుని ఆహార వినియోగం రోజుకు 2,960 కిలో కాలరీలు (లేదా 12,384 కిలో జౌల్స్) ఉంది. భారత దేశంలోని సగటు మనిషి ప్రపంచ సగటు కన్నా తక్కువ ఆహారం తీసుకుంటున్నాడు. సగటు భారతీయుని రోజువారీ ఆహార వినియోగం 2,533 కిలో కాలరీలు (లేక 10,600 కిలో జౌల్స్)గా ఉంది.

ప్రపంచంలో అత్యధికంగా ఆహారం తీసుకుంటున్న దేశాల్లో అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలు ఉండగా భారత్‌తో సహా దక్షిణాసియా, అనేక ఆఫ్రికా దేశాలు అట్టడుగు స్థానంలో ఉన్నాయి. మొత్తం 161 దేశాల జాబితా పరిశీలిస్తే ఐర్లాండ్, అమెరికా, బెల్జియం, టర్కీ, ఆస్ట్రేలియాలు మొదటి అయిదు స్థానాల్లో ఉన్నాయి. భారత దేశం 132వ స్థానంలో నిలవగా, క్యూబా 31వ స్థానంలోనూ, చైనా 48 స్థానంలోనూ, వియత్నాం 67వ స్థానంలోనూ ఉన్నాయి. మన పొరుగుదేశాలైన నేపాల్ (99వ స్థానం), శ్రీలంక (105వ స్థానం), బంగ్లాదేశ్ (128వ స్థానం) మనకన్నా కొంత మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. పాకిస్తాన్ మనకన్నా మూడు స్థానాల దిగువన (135వ స్థానంలో) ఉంది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిప్రతి: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..............................

వీధి ..............................

గ్రామం ..............................

మండలం లేదా పట్టణం ..............................

జిల్లా ..............................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.